డిసెంబర్, 2018

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి : 01 సంచిక : 05 పేజీలు : 60






## హెచ్.ఐ.వి. రహిత సమాజాన్ని నెలకొల్పి భావితరాల భవిష్యత్తును కాపాడుకుందాం!

## డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం



టిఎస్ఐఆర్‌డిలో జరిగిన నూతనంగా నియమితులైన జిల్లా పంచాయతీ అధికారుల ఫౌండేషన్ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న టిఎస్ఐఆర్‌డి ముఖ్యకార్యనిర్వహణాధికారి శ్రీమతి పౌసమి బసు ఐఏఎస్ , పాల్గొన్న విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి శ్రీ రాంప్రసాద్ , టిఎస్ఐఆర్‌డి జాయింట్ డైరెక్టర్ శ్రీ బి. నరేంద్రనాథ్ రావు, డిప్యూటి డైరెక్టర్ (ట్రైనింగ్స్) శ్రీ జి. జయపాలరెడ్డి



నూతనంగా ఎన్నిక కాబోవు సర్పంచుల శిక్షణకై మాడ్యూల్స్ తయారీ చేయు విధానంపై టిఎస్ఐఆర్‌డిలో జరిగిన వర్క్‌షాప్‌లో సూచనలు ఇస్తున్న కిలా ప్రొఫెసర్ జె.బి. రాజన్ పాల్గొన్న టిఎస్ఐఆర్‌డి అధికారులు



టిఎస్ఐఆర్‌డిలో జరుగుతున్న 5వ బ్యాచ్ బేర్‌ఫుట్ టెక్నిషియన్స్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న టిఎస్ఐఆర్‌డి మరియు సిఆర్‌డి అధికారులు

# టి.ఎస్.ఐ.ఆర్.డి

## TSIRD




సంపుటి : 01 సంచిక : 05

డిసెంబర్ 2018



ఎడిటర్

**పౌసమి బసు,** ఐ.ఏ.ఎస్.

సిఇఓ, టిఎస్ఐఆర్డి

ఎడిటోరియల్ బోర్డు

**ఇ.ఆర్. బి. నరేంద్రనాథ్ రావు**

**జి. జయపాల్‌రెడ్డి**

**ఇ.ఎస్. నాయక్**

**బి. శేషాద్రి**

**ఎస్. రామకృష్ణ**

**వి. రఘురామ్**

**కె. యాదయ్య**

**ఎ.నాగేశ్వరరావు**

కాన్సెప్ట్, ప్లానింగ్, ఎడిటింగ్, డిజైనింగ్

**సెంటర్ ఫర్ మీడియా & పబ్లికేషన్స్, టిఎస్ఐఆర్డి మరియు నవతెలంగాణ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్**

హైదరాబాద్



Online Publications

**టిఎస్ఐఆర్డి**

రాజేంద్రనగర్

హైదరాబాద్ – 500 030

తెలంగాణ, ఇండియా.

ఫోన్ : 040 – 24018656

ఫ్యాక్స్ : 040 – 24017005

E-mail:editorsthanikapalana@gmail.com

Website: www.tsird.gov.in



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికిగాని, టిఎస్ఐఆర్డికిగాని చెందినవిగా భావించనక్కరలేదు


# విషయ సూచిక


ఎయిడ్స్ నియంత్ర దిశగా అడుగులు ........ 5

టి.ఎస్.ఐ.ఆర్.డి. ఆవరణలో రూపుదిద్దుకున్న సుందరీకరణ ........ 8

పంచాయితీల పరిధిలోకి వచ్చే ప్రభుత్వ భూములు (తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్ చట్టం, 2018) ........ 10

సెర్ప్ ద్వారా సీతాఫలాలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ........ 14

వెనకబడిన గ్రామాలలో వెలుగు దీపం ........ 15

జీవ వైవిధ్యము ........ 16

గిరి పుత్రులకు రాజకీయ సాధికారత ........ 18

తెలంగాణ కోటి వృక్షాల కోన ........ 20

ప్రభుత్వ ఉద్యోగుల సెలవు నియమాలు-2 ........ 22

గ్రామపంచాయతీ రికార్డులు మరియు రిజిష్టర్ల నిర్వహణ ........ 25

వ్యవసాయ రంగంలో ఉన్న స్టార్టప్లు ........ 29

వినియోగదారుల పరిరక్షణ చట్టం - అవగాహన ........ 32

పురుగుమందులు పిచికారి చేసే సమయంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు - సమస్యాత్మక భూములు మరియు వాటి యాజమాన్యం ........ 34

నిర్మాణాత్మక డిజిటల్ విద్య ........ 38

పుడమి తల్లి పుత్రోత్సహం - రైతు భాందవుని జన్మదినం ........ 40

ఆనందంగా జీవించాలంటే.... ........ 42

మీరు - మీ వ్యక్తిత్వం ........ 45

మానసిక ఆరోగ్యం మెరుగుపరుచుకోవడం ఎలా ? ........ 48

ఖిలాఫత్ ఉద్యమం (1919 నవంబరు 23న ఢిల్లీలో మొదలైంది) ........ 51

స్వేచ్ఛకు మార్గాలు - మానవ హక్కులు ........ 56

# ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంచుదాం - వ్యాధికి గురి కాకుండా అరికడదాం!

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని 1988వ సం॥ నుండి ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నాము. అదే విధంగా ఏటా ఒక స్ఫూర్తిదాయకమైన నినాదంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాము. ఈ సంవత్సరం "నీ స్థితిని గురించి నీవు తెలుసుకో" అనే నినాదంతో ప్రజలందరూ ఈ వ్యాధి గురించి అవగాహన పెంచుకొని పరీక్షించుకునే విధంగా ప్రోత్సహించాలి.

పై నినాదంతో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ (టి.ఎస్.ఎ.సి.ఎస్.) వారు 2 కి.మీ, 5 కి.మీ మరియు 10 కి.మీ "రెడ్ రిబ్బన్ రన్" అను వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయడం జరిగింది. పై నినాదంతో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని ఐ.సి.టి కేంద్రాలతో పాటు సంచార యూనిట్ల ద్వారా రాష్ట్రంలో దూర ప్రాంతాలలోని రోగులకు సైతం వైద్య సేవలు అందజేస్తూ ఉంది.

ప్రజలందరికీ ఎయిడ్స్ గురించి మరియు వ్యాధి నివారణ గురించి అవగాహన కల్పించడం ద్వారా మాత్రమే వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చు. సమాజంలోని కట్టుబాట్లు, కళంకాలు మరియు ఇతర వ్యతిరేక వైఖరులు ఈ సమస్యను మరింత జటిలం చేయగలవు.

ఈ యొక్క సమస్యను ఎదుర్కొనుటకు, తగ్గించుటకు మరియు అవగాహన కల్పించుటకు సిద్ధంగా ఉండి ఉత్సాహవంతంగా పనిచేసే ఎన్నిక కాబడిన ప్రజా ప్రతినిధుల పాత్ర ఎంతైనా అవసరం. ఇందులో స్వయం సహాయక బృందాల పాత్ర కూడా ప్రాముఖ్యమైనది. వారి సమావేశాలలో వ్యాధిని గూర్చి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా కాలక్రమేణ సమాజంలో మార్పులు తేవడంతో పాటు కొన్ని కట్టుబాట్లను అధిగమించవచ్చు.

ఈ మాసపు ఇ-స్థానిక పాలన సంచిక గ్రామీణ ప్రాంతంలోని ఇటువంటి అంశాలను క్రోడీకరిస్తుంది. ఈ సంచిక వెలువరించుటలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి నా యొక్క అభినందనలు.

(పొసమి బసు)




# ఎయిడ్స్ నియంత్ర దిశగా అడుగులు

హెచ్.ఐ.వీ అనే వైరస్ కారణంగా వ్యాపించే ఎయిడ్స్ వ్యాధి ప్రపంచ దేశాలను, నిన్న మొన్నటిదాకా వణికించింది. 1983వ సంవత్సరంలో బయటపడిన ఈ వ్యాధికి నివారణ తప్ప చికిత్స లేదు. అయితే ఈ మధ్య కాలంలో ఈ వైరస్ వ్యాపించకుండా టీకాలను మరియు వైరస్ ఉన్న వారికి చికిత్స కనిపెట్టడానికి వివిధ దేశాల శాస్త్రవేత్తలు తమ శాయశక్తులా కృషి చేస్తున్నారు. 1988లో డబ్ల్యు.హెచ్.ఓ. డిసెంబరు 1వ తేదిని ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంగా ప్రకటించి నిర్వహించడం ప్రారంభించింది. జన బాహుళ్యంలో వ్యాధి పై శాస్త్రీయ అవగాహన పెంచడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ఏటా ఒక స్ఫూర్తిదాయకమైన నినాదంతో దీనిని నిర్వహిస్తున్నారు. 1988లో 'తెలియపరుచు' 1989లో 'యువత' 1990లో 'మహిళలు ఎయిడ్స్' 2000లో 'ఎయిడ్స్ నివారణలో పురుషుల ప్రాధాన్యత' 2015లో 'మలినమైన మీ రక్తం,స్వేదం, కన్నీళ్లు ఈ ప్రపంచాన్ని మారుస్తాయి' 2017లో 'నా ఆరోగ్యం నా హక్కు'. ఈ సంవత్సరం 'నీ గురించి నీవు తెలుసుకో' అనే వినూత్నమైన నినాదాలతో ప్రతి ఒక్కరు ఈ వ్యాధి గురించి అవగాహన పెంచుకునేలా కృషి చేస్తున్నారు.

హెచ్.ఐ.వీ. అనేది ఒక వైరస్ మాత్రమే, వ్యాధి కాదు. ఈ వైరస్ ద్వారా సోకే వ్యాధిని ఎయిడ్స్ అంటారు. వైరస్ సోకిన వెంటనే వ్యాధి రాదు. హెచ్.ఐ.వీ. దశ నుండి ఎయిడ్స్ దశకు చేరటానికి దాదాపు 8 నుండి 10 సంవత్సరాలు పడుతుంది. ఈ కాలంలో చాలా మంది హెచ్.ఐ.వీ. పాజిటివ్ కల వ్యక్తులలో అనారోగ్య లక్షణాలు పైకి కనపడవుగాని వారి ప్రవర్తన వలన ఇతరులకు చాప కింద నీరులా ఈ వ్యాధి వ్యాపిస్తుంది.

ఎయిడ్స్ వ్యాధి సంక్రమణ పై విస్తృతమైన అవగాహన కలిగించడం, ఎయిడ్స్ వ్యాధి గ్రస్థుల జీవన ప్రమాణ కాలాన్ని పెంచి మృతుల సంఖ్యను క్రమేణా తగ్గించేందుకు ఇంగ్లీషు మందుల వినియోగం వంటి కార్యక్రమాల నిర్వహణకు ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ అయిన డబ్ల్యుహెచ్‌వోతో పాటు అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్ వంటి దేశాలు ఏటా 2200ల కోట్ల డాలర్లను అల్ప, మధ్య తరహా ఆదాయ దేశాలలో ఎయిడ్స్ నియంత్రణ కొరకు నిధులు వెచ్చిస్తున్నాయి.

2000 సం.ము వరకు ఎయిడ్స్ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా 21.8 కోట్ల మంది మరణించడంతో డబ్ల్యుహెచ్‌వో అప్రమత్తమైంది. మృతుల సంఖ్యను మరింత తగ్గించేందుకు ధనిక దేశాల సహకారంతో ప్రణాళికబద్ధమైన చర్యలతో సేవలను విస్తృత పరిచింది. ఒక 2001 సంవత్సరంలోనే 3 కోట్ల మంది ఎయిడ్స్ వ్యాధికి బలయ్యారు. అందులో సబ్‌సహారా ఆఫ్రికా దేశాల్లోనే అత్యధికంగా 2.3 కోట్ల మంది మరణించారు. అప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా 40 కోట్ల మంది ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులుండగా అందులో 16 కోట్ల మంది సబ్‌సహారా ఆఫ్రికా దేశస్తులే. దాంతో బాధిత దేశాల్లో ప్రణాళికలను మరింత వేగవంతం చేసింది ప్రపంచ ఆరోగ్య సంస్థ. 2001 వరకు ఏటా 3 కోట్ల పైగా జరుగుతున్న ఎయిడ్స్ మృతుల సంఖ్యను

2004 నాటికి 2 కోట్లకే పరిమితం చేసింది.

**అందుబాటులోకి వచ్చిన వైద్యం**

ఎయిడ్స్‌కు నాలుగు దశాబ్దాల చరిత్ర ఉంది. ఇప్పటికీ మూడో అతి పెద్ద ఎయిడ్స్ బాధిత దేశంగా భారత్ కొనసాగటం ఆందోళన కలిగించే అంశం. దేశంలో 2017-2018లో 86% వ్యాధి లైంగిక సంపర్కం ద్వారానే వ్యాపించినట్లు ఐక్యరాజ్య సమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థలు ప్రకటించాయి. ముఖ్యంగా అరక్షిత లైంగిక సంపర్కం ఈ దుస్థితికి కారణం. సమర్ధ చికిత్స, మందులు అందుబాటులోకి వచ్చినప్పటికీ నేటికీ రోజూ సగటున 241మంది హెచ్ఐవీకి బలవుతుండటం ఆందోళనకర పరిణామం. కేంద్ర ప్రభుత్వం, జాతీయ ఎయిడ్స్ నివారణ సంస్థ (నాకో) తాజా గణాంకాల ప్రకారం హెచ్.ఐ.వీ -ఎయిడ్స్ వ్యాప్తి చెందుతున్న రాష్ట్రాల్లో తెలుగు రాష్ట్రాలు మొదటి అయిదు స్థానాల్లో ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి - 2017 లెక్కల మేరకు దేశంలో 46% మేరకు హెచ్.ఐ.వీ. ఇన్ఫెక్షన్లు తగ్గుముఖం పట్టాయి. 2010తో పోల్చుకుంటే 22% వరకు ఎయిడ్స్ సంబంధిత మరణాలు తగ్గాయి. 2024 నాటికి హెచ్.ఐ.వీ. వ్యాప్తి 50% తగ్గింపు లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఎయిడ్స్ రోగులకు స్వస్థత చేకూర్చి, వారి జీవితకాలాన్ని పెంచే యాంటీరిట్రో వైరల్ థెరపీ (ఏఆర్‌టీ) మందులు దేశంలో నేటికీ 40% మించి అందుబాటులో లేకపోవడం పెద్ద లోపం.

హెచ్.ఐ.వీ బిల్లు 2017లో పార్లమెంట్ ఆమోదం పొందడం రోగులకు శుభపరిణామం. ఫలితంగా టెస్ట్, అండ్ ట్రీట్ (పరీక్షించు - వైద్యం అందించు) విధానం అందుబాటులోకి వచ్చింది. జాతీయ ఆరోగ్య ముఖచిత్రం 2018 ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో లైంగిక వ్యాధులు 35% వరకు ఉన్నాయి. సిఫిలిస్(జననేంద్రియం పై కురుపు), గనేరియా (జననేంద్రియం నుండి చీము కారడం, మంట) తదితర కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఎయిడ్స్‌తో జీవిస్తున్న వారిలో 75%కి మాత్రమే తమకు ఈ వ్యాధి ఉన్నట్టుగా తెలుసు. హెచ్.ఐ.వీ ఉందని తెలియకపోవడం వల్ల వారి భాగస్వాములకు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. దీంతోపాటు విరేచనాలు, జ్వరం, ఆయాసం, తలనొప్పి, వాంతులు, బరువు కోల్పోవడం, దీర్ఘకాలిక చర్మ వ్యాధులు తదితర లక్షణాలతో బాధపడతారు. తద్వారా రోగ నిరోధక శక్తి కోల్పోతున్నారు.

భారత్ లాంటి దేశాల్లో చాలా మంది వ్యాధి సోకిన నాలుగైదు సంవత్సరాలకే మరణిస్తున్నారు. వ్యాధి సోకిందని తెలుసుకున్న వెంటనే శాస్త్రీయమైన ఏఆర్టీ మందులు వైద్య




చికిత్స తీసుకుంటే 75 నుండి 80 ఏళ్ల వరకు జీవించవచ్చు. ఈ విషయాన్ని ప్రఖ్యాత బ్రిటిష్ మెడికల్ జర్నల్ లాన్‌సెట్, అంతర్జాతీయ ఎయిడ్స్ వైద్య నిపుణుల సంఘం పరిశోధనల్లో ఉటంకించాయి. ప్రపంచంలో అత్యధిక ఎయిడ్స్ వ్యాధి బాధితులు గల దేశాల్లో స్వాజిలాండ్ 26%, బోత్స్వాన 23.4, దక్షిణాఫ్రికా 17.3 శాతంతో ముందు వరుసలో ఉన్నాయి. 2005లో 40.3 కోట్ల హెచ్.ఐ.వీ బాధితులున్నట్టు డబ్ల్యుహెచ్‌వో గుర్తించింది. అయితే అదే ఏడాది ముగిసే సరికి 1.3 కోట్లమంది మాత్రమే ఎయిడ్స్ వలన మరణించారు. 2012 ముగిసే సరికి ప్రపంచ వ్యాప్తంగా ఎయిడ్స్ వలన మరణించిన వారు 1.6 కోట్లని యుఎన్ ఎయిడ్స్ ప్రకటించింది. హెచ్.ఐ.వీ రోగుల్లో క్షయ మూలంగానూ మరణాలు సంభవిస్తున్నాయి. రోజూ ఏఆర్‌టి మాత్రలు వేసుకోవడం ఇష్టం లేని రోగులకు, లండన్‌కు చెందిన బయోటిక్ వీవ్ హెల్త్ కేర్ అనే సంస్థ నెలకు ఒకసారి మందులు లేదా ఇంజంక్షన్ తీసుకునే విధానం అందుబాటులోకి తీసుకువచ్చింది.

**విస్తరిస్తున్న పరిశోధనలు**

ఇజ్రాయెల్‌కు చెందిన జియోన మెడికల్ అనే సంస్థ సింథటిక్ పెప్‌టైడ్ మందులు ఉపయోగించి 90% వరకు హెచ్.ఐ.వీని నిర్మూలించడం వైద్య శాస్త్రంలో పెద్ద ముందడుగు. స్పెయిన్‌కు చెందిన ఎలిక్స్ అండ్ గిలియడ్ కంపెనీ హెచ్.ఐ.వీ నిర్మూలించే వాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. సంగమో అనే పరిశోధన సంస్థ మానవుల్లోని తెల్ల కణాలు హెచ్.ఐ.వీ ఇన్‌ఫెక్షన్‌కు గురి కాకుండా ఉండేందుకు సెల్ థెరపీని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. ఎనిమిదో దశకంలో ఎయిడ్స్ అంటే మరణమే శరణ్యమన్న భావన పలువురిలో ఉండేది. తొమ్మిదో దశకం నాటికి ఏఆర్‌టీ




మందులు రావడంతో ఎయిడ్స్ రోగుల జీవితాల్లో వెలుగులు ప్రసరించాయి. నేడు మధుమేహం, అధిక రక్తపోటు రోగుల మాదిరిగానే రోజూ మందులు వాడుతూ హెచ్.ఐ.వీ వున్న వ్యక్తులు మెరుగైన జీవితాన్ని గడుపుతున్నారు. వారికి కుటుంబ పరంగా, సమాజ పరంగా సరియైన సహకారం అందితే చాలా సం.ములు సంతోషకరమైన జీవితాన్ని కొనసాగిస్తారు.

పదేళ్ల క్రితం ప్రపంచంలో మొట్టమొదట ఎయిడ్స్ వ్యాధి పూర్తిగా తగ్గిన రోగిగా బెర్లిన్‌కు చెందిన టిమోతి రే బ్రౌన్ చరిత్ర సృష్టించారు. సహజంగా హెచ్.ఐ.వీ నుంచి రక్షణ పొందే కణజాలం ఉన్న వేరొకరి ఎముకలు గుజ్జును ఆయన శరీరంలోకి ఎక్కించడం ద్వారా శాశ్వతంగా ఏఆర్టి మందులు వాడే అవసరం లేకుండా ఎయిడ్స్ నుంచి విముక్తి పొందారు. వైద్య ప్రపంచం ఈ విషయం తెలుసుకుని ఆశ్చర్యపోయింది. హెచ్.ఐ.వీ రోగులకు ఈ వార్త ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఈ రంగంలో పనిచేస్తున్న శాస్త్రజ్ఞులకు హెచ్.ఐ.వీ నియంత్రణ సాధ్యమేనన్న ఆశ, నమ్మకం కలిగించి. టిమోతి రే బ్రౌన్‌కు వాడిన చికిత్సను ప్రజా బాహుళ్యంలోకి తీసుకురావడానికి కొన్ని సంస్థలు ప్రయత్నాలు ప్రారంభించాయి. హెచ్.ఐ.వీని నిరోధించే సీసీఆర్-5 ప్రోటీన్‌ను శరీరంలోకి ప్రవేశింపజేసి ఎయిడ్స్‌కు సంపూర్ణంగా అడ్డుకట్ట వేసే కొత్త ప్రక్రియకు హాంకాంగ్, అమెరికా శాస్త్రవేత్తలు కసరత్తు చేస్తున్నారు. ఇది విజయవంతమైతే ఎయిడ్స్‌కు శాశ్వత నివారణ సాధ్యమవుతుంది.

**చిన్నారుల్లో హెచ్.ఐ.వీ వ్యాప్తి**

భారత్‌లో 1,20,000 మంది 19ఏళ్ల లోపు యువత, బాలలు హెచ్.ఐ.వీతో జీవిస్తున్నారని ఐక్యరాజ్య సమితి (ఐరాస) తెలిపింది. వ్యాధి వ్యాప్తిని కట్టడి చేసేచర్యల్లో పురోగతి లేకపోతే 2030 నాటికి రోజూ 80 మంది యుక్తవయస్కులు ఈ మహమ్మారికి బలయ్యే ముప్పుందని హెచ్చరించింది. ఎయిడ్స్ దినోత్సవ నేపథ్యంలో “**చిల్డ్రన్, హెచ్.ఐ.వీ, ఎయిడ్స్, ద వరల్డ్ ఇన్ 2030**” పేరిట యూనిసెఫ్ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం – 2018 సందర్భంగా ఓ నివేదిక విడుదల చేసింది. దానిలోని **ప్రధాన అంశాలివీ.**

- తల్లులు, గర్భిణులు, యువత, పిల్లల్లో హెచ్.ఐ.వీ ముప్పును తగ్గించడంలో దక్షిణాసియాలో గణనీయ పురోగతి కనిపిస్తోంది.
- భారత్‌లో 2017లో 1,20,000 మంది చిన్నారులు, యుక్తవయస్కులు హెచ్.ఐ.వీతో జీవిస్తున్నారు. పాకిస్థాన్‌లో 5,8000 మంది, నేపాల్‌లో 1,600 మంది, బంగ్లాదేశ్‌లో వెయ్యి కంటే తక్కువ మంది హెచ్.ఐ.వీ బాలలున్నారు.
- 2017లో కొత్తగా హెచ్.ఐ.వీ సోకిన ఐదేళ్లలోపు బాలల సంఖ్య 2010తో పోలిస్తే 43% తక్కువగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా అయితే ఇది 35% వరకు తగ్గింది.
- యాంటీరెట్రో వైరల్ థెరపీ (ఏఆర్‌టీ) చికిత్స తీసుకుంటున్న 14 ఏళ్లలోపు బాలల సంఖ్య మొత్తం బాధితుల్లో 73% వరకూ ఉంది. ఇది 2010తో పోలిస్తే 50% వరకూ పెరిగింది.
- ఎయిడ్స్ మరణాలు, కొత్త ఇన్ఫెక్షన్ కేసుల సంఖ్య తగ్గుతోంది. అయితే ఈ తగ్గింపులో అంత వేగం కనిపించడం లేదు.
- హెచ్.ఐ.వీ సోకిన బాలల్లో సగం మంది ఐదేళ్లు నిండకుండానే మరణిస్తున్నారు. తల్లుల నుండి పిల్లలకు హెచ్.ఐ.వీ సంక్రమించకుండా నిరోధించే చికిత్సలు అనుకున్న స్థాయిలో లక్ష్యాలు చేరుకోవట్లేదు.
- తల్లుల నుండి పిల్లలకు హెచ్.ఐ.వీ సోకిన కేసుల గత ఎనిమిదేళ్లలో 40% వరకూ తగ్గాయి. ఇలాంటి కేసుల్లో మూడింట రెండొంతుల మంది బాధితులు బాలికలే ఉన్నారు.

మొత్తం మీద ఎయిడ్స్ మృతుల సంఖ్య అయితే తగ్గుముఖం పట్టింది కానీ వ్యాధి గ్రస్థులు మాత్రం ఏ ఏటికాఏడు పెరుగుతూనే ఉన్నారు. ఎయిడ్స్ పై అవగాహన, మందుల వాడకం పెరగడంతోనే వ్యాధిపట్ల వ్యయం క్రమేపీ తగ్గుతుందని తెలుస్తోంది. హెచ్ఐవి/ఎయిడ్స్ గురించి ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకొని తమను తాము ఆ వ్యాధికి గురికి కాకుండా చూసుకోవడంవల్ల హెచ్ఐవి ని పూర్తిగా నిర్మూలించవచ్చు.

**కె.విద్యుల్లత,**
సి.డబ్ల్యు.ఎస్- టి.ఎస్.ఐ.ఆర్.డి.

# టి.ఎస్.ఐ.ఆర్.డి. ఆవరణలో రూపుదిద్దుకున్న సుందరీకరణ










పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి రంగంలో శిక్షణకు మారుపేరుగా నిల్చిన సర్వోన్నత రాష్ట్ర ప్రభుత్వ శిక్షణా సంస్థ తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ (టి.ఎస్.ఐ. ఆర్.డి.) గా సుపరిచితమైన ఈ సంస్థ అందజేసే శిక్షణలు రాష్ట్ర, దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు తెచ్చుకున్నాయి. టి.ఎస్.ఐ. ఆర్.డి. కేవలం నిర్ణీత వైయుక్తిక శిక్షణలకే పరిమితం కాకుండా శిక్షణార్ధులు అవసరాలు తీర్చడానికి అత్యున్నతమైన శిక్షణా వసతులను కల్పించడంతో పాటు శిక్షణ నిమిత్తం టి.ఎస్.ఐ.ఆర్.డి.కు విచ్చేసిన శిక్షణార్ధులు సువిశాలమైన ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య గడిపేందుకు టి.ఎస్.ఐ.ఆర్.డి. చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా టి.ఎస్.ఐ.ఆర్.డి.ను ఒక సుందరమైన సంస్థగా తీర్చిదిద్దింది. టి.ఎస్.ఐ.ఆర్.డి.కి ఇరువైపుల ఉన్న రాళ్ళు, రప్పలను చదునుచేసి ఒక రాక్ గార్డెన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో ఎటువంటి ఆకృతిలేని గ్రానైట్ రాళ్ళను తగురీతిలో ఆకృతి కలిగించి వాటిపై పలురకాల రంగులతో వివిధ బొమ్మలను చిత్రీకరించడం జరిగింది. అదేవిధంగా రాళ్ళ మధ్యలో ఉన్న నేలను చదును చేసి అనువైన చోట్ల కార్పెట్‌గ్రాస్ మరియు షేడ్‌గ్రాస్ పెట్టడం జరిగింది. ఎదుగుదలకు నీటి సదుపాయంతో పాటు







స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది. సంస్థ ప్రాంగణంలో అనువైన స్థలంలో ప్రయోగాత్మకంగా క్షేత్ర ప్రదర్శన కోసం సేంద్రియ పద్ధతిలో రసాయన రహిత కూరగాయలు మరియు ఆకుకూరల పెంపకాన్ని చేపట్టి సంస్థకు శిక్షణ నిమిత్తం విచ్చేయు శిక్షణార్థులకు ఒక మోడల్‌గా చూపడం జరుగుతుంది. అదే విధంగా జాతీయ గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీ రాజ్ సంస్థ (ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్) సహకారంతో ఎన్.ఆర్.ఆర్.డి.ఎ. న్యూఢిల్లీ వారి స్పాన్సర్‌తో తెలంగాణ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ వారి ఆద్వర్యంలో టి.ఎస్.ఐ.ఆర్.డి.లో జూట్ టెక్స్‌టైల్స్(*Jute Textiles*), సాయిల్ స్టెబిలైజేషన్ (*Soil Stabilisation*), కాయిర్ జియోటెక్స్‌టైల్స్ (*Coir Geotextiles*) అను మూడు నూతన సాంకేతిక పద్ధతుల్ని ఉపయోగించి రోడ్లను వేయడం జరిగింది. టి.ఎస్.ఐ.ఆర్.డి. కార్యాలయం ఆవరణంలో ఉన్న పెద్ద చెట్లను కూడా వివిధ రంగులతో అలంకరించడం జరిగింది. టి.ఎస్.ఐ. ఆర్.డి.లో ఉన్న రోడ్లకు ఇరువైపులా వివిధ పూల మరియు క్రోటన్ మొక్కల కుండిలతో అలంకరించడం జరిగింది.

టి.ఎస్.ఐ.ఆర్.డి.కి శిక్షణ నిమిత్తం విచ్చేసే ప్రతి ఒక్కరూ మంచి ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య శిక్షణ పూర్తి చేసుకోవాలని టి.ఎస్.ఐ.ఆర్.డి. ఆశిస్తోంది.

**ఇ.ఆర్.బి. నరేంద్రనాద్ రావు**

జాయింట్ డైరెక్టర్, టి.ఎస్.ఐ.ఆర్.డి.




# పంచాయితీల పరిధిలోకి వచ్చే ప్రభుత్వ భూములు

## (తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్ చట్టం, 2018)

భూములకు సంబంధించి చట్టాలను చేసే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కలదు. వీటిలో ఎక్కువ భాగం రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించినవి, బ్రిటిష్ పాలకులు రూపొందించినవి కూడా ఉన్నాయి. దేశ జనాభాలో 70% గ్రామీణ ప్రజలు ప్రత్యక్షంగానో, పరోక్షరగానో భూమిపై ఆధారపడి జీవిస్తూ ఉన్నవారే. భూమి కేవలము ఆర్థిక సామాజిక అంశమే కాక, మానసిక పెట్టుబడి కూడా.

**భూముల వర్గీకరణ**

భూములను అనేక రకాలుగా వర్గీకరించవచ్చు. జిరాయితీ, రైత్వారీ భూములు, దేవాదాయ, ధర్మాదాయ భూములు, వక్ఫ భూములు, ఇనాం భూములు, ప్రభుత్వ భూములు.

**జిరాయితీ, రైత్వారీభూములు**

ఇవి వ్యక్తుల సొంత భూములుగా పరిగణిస్తారు. అనగా దాన, విక్రయాది సర్వ హక్కులు కలిగిన వ్యక్తిగత భూములను జిరాయితీ, రైత్వారీ భూములు అంటారు.

**దేవాదాయ, ధర్మాదాయ, వక్ఫ భూములు**

దేవాలయములు, ధర్మకార్యములు, మసీదులు మొదలగువాటి నిర్వహణ నిమిత్తము చక్రవర్తులు, రాజులు, జమీందారులు, ప్రభుత్వము వారు కేటాయించిన భూములు.

**ఇనాంభూములు**

గతంలో పాలించిన చక్రవర్తులు, రాజులు, జమీందారులు మొదలగువారు ఆప్రాంత సంస్కృతి, సాంప్రదాయాలను పెంపొందించుటకు, రచయితలు, కళాకారులను ప్రోత్స హించుచూ ఇచ్చిన భూములు, ధార్మిక, సామాజిక సేవలు చేయుటకు బహుమతిగా ఇచ్చిన భూములు మొదలైన వాటిని ఇనాం భూములుగా వ్యవహరిస్తారు.

**ప్రభుత్వ భూములు**

ఎ) రిజర్వు చేయని, తరంకట్టిన (శిస్తు నిర్ణయించిన) బంజరు భూములు.

బి) రిజర్వుకాని తరంకటట్టని (శిస్తు నిర్ణయించని) బంజరు భూములు.

సి) పోరంబోకు భూములు

డి) రిజర్వు చేయబడిన (తరం కట్టిన) బంజరు భూములు.

**రిజర్వు భూములు.**

ప్రత్యేక ప్రజా ప్రయోజనాల కోసం ప్రస్తుతము గాని, భవిష్యత్తులోగాని, అవసరము అవుతుందని భావించి కేటాయించబడిన భూమిని రిజర్వు భూమి అని అంటారు. అట్టి భూములను ప్రొహిబిటరిఆర్డర్ (నిషేధ ఉత్తర్వుల) రిజిష్టరులో నమోదు చేయాలి. ఉదాహరణకు : పోరంబోకులు,

చెరువు గర్భములు, మందబయలు, మేతబీళ్ళు. స్మశానములు, సాగునీటి, మురుగునీటి పోరంబోకులు, రిజర్వుఫారెస్ట్‌కు ఆనుకొని ఉన్న భూములు, విలువైన వృక్ష సంపదగల భూములు, కంటోన్మెంటు, పోర్టు, రైల్వే, విమానములుదిగుభూములు, గనులు, నదీతీరప్రాంతము, సముద్రతీరము నుండి 500 మీటర్లలోపుగల భూములను రిజర్వుభూమి, ప్రభుత్వ భూములు అంటారు. ఇవేకాకుండా భూసేకరణ చట్టం 1894 మరియు 2013 మరియు సవరణ చట్టం 2017 ద్వారా సేకరించిన భూములను కూడా ప్రభుత్వ భూములు అంటారు.

పైన పేర్కొనబడిన ప్రభుత్వ భూములలో కొన్నింటిని తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్ చట్టం, 2018 ప్రకారం పంచాయితీలకు బదలాయించారు అవి. పచ్చికబయళ్ళు, కళ్ళములు, స్మశానములు, మందబయలు మొదలైనవి. ప్రభుత్వఉత్తర్వులు జి.ఒ.ఎం.ఎస్. నం. 266 (రెవెన్యూ శాఖ) తేది. 30.3.1999 ప్రకారం పై భూములను పంచాయితీలు నిర్వహించవలెను.

ఏదైనా ప్రత్యేక ప్రయోజనం కొరకు పైన పేర్కొనబడిన భూములు ప్రభుత్వానికి అవసరమైనచో, వాటిని పంచాయితీ పరిధినుండి తొలగించి, గెజిటలో ప్రచురించిన తరువాత మాత్రమే ప్రభుత్వ ఆధీనములోకి తీసుకోవచ్చును.

**తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్ చట్టం, 2018 పంచాయితీల పరిధిలోకి వచ్చే ప్రభుత్వ భూములు ;**

**సెక్షన్ 53 అడవుల నిర్వహణను గ్రామ పంచాయితీలకు బదిలీచేయుట**

**సెక్షన్ 53(1)** ప్రకారం గ్రామానికి ఆనుకొనియున్న అటవీ భూముల నిర్వహణ గ్రామ పంచాయితీలకు కలదు. గ్రామ పంచాయితీకి ఒక అవకాశము ఇచ్చిన తరువాత అటవీ భూముల యాజమాన్య నిర్వహణను గ్రామ పంచాయితీ నుండి ఉపసంహరించ వచ్చును.

**సెక్షన్ 53(2)** సబ్ సెక్షన్(1) ప్రకారం అడవుల అజమాయిషీ మరియు నిర్వహణ భాధ్యతను గ్రామపంచాయితీకి బదిలీ చేసినపుడు వాటికి సంబంధించిన ఆదాయ, వ్యయాలను ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా ప్రభుత్వము మరియు గ్రామ పంచాయితీల మధ్య పంచవలెను.

**సెక్షన్ 54 సంస్థల యొక్క నిర్మాణపు పనులు గ్రామ పంచాయితీలకు బదిలీచేయుట**

**సెక్షన్ 54(1)** ప్రభుత్వము, జిల్లా కలెక్టరు, రెవెన్యూ డివిజనల్ అధికారి, మండల ప్రజాపరిషత్ లేదా జిల్లా ప్రజాపరిషత్, వ్యక్తి, వ్యక్తుల సముదాయము గ్రామపంచాయితీకి గ్రామసభ తీర్మానము ద్వారా బదిలీకాబడిన, గ్రామపంచాయితీ పరిధిలోగల



సంస్థలలో జరిగే నిర్మాణపు పనుల పర్యవేక్షణ, నిర్వహణ భాధ్యత ఆగ్రామపంచాయితీకి కలదు.

**సెక్షన్ 54(2);** సబ్ సెక్షన్ (1) ద్వారా గ్రామపంచాయితీ కి బదిలీకాబడిన ఏవిధమైన ఆస్తులుగాని, దేవాలయములు, ఆదాయములు ప్రభుత్వ నిబంధనలకు, న్యాయసూత్రాలకు లోబడి మాత్రమే నిర్వర్తించాలి.

**సెక్షన్ 55 దేవాదాయ, ధర్మాదాయ మరియు ఇనాముల నియంత్రణను బదిలీ చేయుటకు, మరల తిరిగితీసుకొనుటకు ప్రభుత్వానికి అధికారం కలదు**

**సెక్షన్ 55 (1)(ఎ)** తెలంగాణ ఎస్టేటు మరియు వారసులులేని ఆస్తుల చట్టము 1974 ప్రకారము, గ్రామపంచాయితీ అనుమతితో ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా దేవాదాయ, ధర్మాదాయ మరియు ఇనాములకు సంబంధించిన అన్ని అధికారములు, విధులు గ్రామపంచాయితీకి దాఖలు చేయబడతాయి. దేవాదాయ, ధర్మాదాయశాఖ నుండి విడివడి గ్రామపంచాయితీ అధీనములో ఉంటాయి.

**సెక్షన్ 55 (1)(బి)** తెలంగాణ గెజిట్ నందు ప్రచురించిన తరువాత మాత్రమే గ్రామపంచాయితీకి దేవాదాయ, ధర్మాదాయ మరియు ఇనాములకు సంబంధించిన వాటిపై అధికారమును ప్రభుత్వము మరల తీసుకొనగలదు.

**సెక్షన్ 55 (2)** ప్రభుత్వము గ్రామపంచాయితీ అనుమతితో, గ్రామపంచాయితీకి బదలాయించిన దేవాదాయ, ధర్మాదాయ మరియు ఇనాముల నుండి వచ్చే ఆదాయమును ఏ అవసరమునకు ఐనా ఖర్చు చేసే అధికారము గ్రామ పంచాయితీకి కలదు.

**సెక్షన్ 55 (3)** పైన తెలిపిన క్లాజ్ (బి) సబ్‌సెక్షన్ (1) ద్వారా గ్రామపంచాయితీకి బదలాయించిన అధికారములను తప్పించుటకు, గ్రామపంచాయితీ అనుమతితో సబ్‌సెక్షన్ (2) ద్వారా గ్రామపంచాయితీకి ఇచ్చిన అధికారములను

తొలగించుటకు ఆ గ్రామపంచాయితీ నుండి ముందుగా అనుమతి తీసుకున్న తరువాత మాత్రమే ప్రభుత్వము ఆ అధికారములను ఉపసంహరించ గలదు.

**సెక్షన్ 56 ధర్మ నిధులను స్వీకరించు అధికారం**

ఒక ప్రత్యేక ప్రయోజనము కొరకు విరాళములు, ధర్మనిధి (ట్రస్టు)ని స్వీకరించుటకు గ్రామపంచాయితీకి అధికారము గలదు.

**సెక్షన్ 57 బందెలదొడ్ల నిర్వహణ**

పశువుల అక్రమ ప్రవేశ చట్టము 1871 (కేంద్రచట్టము) లోని నిబంధనలకు లోబడి, గ్రామపంచాయితీల లో బందెలదొడ్డిని ఏర్పాటు చేసి, నిర్వహించవలసిన భాధ్యత గ్రామపంచాయితీలదే.

**సెక్షన్ 58 ప్రజా రహదారుల నిర్వహణ**

సెక్షన్ 58(1) జాతీయ, రాష్ట్రీయ, జిల్లా ప్రజాపరిషత్, మండల ప్రజాపరిషత్ వారి రహదారులు కాకుండా మిగిలిన రహదారులు అన్నీ అనగా రాళ్ళుపరచిన కాలిబాటలు, రాళ్ళు, ఇతర సామగ్రులు గ్రామపంచాయితీలవే. ఈరహదారులుపైగల ఆక్రమణలను తొలగించే భాధ్యత గ్రామపంచాయితీలదే. గ్రామపంచాయితీ నిధులతో నిర్మించబడినట్టి మురుగు కాలవలు, మురుగు కాలువ నిర్మాణములు, సొరంగములు, తూములు మరియు వాటికి సంబంధింన నిర్మాణములు, సామగ్రులు మొదలైనవి అన్నీ గ్రామపంచాయితీకి చెందుతాయి.

గ్రామపంచాయితీ గుండా పోవు జాతీయ రహదారులు కాని ఏరహదారి పైన ఉన్న ఆక్రమణలనైనాతొలగించుటకు మరియు ఆరహదారులను అనుమతి లేకుండా వాడుకొనుటను నివారించుటకు గ్రామ పంచాయితీలు చర్యలు తీసుకోవలెను.

సెక్షన్ 58 (2) పైన తెలిపిన సబ్ సెక్షన్ లో గల రహదారులు, మురుగుపారుదల, మురుగు కాలువ, డ్రైనేజి పని, సొరంగములు, తూములు మొదలైన వాటిపై గ్రామపంచాయితీ లకు గల అధికారములను తొలగించుటకు ఆ గ్రామపంచాయితీ కి విన్నవించుకొనుటకు ఒక అవకకాశము ఇచ్చిన తరువాత మాత్రమే ప్రభుత్వము ఆగ్రామపంచాయితీ గల అధికారములను రద్దు చేయగలదు.

**సెక్షన్ 59 సేకరించిన మురుగు వంటివి గ్రామపంచాయితీకి చెందుట**

సేకరించిన చెత్త, చెదారము, మురుగు మరియు ఇతర వ్యర్ధ పదార్ధాలు గ్రామపంచాయితీకి చెందుతాయి.

**సెక్షన్ 60 సామాజిక ఆస్థి లేదా ఆదాయము గురించి**

గ్రామ ఇమ్మడి భూమిగా భావించే భూములు, వాటిపై వచ్చే ఆదాయములు, ఒక ప్రత్యేక నీటిపారుదల గల భూములు లేదా వాటిని కలిగిన వ్యక్తులు, గ్రామ ఆచారమును బట్టి ఉపయోగ పడుచున్న ఆస్థి ఆగ్రామపంచాయితీకి చెందుతాయి.

**సెక్షన్ 61 రేవుల నిర్వహణ**

**సెక్షన్ 61(1)** తెలంగాణ రేవుల చట్టం, 1314 ఫసలీలో ఏవివరణ ఉన్నప్పటికి సబ్‌సెక్షన్ (2) ద్వారా వివరించినవి కాకుండా మిగిలిన అన్ని రేవులు ఆగ్రామపంచాయితీకి చెందుతాయి.

**సెక్షన్ 61(1)(ఎ)** ఒక గ్రామపంచాయితీ పరిధిలో గల ప్రజా రహదారిని కలిపితూ గల రేవు ఆగ్రామపంచాయితీకి చెందు తుంది. ఒకవేళ ఆరేవు ఒకటికన్నా ఎక్కువ గ్రామపంచాయితీ లను కలుపుతూ ఉన్నట్లయితే దాని నిర్వహణ ఆ గ్రామ



పంచాయితీల యొక్క సంయుక్త కమిటీ నిర్ణయం ద్వారా జరుగవలెను.

**సెక్షన్ 61(1)(బి)** ఒక రేవు మండల పరిషత్ కు సంబంధించిన రహదారులకు ఆనుకొనిఉన్నట్లయితే అది ఆమండల ప్రజాపరిషత్ కు చెందుతుంది. ఒకటికన్నా ఎక్కువమండలములు ఆరేవుకి ప్రజా రహదారులుగా ఉన్నట్లయితే దాని నిర్వహణ ఆ మండల పరిషత్ నియమించిన సంయుక్త కమిటీ ద్వారా జరుగవలెను.

**సెక్షన్ 61(1)(సి)** అదే విధంగా గ్రామపంచాయితీ, మండల పరిషత్ లతో పాటు మునిసిపల్ వారికి సంబంధించిన రహదారులకు ఆనుకొని ఒక రేవు ఉన్నట్లయితే, ఆగ్రామపంచాయితీ, మండల పరిషత్ లతోపాటు మునిసిపల్ అధికారులతో కలిపి ఒక సంయుక్త కమిటీని ఏర్పాటు చేసి ఆకమిటీ ద్వారారేవు నిర్వహణ జరుగవలెను.

**సెక్షన్ 61(2)** జాతీయ రహదారి లేదా రాష్ట్రీయరహదారులను కలుపుతూ ఉన్న ఏదైనా ఒక రేవు నిర్వహణను షరతులకు లోబడి బదిలీ చేయుటకు, ఒక గ్రామపంచాయితీ మరియు మండల పరిషత్ అధికార పరిధిలో గల రేవు నిర్వహణను గ్రామపంచాయితీ కానీ లేదా మండల పరిషత్కు కానీ బదిలీ చేయవచ్చును. ఒకటికన్నా ఎక్కువ గ్రామపంచాయితీలకు లేదా మండల పరిషత్ లకు సంబంధించిన అధికార పరిధిలో ఉన్నట్లయితే సంబంధిత జిల్లా పరిషత్కు బదిలీ చేయవచ్చును.

**సెక్షన్ 61(3)** సబ్‌సెక్షన్ (1) లో నిర్ధేసించబడిన సంయుక్త కమిటీ ఏర్పాటు, అది అనుసరించ వలసిన విధి, విధానములను మరియు ఆకమిటీ నిర్ణయములలో ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించుటకు కూడా నియమ నుబంధనలకు లోబడి ఉండాలి.

**సెక్షన్ 61(4)** సబ్‌సెక్షన్ (1) మరియు సబ్‌సెక్షన్ (2) ద్వారా జిల్లా పరిషత్, మండలపరిషత్ మరియు గ్రామపంచాయితీల నిర్వహణలో గల ఏదైనా రేవునుండి వసూలైన ఆదాయమును స్థానిక ప్రాధికార సంస్థల మధ్య సమాన వాటాలలో పంచవలెను, అంతేకాకుండా ఆపంచిన భాగము స్థానిక ప్రాధికార సంస్థల నిధులలో భాగముగా ఉండవలెను.

**సెక్షన్ 62 ప్రభుత్వ పోరంబోకు భూములను గ్రామపంచాయితీలో విలీనం చేయుట**

**సెక్షన్ 62(1)** పోరంబోకులు, చెరువు గర్భములు, మందబయలు, మేతబీళ్ళు. స్మశానములు, సాగునీటి, మురుగునీటి పోరంబోకులు, రిజర్వుఫారెస్ట్‌కు ఆనుకొని ఉన్న



భూములు, విలువైన వృక్ష సంపదగల భూములు, కంటోన్మెంటు, పోర్టు, రైల్వే, విమానములుదిగుభూములు, గనులు, నదీతీరప్రాంతము, సముద్రతీరము నుండి 500 మీటర్లలోపుగల భూములను రిజర్వుభూమి, ఇవేకాకుండా భూసేకరణ చట్టం 1894 మరియు 2013 సవరణ చట్టం 2017 ద్వారా సేకరించిన భూములు ప్రభుత్వ భూములు అంటారు.

ఈ ప్రభుత్వ భూములలో కొన్ని నిర్దిష్ఠ ప్రయోజనము కొరకు నిర్ధేసంచబడిన స్థలములు కొన్ని నియంత్రణలకు లోబడి గ్రామపంచాయితీలో విలీనం చేయవలెను.

**సెక్షన్ 62(2)** సబ్‌సెక్షన్ (1) లో తెలిపిన పోరంబోకు భూములు ప్రభుత్వమునకు అవసరమైనచో తెలంగాణ గెజిట్‌నందు నోటిఫై చేసిన తరువాత మాత్రమే అవి మరల ప్రభుత్వపరమగును.

**సెక్షన్ 62(3)** గ్రామపంచాయితీ ఆధీనములో లేని ఏఇతర పోరంబోకు భూమినైనా, దానివాడకమును నిర్ణయించుకొను అధికారము కూడా గ్రామపంచాయితీకి కలదు. దీనిని గ్రామ పంచాయితీ ఒక ఇత్తర్వు ద్వారా చేయగలదు.

**సెక్షన్ 62(4)** సబ్‌సెక్షన్ (3) ద్వారా సంక్రమించిన అధికారమును అనుసరించి ఆ పోరంబోకు భూములలో చెట్లు నాటవలెను.

పైన పేర్కొనబడిన పోరంబోకు భూముల విషయములో ఏదైనా ఒక భూమి పోరంబోకు భూమి అగునా కాదా అనే సందేహము ఉత్పన్నమైతే, అది ప్రభుత్వమే నిర్ణయించి తెలియజేయును. ఈవిషయములోప్రభుత్వ నిర్ణయము అంతిమమైనది.

**సెక్షన్ 62 గ్రామపంచాయితీకి స్థిరాస్థిని ఆర్జించుట**

ఏ గ్రామపంచాయితీ కైనా స్థిరాస్థి అవసరమైనచో 2013 భూసేకరణ చట్టం మరియు 2017 సవరణ చట్టంద్వారా భూసేకరణ చేసి, నష్ట పరిహారము మరియు ఇతర ఖర్చులను చెల్లించిన తరువాత ఆ ఆస్థిని గ్రామ పంచాయితీలోకి విలీనము చేయవచ్చును.

**ఎస్. శ్రీపద్మావతి**





# సెర్ప్ ద్వారా సీతాఫలాలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుండి 85 కి.మి దూరంలోని ఒక కుగ్రామం ఉడ్మల్ గిద్ద, ఇది మండల కేంద్రం దామరగిద్ద నుండి 8 కి.మి దూరంలో ఉంది. ఇక్కడ సీతాఫలాలు అధికంగా పండుతాయి.

గతంలో ఇక్కడి గ్రామ ప్రజలు ఎంతో కష్టపడి సేకరించిన ఫలాలను దళారులు సరైన రేటు ఇవ్వకుండా అతి తక్కువ ధరకు కొనుగోలు చేసేవారు.

అంతే కాకుండా సేకరించిన సీతాఫలాలను వివిధ పట్టణాలకు ఆటోల ద్వారా వెళ్లి రోడ్డు పక్కన మరియు రోజంతా వీధులలో తిరిగి తిరిగి అమ్మేవారు అందుకు వారికి రవాణ ఖర్చులు మరియు రోజు కూలి వ ృదా అయ్యేవి.

గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (***SERP***) ద్వారా మహిళలను సంఘటితం చేసి వారి ద్వారా సీతా ఫలాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామ మహిళలు సేకరించిన ఫలాలను తూకం వేసి ధర చెల్లించడం ద్వారా వారి గ్రామంలోనే అమ్మే అవకాశం మరియు రవాణ ఖర్చులు, రోజు కూలి వ ృదా కాకుండా సరైన ధర దొరుకుతుంది. మొదటి రకం (పెద్ద సైజ్) ఫలాలకు కిలో కి రూ 10.00 మరియు రెండవ రకం ఫలాలకు కిలో రూ 8.00 లకు చెల్లిస్తారు.

ఈ విధంగా మండలంలోని 13 గ్రామాలలోని గ్రామ సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రెండు ప్రాసెసింగ్ కేంద్రాలకు సరఫరా చేస్తారు. ఈ 13 కేంద్రాలలో ఒక్కొక్క కేంద్రంలో సుమారు 100 నుండి 150 ఎస్.హెచ్.జి మహిళలు లబ్దిపొందుతున్నారు.

ఈ మొత్తం ప్రక్రియలో శ్రీ జన్ అనే స్వచ్ఛంద సంస్థ సాంకేతిక సహాకారాన్ని అందిస్తుంది. ముందుగా వారు కుటుంబ సభ్యుల సహాకారంతో గ్రామ పరిసరాలలోని చెట్ల నుండి ఫలాలను సేకరిస్తారు. సేకరించిన ఫలాలను కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళతారు కొనుగోలు కేంద్రం వద్ద తీసుకొచ్చిన ఫలాలను గ్రేడింగ్ చేయటం తరువాత తూకం వేసి, అందుకు తగిన రసీదు ద్వారా డబ్బులు పొందుతారు. కొనుగోలు కేంద్రం వద్ద గ్రేడింగ్ అయిన ఫలాలను ట్రే లలో పెట్టి, ఆటో ట్రాలీ ద్వారా ప్రాసెసింగ్ కేంద్రాలకు రవాణా చేస్తారు.

రవాణా అయిన ఫలాలను స్టాక్ రిజిస్టర్లో నమోదు చేసి, ఫలాలు సరిగా పండుటకు సరియైన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.పండిన ఫలాలను రెండు పద్దతులలో పల్ప్ లను వేరు చేయడం జరుగుతుంది.మొదటిగా పండిన ఫలాలను చేతితో రెండుగా చేస్తారు.తరువాత వాటిని స్పూన్ లాంటి పరికరంతో గింజలతో సహా వేరు చేస్తారు. మొదటి రకంలో భాగంగా చేతి సహాయంతో గింజలను వేరు చేసి పల్ప్ ను తీస్తారు. రెండవ రకంలో భాగంగా మిషన్ ద్వారా పల్ప్ ను వేరుచేయడం జరుగుతుంది. వేరు చేసిన పల్ప్ ను తూకం వేసి శుబ్రమైన ప్లాస్టిక్ కవర్లో వేసి సీల్ చేసి వాటిపై సీల్ వేసిన తేదిని రాసి మైనస్ డిగ్రీల వద్ద ఫ్రిజర్లో భద్ర పరచాలి. రెండు, మూడు రోజుల తరువాత మైనస్ డిగ్రీల ఫ్రిజర్ల నుండి తీసి సాదారణ ఫ్రిజర్లో బద్రపరచాలి. తరువాత వీటిని ఎంపిక అయిన ఐస్ క్రీం కంపెనీలకు సరైన ప్రమాణాలు పాటిస్తూ సరఫరా చేస్తారు. ఒకప్పుడు రోజుకు రూ 100 నుండి రూ 200 సంపాదించే ఎస్.హెచ్.జి మహిళలు నేడు రోజుకు రూ 300 నుండి రూ 500 దాకా లబ్ది పోందుతున్నారు. అంతేకాక వారు ఖాళీ సమయాలలోనే ఈ పనులు చేయడం వలన రోజు వారీ కూలీ పనులకు కూడా వెళ్ళి సంపాదించే అవకాశాన్ని పొందుతున్నారు.

"సంఘటితంగా చేస్తే సాదించలేనిది ఏమి లేదని నిరూపించారు దామరగిద్ద మహిళలు"

**రవి పూరేటి**

సీనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సెర్ప్



# వెనకబడిన గ్రామాలలో వెలుగు దీపం

వెనకబడిన గ్రామాలు ప్రగతి పథంలో నడిపించడానికి తెలంగాణ రాష్ట్రం గ్రామాలను దత్తత తీసుకొని రైతులకు అన్ని విధాల చేయూతను అందిస్తుంది. ఈ మార్గంలోనే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ పొలాస, జగిత్యాల శాస్త్రవేత్తలు కొన్ని సంవత్సరాలుగా గ్రామాలను దత్తత తీసుకొని వ్యవసాయంలో మెలుకువలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, క్షేత్ర ప్రదర్శనలు, రైతు శిక్షణ కార్యక్రమాల ద్వారా రైతులకు వ్యవసాయంలో తగిన సూచనలు, సలహా అందిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారు.

ఈ దత్తత గ్రామంలో భాగంగా ముస్తాబాద్ మండలానికి చెందిన ఆవునూరు అనే గ్రామాన్ని 2015లో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస, జగిత్యాల శాస్త్రవేత్తలు దత్తత తీసుకొని వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. 3203 మంది రైతన్నలున్న ఆవునూరు గ్రామంలో 200 మంది సన్నకారు రైతులు, 500 మంది చిన్నకారు రైతులు, 100 మంది పెద్ద రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఎక్కువగా ఈ గ్రామ రైతులు వరి, పత్తి పంటలను సాగు చేస్తున్నారు. ఈ గ్రామాన్ని దత్తత తీసుకోక ముందు రైతులు సాధారణ వరి రకమైన ఎమ్.టి.యు.1010 రకాలను సాగు చేసేవారు. అధిక దిగుబడినిచ్చే వంగడాల గురించి అవగాహన ఉండేది కాదు. అధిక మోతాదులో ఎరువులను, పురుగుల మందులను పిచికారి చేసేవారు. సమగ్ర పంట యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ పద్ధతులు, పోషణ లోపాల సవరణ, కలుపు యాజమాన్య పద్ధతులు, నీటి యాజమాన్య పద్ధతుల గురించి తెలిసేది కాదు. పంట దిగుబడి, ఆదాయం తక్కువగా ఉండేది.

గ్రామంలో విత్తనోత్పత్తి, భూసార పరీక్షలు, సేంద్రీయ ఎరువుల వాడకం మీద అవగాహన ఉండేది కాదు.

దత్తత గ్రామం కార్యక్రమంలో భాగంగా శాస్త్ర ప్రాంతీయ స్థానం, పొలాస శాస్త్రవేత్తల చర్చా గోష్ఠి కార్యక్రమం అధిక దిగుబడినిచ్చే వంగడాల సమగ్ర పోషణ, చీడపీడలు, నీటి, కలుపు యాజమాన్య పద్ధతులు, నేల ఆరోగ్యం వంటి అంశాల మీద అవగాహణ కార్యక్రమాలు చేపట్టారు. క్షేత్ర ప్రదర్శనల ద్వారా పంట పొలాల్లో సోకిన చీడపీడలను గమనించి వాటిని నిర్ధారించి వాటికి పాటించవలసిన యాజమాన్య పద్ధతులను రైతులకు తెలియజేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది.

రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని సత్ఫలితాలను పొందారని వారి మాటల్లో వ్యక్తపరిచారు. అధిక దిగుబడినిచ్చే చీడపీడలను తట్టుకునే మేలైన వంగడాలు బతుకమ్మ, కూనారం, సన్నలు వంటి రకాలను సాగు చేస్తున్నామని అంతకు ముందు బతుకమ్మ, కూనారం అనే అధిక దిగుబడి వంగడాన్ని 50 ఎకరాల్లో సాగు చేస్తే ఇప్పుడు 600 ఎకరాల్లో సాగుచేస్తున్నామని భూసార పరీక్షలు చేస్తున్నామని వ్యవసాయ సమాచార ప్రచురణలు, ఇంటర్నెట్ ద్వారా వ్యవసాయ సమాచారాన్ని ఎప్పటికప్పుడు పొందుతున్నామని, యూరియా వాడకాన్ని, పురుగుల మందుల వాడకం తగ్గించామని, సిఫారసు మేరకే ఎరువులు, పురుగుల మందులు వాడుతున్నామని పంట దిగుబడి పెరిగిందని రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. శాస్త్రవేత్తలు గ్రామాన్ని సందర్శించి వారికి శిక్షణా కార్యక్రమాలు, సదస్సుల ద్వారా తమను చైతన్య పరచి ఆధునిక సాంకేతిక వైపు అడుగులు వేయించి పంట దిగుబడి సాధించే మార్గాలను నిర్దేశించారని రైతులు తమ మాటల్లో వ్యక్తపరిచారు.

**పి.సాధ్వి(విస్తరణ శాస్త్రవేత్త),**
డా॥ ఆర్.ఉమారెడ్డి(సహపరిశోధన సంచాలకులు)
ఎన్.నవత(సేద్య విభాగ శాస్త్రవేత్త),
బి.మాధవి(సేద్య విభాగ శాస్త్రవేత్త)
(ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం,పొలాస,జగిత్యాల)



# జీవ వైవిధ్యము

జీవ సమాజంలోని జీవుల మధ్య ఉండే విభిన్నతలను 'జీవవైవిధ్యం' అంటారు. ఆవరణ వ్యవస్థలకు సంబంధించన జీవుల సంఖ్య, భిన్నత్వం, మార్పు చెందే తత్వాలన్నీ జీవ వైవిధ్యానికి సంబంంధించినవే, అందుకే ప్రకృతిని గమనిస్తే విభిన్న రకాల వృక్షాలు, జంతువులు, జీవులు కనిపిస్తాయి.

**జీవ వైవిధ్య స్థాయిలు**

జీవ వైవిధ్య క్రమానుగత స్థాయి ప్రకారం ప్రధానంగా 3 రకాలు. అవి: 1.జన్యుపర జీవ వైవిధ్యం (జెనిటిక్ బయోడై వర్సిటీ), 2.జాతిపర జీవవైవిధ్యం (స్పీసిస్ బయోడైవర్సిటీ), 3.ఆవరణ వ్యవస్థల జీవవైవిధ్య (ఇకో సిస్టమ్ బయోడైవర్సిటీ)

**జన్యుపర జీవ వైవిధ్యం**

ఇది ఒక జాతిలో ఉండే జీవవైవిధ్యం, అంటే ఒకే జాతికి చెందిన జీవుల మధ్య ఉన్న విభిన్నతలకు సంబంధించిది. జీవుల జీవకణాల్లోని క్రోమోజోముల్లోని జన్యువులు ఆ జీవి వ్యక్తిగత లక్షణాలను నిర్ధారిస్తాయి.

ఉదా: జన్యుపర జీవవైవిధ్య కారణంగా కొందరు సన్నగా, లావుగా, పొడవుగా, పొట్టిగా తెల్లటి చర్మంతో, వివిధ రంగుల్లో ఉండటం, ఒకే జాతికి చెందిన కుక్కలు, పిల్లులూ, పుష్పాలు మొదలైనది.

**జాతిపర జీవ వైవిధ్యం**

- శాస్త్ర, సాంకేతిక రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధించినా, నేటికీ భూగోళంపై కచ్చితంగా ఎన్ని జాతులకు చెందిన జీవులున్నాయో ఎవరికీ తెలియదు.
- భూమ్మీద 10-14 మిలియన్ల జాతులు/జీవులున్నట్లు అంచనా, ఇవి చాలావరకు కీటకాలు, సూక్ష్మజీవులే.

**ఆవరణ వ్యవస్థల జీవ వైవిధ్యం**

దీనిలో ఒక భౌగోళిక ప్రాంతంలోని అరణ్యాలు, పచ్చిక బయళ్ళు, ఎడారులు లాంటి భౌమావరణ వ్యవసస్థలు, నదులు, సరస్సులు, నదీ ముఖద్వారాలు, తీర ప్రాంతాలు, మహాసముద్ర ప్రాంతాలు లాంటి జలావరణానికి చెందిన విభిన్న ఆవాసాలకు సంబంధించిన జీవ వైవిధ్య ఉంటుంది. ఇందులో శీతోష్ణస్థితి ప్రముఖ పాత్ర వహిస్తుంది.

ఉదా: భూమధ్యరేఖ వర్షారణ్యంలోని జీవ వైవిధ్యం అధికస్థాయిలో ఉండగా, అందుకు భిన్నగా ఉష్ణ ఎడారులు, ధ్రువ ప్రాంతాల్లో చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది.

- ఆహారం, నివాసం, ఆరోగ్యం కోసం అనాదిగా మానవులు భూగోళపు జీవ వైవిధ్యంపై ఆదారపడుతున్నారు.

**కాలుష్య ప్రభావం**

జీవవైవిధ్యం సహజ, వ్యవసాయ వ్యవస్థల ఉత్పాదకతలను పెంపొందిస్తుంది. ఆధునిక నాగరికత ఫలితం ఆ ఉత్పన్నమవుతున్న కాలుష్యం మానవుడు నివసిస్తున్న ప్రాంతాలన్నింటిలోని జీవ వైవిధ్యంపై అనేక రకాల వ్యతిరేక ప్రభావాలను చూపుతోంది. ఉదా: అటవీ ప్రాంతాలను పంట భూములు, రహదారులు, క్వారీలు, గనులుగా మారుస్తున్నారు.

**జీవావరణ సమతౌల్యం**

ఒక జీవ సంఘంలో కాలానుగుణంగా జీవావరణం ద్వారా క్రమంగా సంభవించే మార్పులుంటాయి. ఇవి మినహా జన్యుపరమైన జాతులు, ఆవరణ వ్యవస్థల మధ్య ఆండే జీవ వైవిధ్యం స్థిరంగా ఉండి, అది సహజసిద్ధమైన క్రియాశీల సమతాస్థితిలో ఉంటే, అలాంటి స్థితిని జీవావరణ సమతౌల్యం అంటారు.

- ఈ సమతౌల్యాన్ని ప్రభావితం చేసే అంశాల్లో శీతోష్ణస్థితిలో వచ్చే మార్పులు, ప్రకృతి వైపరీత్యాలతోపాటు మానవ ప్రభావ మరీ ముఖ్యమైనది.
- భూకంపాలు, అగ్నిపర్వతాలు, కొండచరియలు, విరగడం, హిమ సంపాతాలు, వరదలు, కరువు కాటకాల్లాంటి ప్రకృతి వైపరీత్యాలు ఆయా ప్రరుభావిత ప్రాంతాల్లో జీవావరణ సమతౌల్యాన్ని ప్రభావితం చేస్తాయి.
- జీవవరణ సమతౌల్య పరిరక్షణ కోసం అనుసరణీయ, దీర్ఘకాలిక, శాస్త్రీయ అవలోకనంతో వెంటనే చర్యలు చేపట్టాలి.

**వన్యమృగ సంరక్షణపై అంతర్జాతీయ సమావేశం**

ప్రపంచంలో జరిగిన 5 ప్రధాన అంతర్జాతీయ వన్యప్రాణి సమావేశాల్లో భారత్ పాల్గొన్నది. మనదేశంలో పర్యావరన, అటవీ మంత్రిత్వశాఖ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది.

- అంతర్జాతీయ వ్యాపార అటవీ వృక్ష జాతులు, జంతు జాతులు, సమావేశంలో 1976, జులై 20న భారత దేశం సంతకం చేసింది.
- మానవ, జీవా వరణ కార్యక్రమాన్ని (ఎంఏబీ-మ్యాన్ అండ్ బయోడైవర్సిటీ) యునెస్కో 1971లో ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో 2012 నాటికి 117 దేశాల్లో 598 బయోస్పియర్ సంస్థలు సభ్యత్వం తీసుకున్నాయి.
- జీవ వైవిద్య సమావేం 1992, జూన్ 5న రియోడీ జెనీరోలో జరిగింది.

**భారత దేశంలో జీవ వైవిధ్యం**

ప్రపంచంలో భారతదేశం 12వ మెగా జీవవైవిద్య దేశం, మన దేశం ప్రపంచంలో 2.5 శాతం భౌగోళిక వైశాల్యం కలిగి ఉంది. ప్రపంచంలో 7.8 శాతం జాతిపర వైవిద్యం భాదత్ సొంతం. ఇదో రికార్డు. ప్రపంచంలో ఇండో-మలయా అత్యంత విస్తీర్ణం కలిగి ప్రాంతం

- మన దేశంలో వృక్ష సంబంధ జాతులు 46,000 ఉన్నాయి. ఇవి ప్రపంచంలో 7 శాతం, ఇందులో 33 శాతం వ్యాధుల బారిన పడుతున్నాయి.
- మన దేశంలో సుమారు 15,000 రకాల పూల మొక్కలు ఉన్నాయి. ఇవి ప్రపంచంలో 6 శాతం ఇందులో 1500 రకాలు జాతిపర వ్యాధుల బారిన పడుతున్నాయి.
- దేశంలో సుమారు 81,000 జంతుపర జాతులున్నాయి. ప్రపంచ జంతు సంపదలో ఇది 6.5 శాతం.
- భారత్ 1972లో వన్య మృగ సంరక్షణ చట్టాన్ని చేసింది. అంత కు ముందు 5 జాతీయ హెూదా కలిగిన పార్కులు ఉండేవి.
- వన్యమృగ సంరక్షణ సవరణ చట్టాన్ని 2006లో చేశారు. అదే ఏడాది సెప్టెంబరు 4 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ద్వారా జాతీయ పులుల అటవీ ఆధారిటీ, వన్యమృగ క్రైమ్ కంట్రోల్ బ్యూరోలను ఏర్పాటు చేశారు.

**జాతీయ వన్యమృగ ఆచరణ ప్రణాళిక**

జాతీయ వన్యమృగ బోర్డును 1982లో కేంద్రం ఏర్పాటు చేసింది. మొదటి జాతీయ వన్యమృగ ఆచరణ ప్రణాళికను 1983 లో ప్రారంభించారు.

**జాతీయ జీవ వైవిద్య చట్టం**

ఈ చట్టాన్ని 2002లో చేశారు. 2003, అక్టోబరు 1 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. ఈ చట్టం క్రిందకు 1. జాతీయ జీవ వైవిద్య అథారిటీ, 2. జాతీయ జీవ వైవిద్య బోర్డు, 3. జీవ వైవిద్య నిర్వహణ కమిటీ వస్తాయి. జాతీయ జీవ వైవిద్య అథారిటీ సంస్థను చట్టబద్ధ హెూదాతో చెన్నై (2003)లో ఏర్పాటు చేశారు.

**భారత్‌లోని పలు జీవ వైవిద్య సంస్థల వివరాలు:**

- వన్యమృగ సంస్థ-1996లో డెహ్రాడూన్‌లో ఏర్పాటు
- భారత వ్యమృగ బోర్డుల-2001 డిసెంబరు 7న పునర్ నిర్మాణం
- జంతు సంక్షేమ డివిజన్లు-2002 జులై నుంచి అమటు
- జంతు సంక్షేమ జాతీయ సంస్థ-ఫరీదాబాద్ (1960 చట్టం ప్రకారం ఏర్పాడింది)

**భారతదేశంలో జీవ వైవిద్య సంరక్షణ చర్యలు**

**ఎలిఫెంట్ ప్రాజెక్టు : 1992** ఫిబ్రవరిలో ఎలిఫెంట్ ప్రాజె క్టును స్థాపించారు. దేశంలో ప్రస్తుతం 32 ఎలిఫెంట్ ప్రాజెక్టులు న్నాయి. ఇవి ప్రత్యేకంగా దక్షిణ భారతదేశంలో అత్యధికంగా ఉన్నాయి.

**టైగర్ ప్రాజెక్టు**

భారత ప్రభుత్వం 1973, ఏప్రియల్ 1న పులుల (టైగర్ రిజర్వ్) ప్రాజెక్టును ప్రారంభించింది. దేశంలో మొదటి ప్రాజెక్టు జిమ్ కార్బెట్ నేషనల్ పార్కు.

**బయోస్పియర్ రిజర్వ్**

ప్రాదేశిక, తీర ప్రాంత ఆవరణ సమతౌల్యాన్ని కాపాడటానికి యునెస్కో చట్రం కింద మానవ, జీవావరణ కార్యక్రమంలో భాగంగా మనదేశంలో 1986లో బయోస్పియర్ ను స్థాపించారు. దేశంలో మొదటి బయోస్పియర్ నీలగిరి, ప్రస్తుతం దేశంలో 18 బయోస్పియర్ రిజర్వ్‌లున్నాయి. వీటిలో 9 ప్రపంచ బయోస్పియర్ నెట్‌వర్క్‌లో ఉన్నాయి. దేశంలోని 7 బయోస్పియర్‌లను యునెస్కో దత్తత తీసుకుంది.

**పి.మహేశ్వరి.**
టి.ఎస్.ఐ.ఆర్.డి



# గిరి పుత్రులకు రాజకీయ సాధికారత

తెలంగాణలో కొత్తగా గిరిజన గ్రామాలు ఏర్పడ్డాయి. ఇప్పటి వరకు స్వపరి పాలనకు దూరంగా ఉన్న గిరిజన గూడెలు, తండాలు గ్రామపంచాయతీలుగా రూపాతరం చెందాయి. దీంతో గిరిజన ఆవాసాలను వారే అభివృద్ధి చేసుకొనే అవకాశం ఏర్పడింది. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పంచాయతీ చట్టంతో గిరిజన గూడెలు, తండాల రూపు రేఖలు మారబోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధుల కొరత రానేరాదు. ప్రత్యేక అభివృద్ధి నిధి నుండి అవసరానికి మించిన నిధులు అందుబాటులో ఉండే అవకాశం ఏర్పడింది. గ్రామ పంచాయతీలు తీసుకొనే నిర్ణయాలకు అనుగుణంగా అభివృద్ధి చేసుకొనేందుకు వెసులుబాటు కలగబోతుంది.

ఎదురు చూసిన గిరజనుల కల నెరవేరింది. నూతన పంచాయతీ చట్టంతో గిరిజన గూడెలు, తండాలు గ్రామ పంచాయతీలుగా మారాయి. కోర్టు ఆదేశాల మేరకు మరో రెండు నెలల్లోనే గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగబోతున్నాయి. దీంతో గిరిజనులు తమ పంచాయతీలను తామే పరిపాలించుకొనే అవకాశం ఏర్పడబోతుంది. ఎవరిపై ఆధారపడవలసిన అవసరం లేదు. ఎవరి కోసమో ఎదురు చూసే పరిస్థితి ఉండబోదు. ఎన్నికైన గ్రామ పంచాయతీ చేసే తీర్మాణాలతో తమ గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చు. అభివృద్ధికి అవసరమై నిధులు వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల కింద అందుబాటులో ఉండబోతున్నాయి. ఇంత కాలం అభివృద్ధికి దూరంగా ఉన్న తండాలు, గూడెల రూపు రేఖలు మార్చుకొనే స్వేచ్ఛ గిరిజనులకు చట్టపరంగా అందుబాటులోకి వస్తుంది. గిరిజన గ్రామాలు అభివృద్ధిలో అగ్ర భాగాన నిలిచే సమయం ఆసన్నమైంది. అంతర్గత రోడ్లు, వీది దీపాలు, మంచినీటి సదుపాయం, విద్య, ఉపాధి, రోడ్డు రవాణా, వైద్యం తదితర అవసరాలు తీర్చుకొనేందుకు ఇతక మీదట ఎవరిపైనా ఆధారపడవలసిన అవసరమే ఉండబోదు.

తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పంచాయతీ చట్టంతో రాష్ట్రంలో మొత్తం 12,751 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. వీటిలో 4,383 గ్రామాలు కొత్తగా ఆవిర్భవించాయి. వంద శాతం గిరిజన జనాభా ఉన్న 1326, మరో 1308 షెడ్యూల్డ్ గ్రామాలు, మైదాన ప్రాంతాల్లో 508 పంచాయతీలు గిరిజనులకు దక్కనున్నాయి. దీంతో మొత్తం 3214 గ్రామ పంచాయతీల్లో వారికే పెత్తనం దక్కబోతుంది. ఇప్పటి వరకు అభివృద్ధికి నోచుకొని తమ గూడెలు, తండాలను ఇక మీదట తామే పరిపాలించుకొనే అవకాశం గిరిజనులకు వచ్చింది. గిరిజన గ్రామాల్లో గిరిజనులే స్వయం పాలన సాగించుకొనే విధంగా చట్టంలో స్పష్టత ఇచ్చారు. పరిపాలనకు, స్వయం పాలనకు ఇంత కాలం దూరంగా ఉన్న గిరిజనులు ఇక మీదట సర్పంచులు, వార్డు సభ్యులు కాబోతున్నారు. స్వయంగా నిర్ణయాలు తీసుకొనబోవడం కూడా అరుదైన అవకాశం.

పంచాయతీ ఎన్నికల్లో 2013 వరకు ఎస్సీల్లో 18




శాతం రిజర్వేషన్లు వర్తించగా ఇక మీదట జనాభా ప్రాతిపదికన దాదాపు 2 శాతం రిజర్వేషన్లు పెరిగే అవకాశం ఉందంటున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీలు 35,84,772 మంది ఉన్నట్లు అధికారులు తేల్చారు. దీని ప్రకారం వారికి 20.46 శాతం రిజర్వేషన్లు వర్తింపచేయవలసి ఉంటుంది. దాదాపు 2,070 గ్రామాల్లో ఎస్సీలు ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంది. మహిళలకు రూడా 50 శాతం రిజర్వేషన్‌లను కల్పించడంతో వారికి రాజకీయ అవకాశాలు మెరుగవుతాయి. ఇక బీసీలకు 34 శాతానికి తగ్గకుండా రిజర్వేషన్లను కల్పించవలసి ఉంటుంది.

కొత్తగా ఏర్పాటైన 4,383 గ్రామాలకు రోడ్ల అనుసంధానం కింద రూ. 5 వేల కోట్లను ప్రభుత్వం ఖర్చు చేయబోతుంది. వీటిలో గిరిజన గ్రామ పంచాయతీలే అధికంగా ఉంటాయి. ఇప్పటి వరకు వీటికి రోడ్ల సౌకర్యం సరిగా లేకపోవడంతో కొత్తగా రోడ్లు నిర్మించి అభివృద్ధి పథం వైపు నడిపించాలని ప్రభుత్వం భావించింది. కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, అంతర్గత రోడ్ల కోసం ప్రభుత్వం రూ. 2,500 కోట్లను ఖర్చు చేయడానికి కూడా ప్రణాళికలను సిద్ధం చేసింది. ప్రస్తుతం అన్ని గ్రామాలు, మండలాలకు లింక్ రోడ్లను నిర్మించనున్నారు.

గిరిజనులను ఆర్థికంగా, రాజకీయంగా సాధికారత బాట పట్టించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. అందుతో తెలంగాణ ప్రభుత్వం మరింత చురుకైన పాత్ర పోషిస్తుంది. గిరిజన ప్రాంతాల భౌగోళిక, సామాజిక, సంప్రదాయాల సంక్లిష్టతలతో నిమిత్తం లేకుండా అభివృద్ధి నమూనాలు అమలు చేయాలని సంకల్పించింది. గిరిజనులు సేకరించే వెదురు, తేనె, ఔషధ మొక్కలకు మార్కెటింగ్ సౌకర్యం మరింత మెరుగుపర్చబోతుంది. అటవీ ఉత్పత్తులకు గిరాకీని పెంచడం ద్వారా గిరిజనుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చాలని భావిస్తుంది. అన్ని గిరిజన గ్రామాలకు మండల, జిల్లా కేంద్రాలతో రోడ్లను అనుసంధానం చేయడం, బస్సు సౌకర్యం కల్పించడం, తమ ఉత్పత్తులను డిమాండ్ ఉన్న చోట అధిక ధరలకు విక్రయించుకొనే అవకాశం కల్పించడం కోసం కూడా ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకుంటుంది. స్వయం ఉపాధిలో బాగంగా గొర్రెలు, బర్రెలు, వృత్తి పరికరాలను అందించబోతుంది. రాష్ట్రంలోని 24,255 ఆవాసాలకు రక్షిత మంచినీటిని అందించే పథకం గిరిజన గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో దోహద పడబోతుంది. మీరే నాయకులు, మీరే పరిపాలకులు, మీ చేతుల్లోనే అభివృద్ధి అనే విధంగా కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసి రాజకీయ సాధికారత ఇవ్వబోతుంది.

**పతంగి శంకర్**
సీనియర్ జర్నలిస్టు



# తెలంగాణ కోటి వృక్షాల కోన

## హరిత స్వాప్నికుడు వనజీవి రామయ్య

ఇటీవల గ్రీన్‌చాలెంజ్ బాగా పాపులర్ అయింది. ఒక మొక్క నాటడం పదిసెల్ఫీలు తీసి సోషల్ మీడియాలో పెట్టడం, ఇప్పుడున్న క్రేజ్. రామయ్య కూడా మొక్కలు నాటి గ్రీన్ చాలెంజ్ చేశాడు. కానీ సెల్ఫీతీద్దాం అంటే సెల్ ఫోన్ సరిపోదు. ఒక భారీ డ్రోన్ కెమేరా కావాలి. ఎందుకంటే అతడు నాటిన మొక్కలు వృక్షాలై, కొన్ని కిలోమీటర్ల మేర రోడ్డు కిరువైపులా పందిరిలా అల్లుకున్నాయి.

**ఆనాటి ఆకుపచ్చని స్వప్నం**

ఇరవై ఐదు ఏళ్ల క్రితం ఖమ్మం జిల్లా,రెడ్డిపల్లి రహదారిలో బాటసారులు ఎండలో వెళ్తూ నీడ కోసం ఆగుదామంటే ఒక్క చెట్టుకూడా కనిపించేది కాదు. చుట్టూ గుట్టల మీద అక్కడక్కడా విసిరేసినట్టు చెట్లు ఉండేవి. వానలు పడినపుడు తరచూ భూమి కోతకు గురయ్యేది. మొక్క మొలవాలంటే,సందేహించే పరిస్థితి. ఆ రోడ్డుపక్కనే చిన్న పూరింట్లో ఉంటున్న దరిపల్లి రామయ్య ఇదంతా చూస్తూ ఊరుకోలేదు. ఉదయం వెలుతురు రాగానే చిన్న గుడ్డసంచి పట్టుకొని ఆ రోడ్డుపక్కనే నడుస్తూ ప్రయాణీకులు తిని పారేసిన, పండ్లగింజలను ఏరుకొని సంచిలో వేసుకునే వాడు. రోజూ అలా సేకరించిన గింజలను వానా కాలంలో సమీపంలోని గుట్టల మీదకు విసిరే వాడు.

వేసవి కాలంలో రామయ్య అడవుల్లో తిరుగుతూ రకరకాల విత్తనాలు సేకరిస్తుంటారు. వాటన్నింటిని బస్తాల్లో నింపి ఇంటి దగ్గర నిల్వచేస్తారు. తొలకరి చినుకులు పడగానే మొక్కలు నాటే కార్యక్రమంలో మునిగిపోతారు. రోడ్లకు ఇరువైపులా, చెరువు కట్టల వెంట, జాతరలు, ఖాళీ జాగాల్లో, ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ విత్తులు నాటుతాడు.

**రెడ్డిపల్లి దారిలో హరిత పందిరి**

ఖమ్మం రూరల్ మండలం వైపు వెళ్లేదారిలో రెడ్డిపల్లి గ్రామం వద్ద దాదాపు పది కిలో మీటర్ల వరకు రోడ్డుకిరువైపులా పెరిగిన వృక్షాలు ఆకాశంలో అల్లుకున్నట్టు కనిపిస్తాయి. ఎండాకాలంలో ఆ చెట్ల కింద చాలా మంది సేదతీరుతూ ఒక్కసారైనా రామయ్యను తలుచుకోకుండా ఉండ లేరు. ఎందుకంటే పాతికేళ్ల క్రితం రామయ్య నాటిన మొక్కలే నేడు వృక్షాలయ్యాయి.

**ఎవరీ రామయ్య?**

రామయ్య స్వగ్రామం ముత్తగూడెం. కొద్దిగా పొలం రెడ్డిపల్లిలో ఉండటంతో ఇక్కడికి చిన్నప్పుడే వచ్చి స్థిరపడ్డారు. రామయ్యకు భార్య జానమ్మ. ముగ్గురు కొడుకులు, ఓ కూతరు ఉన్నారు. కుటుంబ భారాన్ని మోస్తూనే 43 ఏళ్లుగా మొక్కలను పెంచుతున్నారు.

ముత్తగూడెం పాఠశాలలో 5వ తరగతి వరకు మాత్రమే చదువుకున్న రామయ్యకు పర్యావరణం పాఠాలను జీవితం నేర్పింది. 'వృక్షోరక్షతి రక్షితః' అన్న సూక్తిని ఆటలాడుకునే వయసులోనే అర్థం చేసుకున్నాడు. స్కూల్లో మల్లేశంటీచర్ బోధించిన 'మొక్కల పెంపకం– లాభాలు' అనే పాఠం అతనిలో స్ఫూర్తి అయింది. తానుంటున్న స్థలంలో ఇల్లు పోను మిగతా భాగంలో చెట్లు నాటి వాటిని ప్రాణప్రదంగా పెంచారు. అది మొదలు రోడ్ల పక్కన ఖాళీ స్థలం, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ స్థలాలు, దేవాలయాలు.. ఇలా ఒకటేమిటి ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ మొక్కలు నాటడం రామయ్యకు నిత్యకృత్యం. వృత్తిరీత్యా కుండలు చేస్తూ, పాలు అమ్ముతూ ప్రవృత్తి రీత్యా వనపెంపకానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్న రామయ్య కనిపించిన వారికి మొక్కలనే బహుమతిగా ఇస్తూ బిడ్డల్లా పెంచాలని చెబుతాడు.

**మొక్కలే బహుమతులు**

ఎవరైనా రామయ్య వద్దకు వెళ్లి విత్తనాలు, మొక్కలు కావాలని అడిగితే.. అడిగినదానికంటే ఎక్కువ ఇచ్చి మొక్కలు నాటాలని, సంరక్షించాలని చెబుతుంటారు. ఏ శుభకార్యానికి వెళ్లినా విత్తనాలు, మొక్కలు తీసుకువెళ్లి ఇస్తుంటారు.

**కోటి మొక్కలు**

ఇప్పటిదాకా కోటికి పైగా మొక్కలు నాటాడు.. ప్రతిఫలం ఆయన ఆశించలేదు, ఎవరూ ఇవ్వనూ లేదు! అతను నాటిన మొక్కలు భారీ వృక్షాలై పర్యావరణాన్ని కాపడుతున్నాయి. చెట్ల నుండి నేల రాలిన నిద్రగన్నేరు, గానుగ విత్తనాలను మండుటెండలో ఇప్పటికీ ఏరుతున్నారు. ఇలా సేకరించిన విత్తనాలను వర్షా కాలం మొదలు కాగానే అడవుల్లోకి తీసుకెళ్లి చల్లుతాడు.

రామయ్య 60 సంవత్సరాల వయస్సులోనూ అడవుల వెంట తిరుగుతూ వివిధ రకాల విత్తనాలను సేకరించి, మొక్కలు పెంచి, పదిమందికి పంచుతుంటారు.

**భారత ప్రభుత్వ గుర్తింపు**

అభినవ అశోకుడిగా తెలంగాణ ఖ్యాతిని పెంచిన వనజీవి రామయ్యను భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో గౌరవించింది.

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ పథకానికి మూడేండ్లు నిండిన నేపథ్యంలో స్వచ్ఛతే సేవ ప్రచారానికి మద్దతు తెలుపాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వివిధ రంగాల్లోని ప్రముఖులకు లేఖలు రాశారు. ఇందులో భాగంగా వనజీవి కోటి మొక్కల రామయ్యకు ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆయనకు ప్రధాని పిలుపునివ్వడం కోటి మొక్కల రామయ్య చేసిన సేవలకు దక్కిన గుర్తింపు.

**భార్య చేయూత**

'నా ధ్యాస, శ్వాస అంతా మొక్కలే. ఎందరో వేనోళ్ల మెచ్చుకున్నానా లక్ష్యానికి చేయూత కల్పించే వారు మాత్రం తక్కువే. శరీరం సహకరించని వయసులో బొటాబొటీ జీవితాన్ని అనుభవిస్తున్న నేను చాలీచాలని ఇంట్లో బతకడానికే కాస్తంత తింటూ జీవనం వెళ్లబుచ్చుతున్నాను. నా భార్యే చేయూతనిస్తోంది. మా మనుమరాళ్లకు కూడా చెట్ల పేర్లే పెట్టాను. ఒకామె పేరు చందనపుష్ప. ఇంకో మనుమరాలు హరిత లావణ్య. కబంధపుష్ప,వనశ్రీ అని మరో ఇద్దరి పిల్లల పేర్లు." అని అమాయకంగా చెబుతాడు నిత్యహరిత స్వాప్నికుడు వనజీవి రామయ్య. ఆకు–మొక్క–చెట్టు–నీడ–ఈ నాలుగు మాటల్ని రామయ్య నుంచి ఎవరూ విడదీయలేరు. ఆయనకు పచ్చదనమే ధనం. ఆయన చేతి స్పర్శకు మాత్రం ప్రతీ విత్తనం మహావృక్షమవుతుంది !

**– శ్యామ్ మోహన్ రావు**



# Most common types of leave:






- Sick Leave
- Maternity Leave
- Extended Medical Leave
- Leave Without Pay
- Jury Duty
- Military Leave





# ప్రభుత్వ ఉద్యోగుల సెలవు నియమాలు-2

**1.2. ప్రత్యేక ఆకస్మిక సెలవు:**

♦ రీకెనలైజేషను చేయించుకున్న వారికి 21 రోజుల వరకు లేక ఆసుపత్రిలో ఉన్నన్ని రోజుల వరకు, (వీటిలో ఏది తక్కువైతే దానికి) ప్రత్యేక ఆకస్మిక సెలవులకు అర్హులు. దీనికి అదనముగా వారు ఆపరేషను చేయించుకొనటకు ఆసుత్రికి పోను మరియు రావడానికి పట్టు రోజులకు కూడా ఆకస్మిక సెలవుకు అర్హులు. కాని రికెనలైజేషను ఆపరేషను చేయించుకున్న వారు, వైద్య ఖర్చులు వాపసు కోరకుండా, ఈ క్రింది షరతులకు లోబడి మాత్రమే అర్హులు.

1. రీకెనలైజేషను ఆపరేషనుకు కావలసిన అన్ని వసతులు గల ఆసుపత్రిలో మాత్రమే ఆపరేషను చేయించుకోవాలి. ఒక వేళ ప్రైవేటు ఆసుపత్రిలో చేయించుకున్నట్లయితే అది ప్రభుత్వముచే గుర్తింపు పొందినదై ఉండాలి.
2. ప్రత్యేక సెలవు కావాలి అని కోరు వారు రీకెనలైజేషను ఆపరేషను చేయించుకున్న ఆసుపత్రి వైద్యులనుండి ఆసుత్రిలో చికిత్స చేయించుకున్నందుకు, కావలసిన రోజులు ఇంత అవసరమని ధృవీకరణ పత్రము, దరఖాస్తు తో పాటు జత చేయాలి.
3. పై సెలవు ప్రభుత్వ ఉద్యోగులకు పెళ్లి కాని వారికి మరియు ఇద్దరికన్న తక్కువ పిల్లలు ఉన్న వారికి లేక కుటుంబ నియంత్రణ ఆపరేషను చేయించుకున్న తరువాత పుట్టిన పిల్లలు ఆడ లేక మగవారందరు చనిపోయినచో మాత్రమే అర్హులు.

♦ కుటుంబ సంక్షేమ పథకములో, కుటుంబ నియంత్రణ ఆపరేషను, రీకెనలైజేషను ఆపరేషను చేయించుకొన్నవారం తీసుకోదలుచుకున్న ప్రత్యేక ఆకస్మిక సెలవులకు ముందు గాని లేక ఆ తరువాత కాని సాధారణ ఆకస్మిక సెలవు జతచేసి వాడుకోవచ్చును. కాని సాధారణ సెలవు మరియు ఆకస్మిక సెలవులకు రెండింటికి మాత్రము ప్రత్యేక ఆకస్మిక సెలవు ముందు ఉండ కూడదు. ఏదో ఒక సెలవుకు మాత్రము ముందు వాడుకోవచ్చును.

♦ ఆటల పోటీలలో పాల్గొను ప్రభుత్వ ఉద్యోగికి ఒక సంవత్సర కాలములో 30 రోజుల వరకు ప్రత్యేక ఆకస్మిక సెలవుకు అర్హులు. అంతకంటె ఎక్కువ కాలమును ఆ ఉద్యోగికి అర్హత గల సాధారణ సెలవు మంజూరి చేయ వచ్చును. ఈ విషయములో ప్రత్యేక అంశముగా, ప్రభుత్వఉద్యోగి ప్రత్యేక ఆకస్మిక సెలవును సాధారణ సెలవుతో కలుపుకొని వాడుకొనుటకు అవకాశమున్నది. కాని సాధారణ ఆకస్మిక సెలవుతో ఈ ప్రత్యేక సెలవు కలిపి వాడుకోరాదు.

ఈ క్రింద వివరించిన పరిస్థితులలో మాత్రేమె ఈ ప్రత్యేక సెలవు వాడుకోవలసి ఉంటుంది.

1 జాతీయ మరియు అంతార్జాతీయ ప్రాధాన్యమున్న ఆటల పోటీలలో పాల్గొన్నపుడు

2 ప్రభుత్వ ఉద్యోగి అలాంటి పోటీలలో పాల్గొనుటకు ఎన్నుకొనబడినచో

3 అంతార్జాతీయ పోటీలలో భారతదేశము తరుపున పాల్గొనుటకు భారత దేశం గుర్తించిన ఆటల సంఘం సభ్యునిగా ఎన్నికైనచో

♦ సివిల్ సర్వీసులో ఉన్న ప్రభుత్వ ఉద్యోగి, ప్రాదేశిక మిలిటరీ, లేక సహాయ వైమానిక దళంలో ఉద్యోగముకొరకు కావలసిన వైద్యపరీక్షలకు గాని అర్హత పరీక్షలకు గాని హాజరైనచో, విధులకు గైరుహాజరు 30 రోజులకన్న తక్కువ ఉన్నచో. ప్రత్యేక ఆకస్మిక సెలవుకు అర్హుడు. ఈ విషయములో తాత్కాలిక ఉద్యోగులకు కూడా ఇదే వర్తించును.

♦ సాంస్కృతిక సంఘాల సభ్యులకు మరియు సచివాలయ సాంస్కృతిక సంఘాల కార్యవర్గ సభ్యులకు వావు ప్రదర్శించిన నాటకాలతో సంభందం లేకుండా సంవత్సరానికి 6 రోజులు ప్రత్యేక ఆకస్మిక సెలవులకు అర్హులు.

♦ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన సంయుక్త స్టాఫ్ కౌన్సిల్ లో సభ్యత్వం గల ఉద్యోగ సంఘాల ప్రధాన కార్యవర్గ సభ్యులు మరియు ప్రతి జిల్లానుండి ఇద్దరు కార్యవర్గ సభ్యులకు కాలెండరు సంవత్సరానికి 21 రోజులకు మించకుండా ప్రత్యేక ఆకస్మిక సెలవుకు అర్హులు.

♦ పైన వివరించిన 21 రోజుల ఆకస్మిక సెలవులు ఆటల పోటీల మరియు సాంస్కృతిక కలాపాలకు కేటాయించిన సెలవులకు ఇవి అదనము కాదు.

♦ ఈ సెలవు మంజూరి చేయు అధికారిపై ఆదారపడి ఉంటుంది.

♦ జాతీయ అంతార్జాతీయ ప్రాధాన్య మున్న సాంస్కృతిక కార్యకలాపాలలో పాల్గొను ఉద్యోగులకు 30 రోజుల వరకు ప్రత్యేక ఆకస్మిక సెలవులకు అర్హులు

**సాధారణ సూచనలు:**

♦ సెలవు నియమాలలో తెలిపిన ప్రకారము, సాధారణంగా, ఇతర సెలవులతో కలిపిగాని జాయినింగు సమయముతో లేక వేకేషను సెలవులతో కలిపి గాని ఆకస్మిక సెలవు తీసుకోరాదు.

**1.3. కాంపెన్సేటరీ క్యాజువల్ లీవు.**

♦ ప్రభుత్వము ప్రకటించిన సెలవు రోజు కార్యాలయలో పనిచేయుటకు రావలసినదిగా ప్రభుత్వ ఉద్యోగిని ఆదేశించిచో, ఆ సెలవు రోజు పని చేసినందుకు గాను ఆ ఉద్యోగికి మరొక రోజు కార్యాలయము పనిచేయురోజులలో, ఆకస్మిక సెలవులకు అదనముగా ఒక రోజు సెలవును మంజూరి చేయాలి. దానినే సెలవు రోజు పనిచేసినందుకు బదులుగా వాడుకొనే సెలవు (సి.సి.ఎల్) కాంపెన్సేటరి క్యాజువల్ లీవు అంటారు. అలాంటి




సెలవులు క్యాలెండరు సంవత్సరములో 10 కంటె ఎక్కువ కాకుండా వాడుకోవచ్చును. కాని సెలవురోజు పనిచేసిన దినమునుండి 6 నెలలలోగా వీటిని వాడుకోవాలి. లేకుంటె మురిగిపోవును.

♦ కాంపెన్సేటరీ క్యాజువల్ లీవు సాధారణ ఆకస్మిక సెలవుతో గాని సాధారణ ప్రభుత్వ సెలవు దినములతో కలుపుకొని వాడుకోవచ్చును. కాని ఒకేసారి కార్యాలమునకు పై సెలవుల రూపేన గైరు హాజరు 10 రోజుల కంటె మించరాదు.

♦ గెజిటెడ్ అధికారులు కూడా ఏదేని కార్యాలయములో ఇతర అధికారి క్రింద సహాయ అధికారిగా పనిచేయు వారికి కూడా ఈ సెలవులకు అర్హులు. స్వయంగా చార్జికలిగి స్వతంత్రంగా కార్యాలయ అధికారి గా పనిచేయు గెజిటెడ్ అధికారులు కూడా ఈ నియమాలు వర్తించుతాయి కాని అలాంటి అధికారులు, ఇతర అధికారులు అనుమతి తీసుకోవలసిన అవసరము ఉన్నపుడు, ఆ అధికారి సెలవు రోజున గెజిటెడ్ అధికారి పనిచేయవలసిన అవసరమున్నదని సంతృప్తి చెందినచో అలాంటి సెలవు మంజూరి చేయవచ్చును.

♦ ఈ సెలవును సాధారణ ఆకస్మిక సెలవులతో కలిపి వాడుకోవచ్చును.

**2. అర్ధవేతన సెలవు వివరాలు.**

♦ ప్రతి ఉద్యోగి తను పూర్తిచేసిన సర్వీసుకు ప్రతి ఒక సంవత్సరము వ్యవధికి, అసాధారణ సెలవు కలుపుకొని, 20 రోజుల అర్ధవేతన సెలవు సంపాదిస్తారు. దీనికి పరిమితి లేదు. (రూల్.13(ఎ), 18(ఎ) మరియు 23(1). విధులకు హాజరైన రోజులు, సెలవు మరియు అసాధారణ సెలవు కాలమునకు కూడా అర్ధవేతన సెలవు జమచేస్తారు.

♦ అర్ధవేతన సెలవును స్వంత పనులకొరకు లేక వైద్యకారణాలపై కూడా మంజూరి చేస్తారు. అర్ధవేతన సెలవుకు పరిమితి లేదు. (రూల్.11)

♦ స్టేట్ & సబార్డినేట్ సర్వీసు నియమాల లోని రూల్.

10(ఎ)(1) ప్రకారం నియమించబడిన తాత్కాలిక ఉద్యోగులకు వారి సర్వీసు క్రమబద్ధీకరించ(రెగ్యులరైజ్ కా)నంతవరకు అర్ధవేతన సెలవుకు అర్హులు కారు. (ప్రభుత్వ మెమో నెం. 20584/302/ఎఫ్- 1/74-1/ఫైనాన్స్& ప్లానింగ్. తేది. 12-09-1974)

♦ డైస్-నాన్ కాలము(వ్యవధి)ను , సస్పెన్షన్ కాలమును విధులకు హాజరు కాని కాలముగా, పరిగణించినచో, అట్టి కాలమును, అర్ధవేతనము జమచేయుటకు కావలసిన సంవత్సర కాలమునుండి మినహాయించాలి.(ఎఫ్.ఆర్.18)

♦ అర్ధవేతన సెలవు పోగుచేసుకొనుటకు గాని, ఒకసారి అర్ధవేతన సెలవును మంజూరి చేయుటకు గాని పరిమితి లేదు.

♦ టి.బి/క్యాన్సర్/మానసిక రోగం/క్షయ/ కుష్టు వ్యాధి/ హృద్రోగము మరియు కిడ్నీ వ్యాధులతో భాద పడుతున్న ప్రభుత్వ ఉద్యోగికి అర్ధవేతన సెలవును 6 నెలల వరకు వాడుకోవచ్చును. దీనిని అర్ధవేతనమునుండి తీసివేయాలి. కాని వేతనము మాత్రము పూర్తి వేతనము చెల్లించాలి. ఒకవేళ అర్ధవేతనము తన ఖాతాలో సరిపడినంత లేనట్లయితే ఈ నియమము వర్తించదు.(జి.వో.ఎమ్ఎస్.నెం.188 ఎఫ్& పి. డిపార్టుమెంటు. తేది. 30-07-73, జి.వో.ఎమ్ఎస్.నెం.234 ఎఫ్& పి. డిపార్టుమెంటు. తేది. 29-08-75, జి.వో.ఎమ్ఎస్.నెం.336 ఎఫ్&పి. డిపార్టుమెంటు. తేది.06-09-76, జి.వో.ఎమ్ఎస్. నెం.449 ఎఫ్& పి. డిపార్టుమెంటు. తేది. 28-10-76)

♦ మానసిక రోగం/ కుష్టు వ్యాధి/ హృద్రోగము/ కిడ్నీ మరియు ఏయిడ్స్ వ్యాధులతో భాద పడుతున్న ప్రభుత్వఉద్యోగికి అర్ధవేతన సెలవును 8 నెలల వరకు వాడుకొనుటకు ప్రభుత్వం జి.వో.ఎమ్ఎస్.నెం.29 ఎఫ్& ఆపి.(ఎఫ్.డబ్ల్యూ.ఎఫ్.ఆర్-1) డిపార్టుమెంటు. తేది.09-03-2011 ద్వార ఆదేశాలు జారీ చేసినది.

♦ అర్ధవేతన సెలవు కాలమును మూల వేతనము లో సగం చెల్లించాలి. కరువుబత్తెము దానికి దామాషా పద్దతిలో చెల్లించాలి.

♦ ఇంటి అద్దె అలవేన్సు మరియు సిటి కాంపెన్సేటరి అలవేన్సు మాత్రము 180 రోజుల వరకు పూర్తిగా చెల్లించాలి. (జి.వో.ఎమ్ఎస్.నెం.28. ఎఫ్& ఆపి.(ఎఫ్.డబ్ల్యూ.ఎఫ్.ఆర్-1) డిపార్టుమెంటు. తేది. 09-03-2011)

♦ ప్రభుత్వ ఉద్యోగి ఉన్నత స్థాయిలో రెగ్యులర్ గా నియమించబడినను, లేక క్రింది స్థాయిలో నియమించబడినను వారి ప్రొబేషను కాలమును సంతృప్తికరంగా ప్రకటించబడక పోతే వారికి ఈ క్రింది షరతులకు లోబడి అర్ధవేతన సెలవు మంజూరుచేయవచ్చును.

♦ అర్ధవేతన సెలవు వైద్య కారణాలతో లేక స్వంత పనులకొరకు మంజూరి చేయవచ్చును

♦ ఉన్నతి శ్రేణి కి చెందిన వారు 2 సంవత్సరాల రెగ్యులర్ సర్వీసు పూర్తిచేసి ఉండాలి.

♦ తక్కువ శ్రేణి కి చెందిన వారు 1 సంవత్సరం రెగ్యులర్ సర్వీసు పూర్తిచేసి ఉండాలి. (సెలవు నియమాలు. రూల్.23(ఎ)(1))

♦ ప్రభుత్వ మెమో.నెం.14568-ఎ/63/పి.సి.ఐ/ఎ2/ 2010.తేది. 31-01-2011 ప్రకారము 6 నెలల వరకు మూలవేతనంలో సగం దానికి దామాషా లో కరువు బత్తెం, ఇంటి అద్దె అలవేన్సు మరియ సిటి కాంపేన్సేటరీ అలవేన్సు పూర్తిగా చెల్లించాలి. ఆరు నెలల తరువాత సిటికాంపెన్సేటరి అలవేన్సును చెల్లించరాదు.

♦ పదవీ విరమణ తరువాత, అర్ధవేతన సెలవులో మిగులు రోజులకు, నగదుగా మార్చుకొనే అవకాశము కలదు. కాని ఆర్జిత సెలవులు మరియు అర్ధవేతన సెలవులు మొత్తం కలిపి 300 రోజులకన్న ఎక్కువ తీసుకోరాదు. దానర్ధం ఆర్జిత సెలవులు 300 రోజులకు తక్కువ ఉన్నరోజులకు మాత్రమే అర్ధవేతనము రోజులు కలిపి మొత్తం 300 రోజలుగా నగదు తీసుకో వచ్చును. (జి.వో.ఎమ్ఎస్. నెం.154.ఎఫ్ & ఆపి. (ఎఫ్.డబ్ల్యూ.ఎఫ్.ఆర్-1) డిపార్టుమెంటు. తేది. 04-05 -2010)

**అర్ధవేతనసెలవులను పూర్తివేతనము గా పొందుట.**

ఈ సెలను వైద్య కారణాలతో మాత్రమే మంజూరి చేస్తారు. దీనిలో తీసుకొన్న సెలవులకు రెండింతల సెలవును అర్ధవేతన సెలవు ఖాతానుండి తీసివేస్తారు. అంటె 20 రోజుల సెలవుకు బదులకు 40 రోజులు ఖాతానుండి తగ్గిస్తారు. దీనినే కమ్యూటెడ్ సెలవు అంటారు. ఇలాంటి సెలవును ఆర్జిత వేతన సెలవుకు అర్హత ఉన్నా కూడా ఇది తీసుకోవచ్చును. ఇలాంటి సెలవు తాత్కాలిక ఉద్యోగులకు వర్తించదు. ఎందుకంటే వారు అర్ధవేతన సెలవను సంపాదించలేరు.

ప్రభుత్వ ఉద్యోగి అర్ధవేతన సెలవులో ఉన్నపుడు రాజీనామా చేసినను, స్వచ్ఛంద పదవీ విరమణ చేసినను, చనిపోయినను, తప్పని సరిగా వదవీ విరమణ చేయవలసి వచ్చినపుడు, మొత్తం కమ్యూటెడ్ సెలవును అర్ధవేతన సెలవుగా పరిగణించి, స్వచ్ఛంద పదవీ విరమణ పొందినపుడు, లేక రాజీనామా చేసినపుడు, మాత్రమే ఎక్కువ చెల్లించిన వేతనమును రాబట్టుకోవాల్సి వస్తుంది,

**మిగతా తరువాయి సంచికలో**

**శ్రీ యస్.శంకరయ్య.**
సీనియర్ రిసోర్సు పర్సన్. మరియు
విశ్రాంత డివిజనల్ పంచాయతీ అధికారి.



# గ్రామపంచాయతీ రికార్డులు మరియు రిజిష్టర్ల నిర్వహణ

**రికార్డులంటే ఏమిటి?**

ఏదేని సంస్థ లేదా కార్యాలయములో పనిచేసే సిబ్బంది నిత్యకృత్యంగా అమలు జరిపే కార్యక్రమాలు, ఆర్థిక లావాదేవీలు మరియు వాటి ఫలితాల సాక్ష్య రూపాలే 'డాక్యుమెంటు'గా పేర్కొనవచ్చు.

డాక్యుమెంట్లలోని సమాచారాన్ని అవి రూపొందించిన విధానముతో గానీ, లక్షనం, భౌతిక రూపము, మాధ్యమముతో గానీ సంబంధము లేకుండా భద్రపరచుటకు రికార్డుగా పేర్కొనవచ్చు. ఒక రికార్డులో 2 గానీ అంతకంటే ఎక్కువగానీ డాక్యుమెంట్లు ఉండవచ్చు. సమాచార హక్కుచట్టంలో కూడా ఇదే నిర్వచనము ఇవ్వబడినది.

వార్షిక జమా–ఖర్చులు, కార్యాలయానికి సంబంధించిన ఒప్పందాలు, పుస్తకాలు, డ్రాయింగ్స్ (లేఅవుట్ చిత్రాలు, మ్యాపులు, స్కెచ్‌లు మొదలైనవి)

ఎలక్ట్రానిక్ డిస్కులు, మైక్రోగ్రాఫిక్స్, స్పీకింగ్ రికార్డులు, మాగ్నటిక్ / ఆప్టికల్ డిస్కులు, మెమోలు, లేఖలు మొదలగునవి అన్ని కూడా రికార్డుల క్రిందకు వస్తాయి.

ఏ సంస్థ పనితీరునైన తెలుసుకోవాలంటే, ఆ సంస్థలోని రికార్డులన్నీ కూడా నిర్ణీత నమూనాలలో సక్రమంగా, ఖచ్చితంగా ఎప్పటికప్పుడు (అప్ టు డేట్) పూర్తి చేసి కార్యాలయపు ఉన్నతాధికారి ఆమోదం పొందడం అనేది చాలా ముఖ్యమైనది.

రికార్డులు & రిజిష్టర్లు ఎప్పుడైనా క్రొత్తగా ఆరంభించినప్పుడు శాఖ సీనియర్ లేదా ఉన్నతాధికారిచే ధృవీకరణ చేయించాలి. దీనికిగాను ఈ క్రింది విషయాలు పాటించుట తప్పనిసరి.

1. నూతన రిజిష్టర్‌లో పేజి నెం. నుండి .... వరకు ధృవీకరణ
2. సంబంధిత రిజిష్టర్‌కు డూప్లికేట్ రిజిష్టరు నిర్వహించుట లేదని ధృవీకరణ
3. పూర్వపు రిజిష్టర్ (నగదు పుస్తకములలోని ముగింపు నిల్వలను ప్రస్తుత/నూతన రిజిష్టర్‌లోని ఆరంభ నిల్వలుగా చూపుతున్నాయని ధృవీకరణ
4. పూర్వపు (పూర్తిఅయిన) రిజిష్టర్‌లు తమ ఆధీనంలో ఉన్నాయని తెలుపుతూ ధృవీకరణ

**రికార్డులను ఎందుకు నిర్వహించాలి?**

పరిపాలనలో రికార్డుల నిర్వహణ చాలా ముఖ్యమైనది. చక్కటి రికార్డుల నిర్వహణ వల్ల ప్రజాపరిపాలన సులభతరమే కాకుండా ప్రజలకు సౌకర్యాలు/సేవలు త్వరితగతిన కల్పించవచ్చు. రికార్డుల నిర్వహణ సంస్థ ఆదాయ–వ్యయాలు, ఇంకా కొనసాగించవలసిన పనులు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుటకు ఉపకరిస్తాయి.




ప్రజా సంక్షేమ పథకాలు సత్ఫలితాలనివ్వాలంటే పంచాయతీ ఖర్చు చేసిన నిధులు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే విధంగా వ్యయం చేయాలి. వాటిని సక్రమంగా రిజిష్టర్‌లో పొందుపరచాలి.

ఒక సంస్థ లేదా ప్రభుత్వం యొక్క ప్రగతికి సాధించిన పాయింట్లు/మార్కులకు రికార్డులు కొలమానాలుగా నిలుస్తాయి. వాటిని ఎప్పటికప్పుడు అప్‌డేషన్ చేయడం వల్ల సంస్థలోని లోపాలు తెలుస్తాయి. తద్వారా చక్కదిద్దుకునే అవకాశ ముంటుంది.

రికార్డుల నిర్వహణ అనునది సరళంగా, ఖచ్చితంగా, సులభంగా అనుసరించతగినదిగా ఉండవలెను. ఒక సంస్థ యొక్క ఆర్థిక లక్ష్యాల సాధన, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన ఆ సంస్థ నిర్వహించే రికార్డులపైన ఆధారపడి ఉంటుంది.

**ఉపయోగాలు:**

రికార్డుల సమగ్ర నిర్వహణ వలన ఈ క్రింది ప్రయోజనాలు కలుగుతాయి.

1. లెక్కల పట్టికలు ఖచ్చితంగా, త్వరితగతిన తయారు చేయుటకు వీలవుతుంది
2. నగదు నిర్వహణ అదుపు తప్పకుండా పద్ధతిగా ఉంటుంది.
3. సంస్థ భవిష్యత్‌లో మంచి నిర్ణయాలు తీసుకొనుటకు ఉపకరిస్తాయి
4. సంస్థ యొక్క ఆర్థిక స్థితిని అంచనా వేయుటకు ఉపకరిస్తాయి.
5. సమయము సద్వినియోగమవుతుంది.
6. సిబ్బందిపై వెచ్చించిన వ్యయము మరియు వారి పనితీరును అంచనా వేయుటకు ఉపకరిస్తాయి.
7. చేసిన పొరబాట్లను సకాలంలో గుర్తించి సరిదిద్దుకొనుటకు వీలవుతుంది.
8. త్వరితగతిన సమస్యాత్మక క్షేత్రాలను గుర్తించి పరిష్కారాలను కనుగొనుటకు ఉపకరిస్తాయి.
9. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులకు న్యాయం కల్పించవచ్చు.
10. పై అధికారులకు అవసరమైన సమాచారం అందించుటకు ఉపకరిస్తాయి.
11. సంస్థలోనే పరిపాలనా క్రమంలో ఎక్కడ నిధులు దుర్వినియోగం అవుతున్నాయో తెలుసుకోవచ్చు.
12. రికార్డుల నిర్వహణలో విపరీతమైన తొందర చేయరాదు.
13. రికార్డులు పోతే తిరిగి సాధించవలెను. లేక తయారు చేయవలెను.
14. సాధ్యమైనంత వరకు సరళంగా సులభతరంగా నిర్వహించవలెను.
15. ప్రభుత్వ కార్యక్రమాలు సజావుగా కొనసాగించటానికి ఉపకరిస్తాయి.
16. విలువైన సమాచారాన్ని ప్రత్యేక పద్ధతుల ద్వారా భద్రపరచాలి.
17. జిల్లాస్థాయి ఉన్నతాధికారులు గానీ, రాష్ట్రస్థాయి అధికారులు గానీ సమీక్ష చేయుటకు తగు చర్యలు గైకొనుటకు ఉపకరిస్తాయి.

కావున, అన్ని గ్రామపంచాయతీలలో రికార్డులు & రిజిష్టర్ల నిర్వహణ ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించవలసిన ఆవశ్యకత ఉన్నది. ఇందువల్ల సమాచారహక్కు చట్టం ద్వారా ప్రజలకు తగిన సమాచారం ఇవ్వడానికి వీలవుతుంది. కోర్టు కేసులలో సాక్ష్యాధారాలుగా చూపించుటకు మరియు వివాదాలు పరిష్కరించుటకు ఉపకరిస్తాయి.

## గ్రామపంచాయతీలలో నిర్వహించవలసిన రికార్డులు & రిజిష్టర్‌లు

గ్రామపంచాయతీకి సంబంధించిన ఆర్థిక లావాదేవీలన్నీ కూడా సంబంధిత రిజిష్టర్‌లలో పొందు పరచవలెను. గ్రామపంచాయతీ తీర్మానం మేరకు నిర్వహించిన ఆదాయ-వ్యయాలను సంబంధిత రిజిష్టర్‌లలో క్రమం తప్పకుండా చూపవలెను. సర్పంచ్ మరియు వార్డుసభ్యులు ఎప్పుడైనా రికార్డులను పరిశీలించవచ్చు.

తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018 లోని సెక్షన్ 284 (1), (2), (3) లు గ్రామపంచాయతీ నిర్వహించవలసిన రికార్డులు లేదా రిజిష్టర్లను స్పష్టం చేసాయి.

గ్రామపంచాయతీ నిర్వహించవలసిన రిజిష్టర్‌లు ఈ క్రింది విధంగా విభజింపబడ్డాయి.

1. సమావేశాలకు సంబంధించిన రిజిష్టర్‌లు
2. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రిజిష్టర్‌లు
3. రోజువారీ కృత్యాలకు సంబంధించిన రిజిష్టర్‌లు- 61 నిర్ణీత ఫారాలు

**1. సమావేశాలకు సంబంధించిన రిజిష్టర్‌లు:**

(i) గ్రామపంచాయతీ సమావేశపు ఎజెండా నోటీసు రిజిష్టర్

(ii) గ్రామపంచాయతీ సమావేశపు సభ్యుల హాజరు రిజిష్టర్

(iii) గ్రామపంచాయతీ సమావేశపు మినిట్సు / తీర్మానాల రిజిష్టర్

(iv) గ్రామసభ ఎజెండా నోటీసు రిజిష్టర్

(v) గ్రామసభ హాజరు రిజిష్టర్

(vi) గ్రామసభ మినిట్సు / తీర్మానాల రిజిష్టర్

**2. ఆర్థిక కార్యాకలాపాలకు సంబంధించిన రిజిష్టర్‌లు (రాబడులకు చెల్లింపులు)-నూతనంగా ప్రవేశపెట్టబడిన రిజిష్టర్‌లు:**

11వ ఆర్థిక సంఘం సిఫారసుల ఆధారంగా కంప్ట్రోలర్ & ఆడిటర్ జనరల్ వారు రూపొందించినటువంటి నూతన అకౌంటింగ్ నమూనాలను & బడ్జెట్ తయారీ నమూనాలను జిల్లా ప్రజాపరిషత్‌లు, మండల ప్రజాపరిషత్‌లు మరియు గ్రామపంచాయతీలు తప్పనిసరిగా పాటించుటకు అట్టి నిర్ణీత నమూనాలలోనే ఆదాయ-వ్యయాలను నిర్వహించుటకు ప్రభుత్వము జి.ఓ.యం.ఎస్ నెం.172, పి.ఆర్ & ఆర్.డి (అకౌంట్స్-1) శాఖ, తేదీ:16.05.2005 ద్వారా ఆదేశాలను జారీ చేశారు.



| క్ర.స | రిజిష్టరు పేరు |
|---|---|
| 1. | గ్రామపంచాయతీ వార్షిక రాబడులు&చెల్లింపుల రిజిష్టరు |
| 2. | పెట్టుబడి-వ్యయముల (స్కీముల వారీగా) నివేదిక |
| 3. | వార్షిక ఆదాయ వ్యయములు - బకాయిల నివేదిక |
| 4. | డిపాజిట్లు, అడ్వాన్స్‌లు మరియు ఋణాల వార్షిక నివేదిక |
| 5. | రోజువారీ ఆదాయ-వ్యయముల రిజిష్టర్ (చిట్టా రిజిష్టర్) |
| 6. | నెలవారీ (మాసాంతర) ఆదాయ-వ్యయముల నివేదిక |
| 7. | నెలవారీ రికన్సిలియేషన్ నివేదిక |
| 8. | కంపైలేషన్ షీట్లు (డిటైల్డ్ పోస్టింగ్ రిజిష్టర్) |
| 9. | కన్సాలిడేటెడ్ అబ్‌స్ట్రాక్ట్ (సంగ్రహణ పోస్టింగ్ రిజిష్టర్) |
| 10. | డిమాండు, వసూలు మరియు బకాయిల రిజిష్టర్ |
| 11. | నగదు పుస్తకములు |
| 12. | స్టాక్ రిజిష్టర్ |
| 13. | చరాస్థుల రిజిష్టర్ |
| 14. | స్థిరాస్తుల రిజిష్టర్ |
| 15. | రోడ్డు వివరముల రిజిష్టర్ |
| 16. | భూముల రిజిష్టర్ |

**గ్రామపంచాయతీ నిర్వహించవలసిన ఇతర రిజిష్టర్‌లు**

1. గ్రాంటు వివరముల రిజిష్టర్
2. మిస్సిలేనియస్ డిమాండు రిజిష్టర్
3. చందా వివరముల రిజిష్టర్ (సబ్‌స్క్రిప్షన్ వివరముల రిజిష్టర్)
4. మిస్సిలేనియస్ అమ్మకము (విక్రయము) వివరముల రిజిష్టర్
5. మనీ ఆర్డర్ వివరముల రిజిష్టర్
6. చెక్కులు & డ్రాఫ్టుల వివరముల రిజిష్టర్
7. మైనర్ వేలముల రిజిష్టర్
8. చిట్టా రిజిష్టర్
9. ఇరుసాల్‌నామా రిజిష్టర్

10. ఇంటిపన్ను - డిమాండు రిజిష్టర్
11. లైసెన్సు డిమాండు రిజిష్టర్
12. ట్రెజరీ పాస్‌బుక్
13. పెట్టి క్యాష్ బుక్
14. శాశ్వత అడ్వాన్స్ బిల్లు - ఆమోదముల రిజిష్టర్
15. డిపాజిట్లు రిజిష్టర్
16. అడ్వాన్సుల రిజిష్టర్
17. అక్విటెన్స్ రిజిష్టర్
18. కంటిన్‌జెంటు చార్జీల రిజిష్టర్
19. ప్రయాణ భత్యముల - బిల్లుల రిజిష్టర్
20. గ్రాంటు అప్రాప్రియేషన్ రిజిష్టర్
21. పోస్టు స్టాంపుల అకౌంటు (తపాలా స్టాంపుల అకౌంటు) రిజిష్టర్
22. సెక్యూరిటీల రిజిష్టర్
23. మనీవ్యాల్యూ ఫారం రిజిష్టర్
24. ఉద్యోగుల (సిబ్బంది) సర్వీసు పుస్తకాలు
25. ఇంక్రిమెంటు వివరాల రిజిష్టర్
26. లేట్-అటెండెన్స్ రిజిష్టర్
27. ఆకశ్మిక సెలవుల వివరముల రిజిష్టర్
28. సిబ్బంది మూమెంట్ రిజిష్టర్
29. పనుల వివరముల రిజిష్టర్
    (i). కొలతల నమోదు పుస్తకములు (స్టాక్స్)
    (ii). పనుల వివవిరముల పుస్తకములు
    (iii). టెండర్ల వివరముల పుస్తకములు
30. ఆడిట్-అభ్యంతరముల వివరముల రిజిష్టర్
31. వాహనముల లాగ్‌బుక్ వివరముల రిజిష్టర్

నూతన అకౌంటింగ్ విధానము ప్రకారము పూర్వపు రిజిష్టర్‌లలోని కొన్ని నమూనాలను మార్చడం జరిగినది. అట్టి నిర్ణీత నమూనాలలో మాత్రమే వివరములను పొందుపరచవలసి యుంటుంది.

1. వార్షిక రాబడులు & చెల్లింపుల లెక్కలు (ప్రొఫార్మా-1)
2. నగదు పుస్తకము (ప్రొఫార్మా-8) - గతంలో వివిధ గ్రాంటు / స్కీములకు వేర్వేరు నగదు పుస్తకాలు ఉన్నప్ప టికీ అన్ని రకాల నగదు & చెల్లింపులను ఒకే నగదు పుస్తకములో చూపవలెను.
3. డిమాండు, వసూలు మరియు బాకీ రిజిష్టర్ (ప్రొఫార్మా-10) - వివిధ రకాల పన్నులకు వేర్వేరు డిమాండు రిజిష్టర్లను నిర్వహించవలెను.
   ఉదా:
   ఎ) ఇంటిపన్ను డిమాండు రిజిష్టరు (ఇంటిపన్ను, లైబ్రరీసెస్సు మరియు డ్రైనేజి పన్ను ఒకే రిజిష్టర్‌లో లేదా వేర్వేరు రిజిష్టర్లలోనైనా నిర్వహించవచ్చు)
   బి) లైసెన్సు & ఫీజుల డిమాండు రిజిష్టర్
   సి) మిస్సిలేనియస్ డిమాండు రిజిష్టర్
4. స్టాక్ రిజిష్టర్ (ప్రొఫార్మా-13)-ఆఫీసు (కార్యాలయం), వీధిదీపాలు, బ్లీచింగ్ పౌడర్ మొ॥ వాటికి వేర్వేరుగా నిర్వహించవలెను.
5. చరాస్థుల వివరముల రిజిష్టర్ (ప్రొఫార్మా-9)
6. స్థిరాస్థుల వివరముల రిజిష్టర్ (ప్రొఫార్మా-11)
7. రోడ్డు వివరముల రిజిష్టర్ (ప్రొఫార్మా-15)
8. భూ వివరముల రిజిష్టర్ (ప్రొఫార్మా-16)
   అంశము 5 నుండి 8 వరకు గతంలో టూల్స్ అండ్ ప్లాంటు రిజిష్టర్‌లో చూపేవారు. ప్రస్తుతం ఈ నాలుగు రిజిష్టర్‌లను వేర్వేరుగా నిర్వహించవలెను.
9. రోజువారీ రాబడులు-చెల్లింపుల రిజిష్టర్ (చిట్టా రిజిష్టర్‌ను నూతన అకౌంటింగ్ ఫారమ్‌లో నిర్వహించవలెను)

**సాధారణ పరిపాలనకు సంబంధించిన రిజిష్టర్‌లు:**

1. గృహనిర్మాణ అనుమతి వివరముల రిజిష్టర్
2. ఆదాయానిచ్చే ఆస్థుల వివరముల రిజిష్టర్
3. మిస్సిలేనియస్ రిజిష్టర్
4. ఆడిట్ వివరముల రిజిష్టర్

**రోజువారీ నిర్విహించవలసిన రిజిష్టర్‌లు:**

1. వీధిదీపముల స్టాకు మరియు పోల్‌వారీ మెయింటెనన్స్ వివరముల రిజిష్టర్
2. జనన& మరణముల నమోదు వివరముల పుస్తకము
3. వివాహముల నమోదు పుస్తకము
   (జి.ఓ.యం.ఎన్.నెం.227, తేదీ:3-4-95, జి.ఓ.యం.ఎస్.నెం.162, తేదీ:4-4-97 మరియు జి.ఓ.యం.ఎస్.నెం.496, తేదీ:11-6-66) (ఎ.పి.జి.పి యాక్ట్ 1964 ననుసరించి)

**సంబంధించిన ప్రొఫార్మాలు తరువాయి సంచికలో......**

**బి.లింబగిరిస్వామి**
డి.పి.ఓ (రిటైర్డ్), ఎస్.ఆర్.పి
సిడిపి&ఎ, టిఎస్ఐఆర్‌డి




# వ్యవసాయ రంగంలో ఉన్న స్టార్టప్లు

భారతదేశంలో ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి పనిచేస్తున్నారు. కానీ అందులో ఎక్కువ ఆదాయం రావడం లేదు. అందుకే ఏటేటా ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రకటిస్తున్నా రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం ఆగడం లేదు. సుప్రీంకోర్టు ఎన్నిసార్లు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు చీవాట్లు పెట్టినా ప్రభుత్వాలు దీర్ఘకాలిక ప్రణాళికలు ఆలోచించడం లేదు. రైతు చనిపోతే రైతుకు ఎంతో ఆర్థిక సాయం ప్రకటిస్తున్న సందర్భాలే ఎక్కువ. ఈ వైఖరి కచ్చితంగా మారాల్సిందేనని సుప్రీంకోర్టు కేంద్రానికి సూచించింది. ప్రభుత్వ ప్రాధాన్యాలు మరెవో ఉన్నప్పుడు రైతును తన కాళ్ల మీద నిలబడేలా ప్రభుత్వాలు ఏదో చేస్తాయని ఆశించడం తప్పులా కనిపిస్తోంది. అయితే అందరూ అలానే చింతిస్తూ కూర్చోరు. వ్యవసాయంతో సంబంధం ఉన్నా లేకపోయినా వీళ్లంతా వైవిధ్యంగా ఆలోచించారు. రైతు ఆదాయం పెరిగేలా, మార్కెటింగ్ అవకాశం మెరుగుపడేలా ప్రయత్నాలు చేశారు. దేశంలో స్టార్టప్ ప్రభంజనం కొనసాగుతున్న ఈ రోజుల్లో వ్యవసాయానికి సంబంధించిన స్టార్టప్లను మొదలుపెట్టారు. ప్రారంభించడం మాత్రం సులువే. కానీ ఎన్నో బాలారిష్టాలను ఎదుర్కొని విజయంతమైన అగ్రి స్టార్టప్ల గురించి ఇక్కడ తెలుసుకుందాం.

అగ్రిహబ్ దిఅగ్రిహబ్.కామ్ సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను, ఆధునిక సాంకేతికతను ముడిపెట్టేందుకు చేసిన ఒక చిరు ప్రయత్నం. ఈ స్టార్టప్ ఏ నిజమైన వ్యాపారులు, కంపెనీలను, డిస్ట్రిబ్యూటర్లను రైతులతో అనుసంధానిస్తుంది. ఈ స్టార్టప్ 2016లో రూ. 10 లక్షల నిధులతో ప్రారంభమై ప్రస్తుతం అంచెలంచెలుగా ఎదుగుతున్నది. పూర్తిగా పట్టణ స్థాయి కలిగిన టౌన్లు, నగరాల్లో ట్రేడర్లకు కొత్త వ్యవసాయ యంత్ర పరికరాల గురించి తెలియడం పెద్ద సమస్య ఏమీ కాదు. అదే టైర్-2, టైర్3 నగరాల విషయానికి వస్తే కొత్త సాంకేతికత గురించి తెలియాలంటే చాలా కష్టాలు పడాల్సి వస్తుంది. మామూలుగా అయితే వారు అగ్రికల్చర్ ఎగ్జిబిషన్లకు వెళ్లాల్సిందే. ఈ కష్టాన్ని ఈ వెబ్సైట్ తగ్గిస్తోంది. ఈ కంపెనీ రైతుల కోసం ఒక టోల్ఫ్రీ నంబరును సైతం నిర్వహిస్తోంది.

డిజిటల్ గ్రీన్ డిజిటల్ గ్రీన్ అనేది ఒక లాభాపేక్ష లేని అంతర్జాతీయ సంస్థ. దక్షిణాసియాతో పాటు, సబ్సహారా ఆఫ్రికా ప్రాంతాల్లో ఇది పనిచేస్తోంది. ఈ సంస్థ 2008లో ప్రారంభమైంది. 2008 నుంచి 2016 మధ్య దాదాపు 10 లక్షల వ్యక్తులను చేరుకోగలిగింది. 13,592 గ్రామాలను కవర్ చేసింది. గ్రామాలు వెళ్లినప్పుడు వీడియోలు తీయడం కూడా చేస్తారు. ఆ విధంగా ఇప్పటివరకూ 4426 వీడియోలను తీసి అప్లోడ్ చేశారు. అయితే అన్ని వీడియోలు అందరికీ

farMart

అందుబాటులో లేవు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 1230 వీడియోలను పబ్లిక్ యాక్సెస్లో ఉంచగా దాదాపు 5,88,388 వీక్షణలు వచ్చాయి. అందులో భారత్ నుంచే 3,82,739 వచ్చాయంటే భారతదేశంలో ఎంత ప్రభావవంతంగా తమ పనిచేసుకుపోతున్నారో అర్థం అవుతుంది.

మండి ట్రేడర్స్ పొలం నుంచి కొనుగోలు దాకా సకల సదుపాయాలను కల్పించే సంస్త మండి ట్రేడర్స్. ఈ విషయంలో ప్రతి దశలో రైతును ఇబ్బంది పడకుండా చేయడమే మండి ట్రేడర్స్ చేసిపెట్టే పని. బెంగుళూరుకు చెందిన ఎడ్విన్ వర్గీస్ దీన్ని ప్రారంభించారు. వీళ్లు తయారు చేసిన యాప్ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దీని ద్వారా ప్రభుత్వ మద్దతు ధరలు, మార్కెట్ యార్డ్ ధరలు, వ్యవసాయ వార్తలు వంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేతిలో ఉన్న మొబైల్ ద్వారానే తెలుసుకోవచ్చు. కానీ ఇక్కడ చాలా మంది వాదించే అంశం ఎంత మంది రైతులకు సాంకేతికత మీద అవగాహన ఉందని. ప్రతి ఊరిలో 10వ తరగతి చదివి వ్యవసాయం చేసే వారు ఒక్కరున్నా చాలు. ఈ విధమైన సమాచారాన్ని తోటి రైతులకు చేరవేసే అవకాశం ఉంది. భారత్తో మొదలైన దీని ప్రస్థానం ప్రస్తుతం థాయ్లాండ్, కామెరూన్ దేశాల్లో సైతం ఆసక్తిని రేకెత్తిస్తోందని తెలుస్తోంది.

క్రాప్ ఇన్ సాంకేతికతను ప్రతి రంగంలో విస్తరిస్తున్న ప్రభుత్వాలు వ్యవసాయంలో మాత్రం చెప్పుకోదగ్గ విధంగా విస్తరించడం లేదనేది కాదనలేని సత్యం. అందుకే అధునాతన సాంకేతికత రైతులకు చేరువ కావడం లేదు. అయితే చాలా ఐటీ కంపెనీలు ఎన్ని రంగాల్లో దూసుకెళ్లినా వ్యవసాయాన్ని మాత్రం దృష్టిలో ఉంచుకోవడం లేదు. దాన్నే దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ పరిశ్రమే ప్రధాన ఆధారంగా మొదలైన ఉత్తమ స్టార్టప్లో ఒకటి క్రాప్ఇన్. దీని వ్యవస్థాపకులు క్రిష్ణ కుమార్, కునాల్ ప్రసాద్. చిత్తరంజన్ జెనా సీటీవోగా పనిచేస్తున్నారు. బెంగుళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ క్లైంట్లలో బిగ్బాస్కెట్ సైతం ఉంది.

agroman.in

ఫార్మార్ట్ చిన్న కమతాలు 70 నుంచి 90 శాతం ఉన్న దేశం మనది. ఇక్కడంతా రోజు వారీ జీవనానికి కష్టపడు తుంటారు. అలాంటి రైతులు ఏ విధంగా వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకోగలరు? ఆ గ్యాప్ను బ్రిడ్జ్ చేసేందుకు వచ్చిందే ఫార్మార్ట్. సామాన్యుడు, చిన్న రైతుకు వ్యవసాయ పరికరాలను అందుబాటు ధరలో అందించేందుకు ఈ సంస్థ కృషి చేస్తోంది. అలేఖ్ తన తాత నుంచి పంజాబ్ రైతుల కష్టాలు విన్నాడు. తర్వాత కొంత మంది మిత్రులను కలిశాడు. ఆ విధంగా ఫార్మార్ట్ పురుడు పోసుకుంది. అగ్రికల్చర్కు సంబంధించి ఖరీదైన పరికరాలను ఇది అద్దెకు అందిస్తుంది. దాదాపు 5% రైతులు మాత్రమే సొంతంగా ట్రాక్టర్ల ద్వారా వ్యవసాయం చేయగలుగుతున్న దేశమిది. ట్రాక్టర్లు, టిల్లర్లు మొదలుకొని పంట కోతకు పనికొచ్చే పరికరాలను వీరు రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. 24 ఏళ్ల వయసులోనే అలేఖ్, మెహతాబ్ సింగ్ హాన్స్, మరో ఇద్దరు సలహాదార్ల సాయంతో ఫార్మార్ట్ను స్థాపించారు.

ట్రూస్ పండ్లు, కూరగాయలు కొనేందుకు వన్ స్టాప్ సొల్యూషన్గా ట్రూస్ వెబ్సైట్,యాప్ పనిచేస్తుంది. ఇలాంటివి చాలా ఉన్నాయి కదా అనుమానం చాలా మందికి ఉంటుంది.



ఇక్కడ నాణ్యతకు ప్రథమ ప్రాధాన్యత అందుకే అనతి కాలంలోనే చాలా మందికి తెలిసింది. ఆ సంస్థ కాంటాక్ట్ వివరాలు మెయిల్ ఐడీ *cantact@truce*, ఫోన్ నంబర్: +91-022-45042504, ఫేస్బుక్ , లింక్ఇన్డ్ ద్వారా సైతం మీరు యాజమాన్యాన్ని సంప్రదించే వీలుంది. నేరుగా రైతుల నుంచి అందుబాటు ధరలో వ్యవసాయ ఉత్పత్తులను వినియోగదారుడు అందుకోవాలనేది ఆ సంస్థ సిద్ధాంతం.

అగ్రోమాన్ దేశంలోని జనాలందరికీ ఫ్లిప్కార్ట్, అమెజాన్ ఎలాగోబీ రైతులకు ఆ స్థాయి వెబ్సైట్ అగ్రోమాన్. ఈ-కామర్స్ సొల్యూషన్లను రైతులకు అందించే సంస్థల్లో దేశంలో ముందు వరుసలో ఉండే సంస్థల్లో ఇదీ ఒకటి. గుర్గావ్ కేంద్రంగా ఈ సంస్థ పనిచేస్తోంది.

120 కోట్ల జనాభాకు రైతు అన్నం పెడుతున్నాడు. దేశంలో 60 శాతం పైగా జనాభా వ్యవసాయంపై








ఆధారపడింది. పారిశ్రామిక, సేవా రంగాల ఎదుగుదల ఎంతగా ఉన్నప్పటికీ వ్యవసాయం లాగా ఉపాధి కల్పించే స్థితిలో అవేవీ లేవు. ఇక్కడ మరో సమస్య వ్యవసాయం అంతా వర్షపాతం, కూలీల లభ్యత, పంట తెగుళ్లు, మార్కెటింగ్ దానిపై ఆధారపడి ఉంది. ఎన్నో అభివ ృద్ధి చెందుతున్న దేశాలు వ్యవసాయ యాంత్రీకరణ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నా భారతదేశం మాత్రం ఆ దిశగా ద ృష్టి సారించాల్సిన స్థాయిలో ప్రయత్నాలు చేయడం లేదు. జీడీపీకి వ్యవసాయం సమకూర్చే ఆదాయం 15% పైగా ఉంటుందని అంచనాలు ఉన్నాయి. అయినప్పటికీ ప్రభుత్వాలు వ్యవసాయం, అనుబంధ రంగాలపై శ్రద్ధ పెట్టడం లేదు. సమీప దూరంలో సరైన పంట ధాన్యాల ఉత్పత్తి లేక దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితులను ప్రభుత్వాలే బలవంతంగా తయారుచేస్తున్నాయి. దీనిపై సత్వరమే ద ృష్టి సారిస్తారని ఆశిద్దాం.

**బి.ప్రసన్న కుమార్**
పి. హెచ్.డి స్కాలర్




# వినియోగదారుల పరిరక్షణ చట్టం - అవగాహణ

ప్రతి మానవుడు నిత్య జీవితంలో ఏదో ఒక రకమైన వస్తు సేవలను వినియోగిస్తుంటాడు. వస్తు సేవలను వినియోగించకుండా మానవ జీవితాన్ని కొనసాగించడం ఏ మాత్రం సాధ్యం కాదు. ఈ సమాజంలో ప్రతి మానవుడు ఒక వినియోగదారుడే. కాని నేడు వినియోగదారులు వస్తు సేవలు కొనుగోలు వాటిని ఎంపిక చేసుకునే విషయంలో అనేక మోసాలను, దోపిడికి గురి అవుతున్నారు. నేటి సమాజంలో వ్యాపారస్థులు, వర్తకులు మితిమీరిన లాభాపేక్ష వల్ల అనుచిత అసత్య, అవాస్తవ వ్యాపార ప్రకటలను ప్రసార మాధ్యమాల ద్వారా ప్రసారం చేసి వినియోగదారుల ఎంపిక నిర్ణయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నారు.

నేటి ఆధునిక సమాజంలో కల్తి రాజ్యమేలుతుంది. పాలల్లో యూరియా, టీ పొడిలో రంపపు పొట్టు, మిరియాలలో బొప్పాయి గింజలు, కంది పప్పులో కేసరి పప్పు(గింజలు), కాఫీ పొడిలో చింత గింజల పొడి పంచదారాలో రవ్వ, బట్టల సోడా, గోదుమ పిండిలో చాక్‌పీస్ పౌడర్‌ను, వంటకాలలో ఉపయోగించే మంచి నూనెలో పశువుల కళేభరాలతో తయారు చేసిన నూనెను ఈ విధంగా ప్రతి వస్తువులోనూ కల్తియే జరుగుతుంది. దీనికి తోడు నకిలి వస్తువుల ఉత్పత్తి గణనీయంగా పెరిగిపోయింది. ప్రస్తుత వ్యాపార మార్కెట్‌లో 70% మేర కల్తి జరుగుతుందని అంచనాలు వెల్లడిస్తున్నాయి. వినియోగదారుల హక్కులను, ప్రయోజనాలను కాపాడటానికి వినియోగదారులు ఎదురుకొంటున్న మోసాలను అరికట్టడం కోసం 1986వ సం॥లో భారత ప్రభుత్వం వినియోగదారుల పరిరక్షణ చట్టంను తీసుకువచ్చింది. ఈ చట్టం జమ్ము కాశ్మీర్ రాష్ట్రం మినహా భారతదేశం అంతటా వర్తిస్తుంది.

**వినియోగదారుల పరిరక్షణ చట్టం-1986 స్వరూపం :-**

వినియోగదారుల పరిరక్షణ చట్టం జాతీయ స్థాయిలో జాతీయ వినియోగదారుల కమీషన్, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర వినియోగదారుల కమీషన్, జిల్లా స్థాయిలో జిల్లా వినియోగదారుల ఫోరంలను ఏర్పాటు చేశారు.

**జాతీయ వినియోగదారుల కమీషన్ :-**

సుప్రీం కోర్టు న్యాయ మూర్తి లేదా న్యాయమూర్తి అర్హత గల వ్యక్తి చైర్మన్‌గా కొనసాగుతారు. న్యాయ వాణిజ్య శాస్త్రలలో ప్రావీణ్యం పొందిన నలుగురు సభ్యులు ఉంటారు. వీరిలో ఒక్కరు మహిళ ఉంటారు. కోటి రూపాయలకు మించిన వివాదాలను పరిష్కరిస్తుంది.

**రాష్ట్ర వినియోగదారుల కమీషన్ :-**

ప్రతి రాష్ట్రానికి ఒక వినియోగదారుల కమీషన్ ఉంటుంది, హైకోర్టు న్యాయమూర్తి, మాజీ న్యాయమూర్తి లేదా న్యాయమూర్తి అర్హత గల వ్యక్తి చైర్మన్‌గా నియమించబడతారు. రాష్ట్ర వినియోగదారుల కమీషన్‌లో 20 లక్షల నుండి కోటి రూపాయల విలువ గల కేసులను పరిష్కరిస్తారు.

**జిల్లా స్థాయిలో జిల్లా వినియోగదారుల ఫోరం :-**

ఒక జిల్లా న్యాయమూర్తిగా పని చేస్తున్న వ్యక్తి లేదా జిల్లా న్యాయమూర్తి అర్హత గల వ్యక్తిని చైర్మన్‌గా నియమించ

బడతారు. ప్రతి జిల్లా స్థాయిలో ఫోరం ఉంటుంది. 20లక్షల కంటే తక్కువ గల వినియోగదారుల వివాదాలను జిల్లా ఫోరం పరిష్కరిస్తుంది. ఒకటి కంటే ఎక్కువ ఫోరం పరిధిలో కేసు కల్గియుంటే ఏ జిల్లా ఫోరంలో నైనా ఫిర్యాదు చేయవచ్చు.




జిల్లా ఫోరం తీర్పు వల్ల న్యాయం జరగని పక్షంలో రాష్ట్ర స్థాయి వినియోగదారుల కమీషన్‌లో, రాష్ట్ర స్థాయిలో న్యాయం జరగని పక్షంలో జాతీయ స్థాయి వినియోగదారుల 30 రోజుల లోపు అప్పిలు చేసుకోవచ్చు.

**వినియోగదారుల హక్కులు :-**

వినియోగదారుల పరిరక్షణ చట్టం1986 ప్రకారం ప్రతి వినియోగదారుడికి భారత ప్రభుత్వం 8 హక్కులను ప్రసాదించింది

- ఎంపిక చేసుకునే హక్కు
- ప్రాథమిక అవసరాలకు పొందే హక్కు, ఆరోగ్యకరమైన పరిసరాలను పొందే హక్కు
- విద్యను పొందే హక్కు
- సమాచారం పొందే హక్కు
- భద్రత హక్కు
- విన్నపం చేసుకునే హక్కు
- నష్టపరిహారం పొందే హక్కు



**వినియోగదారుల వివాదాలు-పరిష్కరాలు :-**

ఫిర్యాదుదారుడు చేసిన ఆరోపన బుజువు అయి నప్పుడు ప్రతివాదన ఫోరం వస్తు లోపాలను తొలగించమనవచ్చు లేదా లోపం కల్గిన వస్తువులకు బదులుగా కొత్త వస్తువులను ఇవ్వమని ఆదేశించవచ్చు. వినియోగదారుడికి అయిన ఖర్చులను చెల్లించమని మరియు ఫిర్యాదుదారుడికి కల్గిన నష్టపరిహారంను చెల్లించమని ఫోరం మరియు కమీషన్లు ఆదేశాలు జారి చేయవచ్చు.




**వినియోగదారులు-జాగ్రత్తలు :-**

మనం కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై ప్రభుత్వం కొన్ని ప్రమాణాలను రూపొందించింది.

1. వినియోగ వస్తువులపై ముద్రించబడిన ఐ.ఎస్.ఐ, 9001:2001 సర్టిఫైడ్ మరియు కొన్ని సర్టిఫైడ్ ముద్రలను మనం గమనించాలి.

2. వ్యవసాయ,వ్యవసాయ అనుబంధ రంగ వస్తువులపై అగ్‌మార్క్, ఎఫ్.పి.ఓ., వెజ్, నాన్‌వెజ్, లాంటి గుర్తును పరిశిలించి కొనుగోలు చేయాలి.

3. కొన్ని గుర్తింపు పొందిన కంపెనీలు జారి చేసే గ్యారంటీ, వారెంటీ కార్డులతో పాటు రసీదును పొంది భద్రపరుచు కొని భవిష్యత్తులో ఏదైనా నష్టం సంబవించి నప్పుడు నష్ట పరిహారం పొందవచ్చు.

4. వస్తువలపై ఉండు గరిష్ట చెల్లింపు ధర(*MRP*), పరిమాణం (*Net Weight*) తయారు చేసిన తేది(*Expiry Date*)ను గమనించాలి.

5. ఆరోగ్య సంబందిత, ఫార్మసీ మందులు మొదలగు వాటిపై సూచించిన ప్రమాణాలను చదివి వాటిని పాటించాలి.

6. బంగారం కొనుగోలు చేసేటప్పుడు *BIS* హాల్‌మార్క్ ముద్రలను గమనించి కొనుగోలు చేయాలి.

7. తూకం రాళ్ళపై ప్రభుత్వం అధికార ముద్రలను గమనించాలి. ఎలక్ట్రానిక్ తూకంపై వస్తువులను కొనుగోలు చేసే విధంగా జాగ్రత్త వివరించాలి.

8. *RBI, IRDA* లాంటి సంస్థల పేరుతో కొన్ని మోసపూరిత కంపెనీలు ప్రకటించిన లాటరీలను, ఆఫర్లను చూసి మోసపోవద్దు.

9. ఆన్‌లైన్ సంస్థలలో కొనుగోలు చేసేటప్పుడు ఆన్‌లైన్ బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించేటప్పుడు మన స్వంత అకౌంట్ నెంబర్, పిన్ నెంబర్ విషయంలో గోప్యత పాటించాలి.

వినియోగదారుల హక్కులను, ప్రయోజనాలను కాపాడడానికి ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ ఆయా చట్టాలపై అవగాహన లోపం వల్ల నేటికి వినియోగదారులు నకిలి వస్తువులతో మోసపోతూనే ఉన్నారు. ఈ పరిస్థితిలో నుండి వినియోగదారులు బయటపడాలంటే కచ్చితంగా అందరిలో వినియోగదారుల హక్కుల పట్ల చైతన్యం తీసుకురావాలి.

**"మేలుకో వినియోగదారుడా....... మేలుకో"**

**డిసెంబర్ 24- జాతీయ వినియోగదారుల దినోత్సవం**

**దొడ్డి కుమార్**

జూకల్ గ్రామం, శంషాబాద్ (మం॥), రంగారెడ్డి జిల్లా



## పురుగుమందులు పిచికారి చేసే సమయంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు - సమస్యాత్మక భూములు మరియు వాటి యాజమాన్యం

పంటలకు పురుగులు మరియు తెగుళ్ళు ఆశించినప్పుడు వాటి నివారణకు పురుగుమందులు పిచికారి చేసే సమయంలో రైతులు సరైన జాగ్రత్తలు పాటించకపోతే పురుగుమందుల ప్రభావము వలన మానవాళికి, మరియు జంతు జాలమునకు ప్రాణాపాయం సంభవించును. అధికశాతం పురుగు మందులు గాలి ద్వారా లేదా చర్మము ద్వారా శరీరములోనికి ప్రవేశించి దీర్ఘకాళిక రోగాలకు దారి తీస్తాయి. పురుగుమందులు త్రాగేనీటిని, ఆహారపదార్థాలను కలుషితము చేయకుండా వీటిని వినియోగించిన తరువాత కాలీ డబ్బాలను భూమిలో పాతి పెట్టాలి.

**మందులు పిచికారి చేసే సమయంలో ప్రదానముగా పాటించవలిసిన జాగ్రత్తలు**

- పురుగుమందులు కొనే ముందు అవి అసలయిన ప్యాకింగ్ లో ఉన్నాయో లేదో జాగ్రత్తగా పరిశీలించి కొనుగోలు చేయాలి
- పురుగుమందులు వినియోగించే ముందు డబ్బా మీద వ్రాసి ఉన్న అన్ని వివరాలను పూర్తిగా చదివి వాడ వలెను, ఫలానా పంటకు వాడవచ్చో లేదో లేక వాడటం వలన ఎదురయ్యే ప్రతికూల పరిస్తితులను మరియు ఒకవేళ ఎవరైనా పురుగుమందు కలిగిన గాలిని ఎక్కువ పీల్చడం వలన స్పృహతప్పిన లేదా పురుగు మందు తాగి ఉంటే వారికి ప్రదమ చికిత్స ఎలా చేయాలో అందులో వివరించబడి ఉంటుంది
- ముఖ్యంగా పురుగుమందులు పిల్లలకు కనిపించకుండా తాళం వేసి ఒక గదిలో బద్రపరచాలి లేదా దూరంగా అటకలమీద పిల్లలలకు అందకుండా బద్రపరచాలి
- ఆహారపదార్ధాలతో పాటుగా పురుగుమందులను నిలువ చేయరాదు ఒకవేళ అలా చేసినట్లయితే పురుగుమందుల నుండి వెలువడే వాసనను ఆహారపదార్ధాలు పీల్చుకుంటాయి, అటువంటి ఆహారం తీసుకోవడంవలన మనుషులకు ప్రాణాపాయం కలుగవచ్చు
- పురుగు మందులు పిచికారి చేసే సమయంలో రక్షణ కలిపించే వస్త్రాలను తప్పని సరిగా ధరించవలెను
- మందులు పిచికారి చేసే ప్రదేశంలోకి పిల్లలు వెళ్ళకుండా జాగ్రత్త తీసుకోవాలి, ఎట్టి పరిస్తితులలోను పిల్లలచేత పిచికారి చేయించరాదు
- అనారోగ్యంతోగాని గాయాలతో గాని బాదపడుతున్న వ్యక్తులు పురుగు మందులను పంటపోలలో పిచికారి చేయరాదు
- మిట్టమద్యాహ్నం తీవ్రమయిన ఎండలలో పురుగు



మందులు పిచికారి చేసినప్పుడు, వడదెబ్బ తగలడానికి ఎక్కువ ఆస్కారం ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

- ✦ పురుగు మందులు చల్లుతున్న ప్రదేశంలో తినే ఆహారపదార్ధాలు ఉంచరాదు
- ✦ పురుగు మందులను చేతితో కలప రాదు, తప్పనిసరి పరిస్తితులలో చేతులతో కలిపినయెడల చేతులను శుభ్రంగా వాసన రాకుండా ఉండే విదంగా కడుక్కోవలెను
- ✦ సిఫారుసు చేసిన పరిమాణాన్ని సరిగా కొలిచి నీటితో కలిపేటప్పుడు కర్రతో బాగా కలియబెట్టాలి, మందు చిందకుండా ఉండటానికి గరాటును వినియోగించాలి
- ✦ మందును గాలి వీచేవైపుగా వేయాలి, గాలికి ఎదురూగా వేస్తే మందు సరిగా పడదు మరియు మందు మొహం మీద పడుతుంది
- ✦ చిల్లుపడిన, పాడైన స్ప్రేయర్లను ఎట్టిపరిస్థితులలో వాడకండి
- ✦ ఒక వేళ నోజల్ బ్లాక్ అయినట్లయితే నోటితో శుభ్ర పరచడానికి ప్రయత్నించకండి, దగ్గరలోని రిపేర్ షాప్‌కి తీసుకువెళ్ళండి
- ✦ మందులను పిచికారి చేసేటప్పుడు ఎటువంటి ఆహార పదర్ధాలను తినడంగాని, త్రాగడంగాని చేయ కూడదు, అలాగే ధ్రోగ తాగడం మంచి పద్ధతి కూడా కాదు



INSPECTION REPORT

Date

1215044
CROWN CHAMPION INTERNATIONAL GROUP LIMITE
Calcium Ammonium Nitrate
250 metric tons
April 2, 2014
Hongfa Chuyun Warehouse, Tianjin, China
Check packing and Marking, Cargo visual condition, Ran
Sampling, Analysis

ted by laboratory as below:

| Test Item | Unit | Test Resul |
|---|---|---|
| Total N | % | 17.36 |
| Nitrate Nitrogen | % | 15.82 |
| mmonium Nitrogen | % | 1.54 |
| Water insoluble | % | 0.002 |
| Ca | % | 19.30 |

- ✦ పురుగుమందులు పిచికారిచేసిన తరువాత చేతులు శుభ్రముగా కడుక్కొని ఆహారాన్ని సేవించాలి
- ✦ ప్రమాదవశాస్తూ పురుగుమందు శరీరంపైన పడితే మలినమైన దుస్తులను, శరీరాన్ని నీటితో శుభ్రంగా కడుక్కోవాలి
- ✦ ప్రమాదవశాస్తూ పురుగుమందు విషప్రభావం కలిగితే ప్రదమ చికిత్స చేసి అత్యంత త్వరగా దగ్గరలోని డాక్టర్‌ని సంప్రదించండి
- ✦ పురుగుమందు వలన అనారోగ్యం పాలు అయితే డాక్టర్ కు ఆ పురుగుమందు డబ్బా చూపించి, వెంటనే సరైన చికిత్స చేయించండి
- ✦ ప్రయాణికులతో వెళ్ళే వాహనాలలో, ఆహార పదార్ధాలతో పాటుగా పురుగుమందులను తీసుకువెల్లరాదు
- ✦ పురుగుమందు వాడేసిన తరువాత మిగిలే కాళీ డబ్బాలను గృహ అవసరాలకు వినియోగించకూడదు
- ✦ వర్షంపడే ముందు లేదా వాతావరణం అనుకూలంగా లేనప్పుడు మందులను పిచికారిచేయకూడదు
- ✦ పరిసరాలు కలుషితం కాకుండా తగినంత జాగ్రత్త తీసుకోవాలి
- ✦ కాలి డబ్బాలను విరగగొట్టి భూమిలో పాతిపెట్టాలి
- ✦ ఒకవేళ మందు చల్లి ఉంటే ఆ పోలంలో మందు చల్లినట్లుగా హెచ్చరిక బోర్డు పెట్టండి

**సమస్యాత్మక భూములు మరియు వాటి యాజమాన్యం :-**

పంటలలో అధిక దిగుబడులు సాదించడానికి నాణ్యమైన భూములు చాలా అవసరం ఒకవేళ భూమిలో బౌతిక లేదా రసాయన సమస్యలు ఉన్నట్లయితే అటువంటి భూములలో

నాణ్యమయిన పంటలు లేదా సుస్థిర పంటలను సాదించలేము. ప్రస్తుతం మన దేశంలో 85 మిలియన్ హెక్టారులు బౌతికంగా మరియు 50 మిలియన్ హెక్టారుల భూమి రసాయన సమస్యలను ఎదుర్కుంటున్నాయి. మన దేశం ప్రపంచ జనాభా లో రెండవ స్థానంలో ఉంది, ఇది ఇలానే ఉంటే మన దేశ జనాభా బారీగా పెరిగి మొదటి స్థానానికి కూడా రావచ్చు అని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ విధంగా పెరుగుతున్న జనాభాకు సరిపడా భోజనం అందించడం ఒక పెద్ద సవాలుగా మిగిలింది. అందుకే శాస్త్రవేత్తలు ముందు చూపుతో వ్యవసాయానికి పనికి రాణి చవుడు భూములను వ్యవసాయ వినియోగంలోకి తెస్తున్నారు. సమస్యాత్మక భూములలో మేలైన వంగడాలు, మరియు యాజమాన్య పద్దతుల ద్వారా మనం పంటలను పండించుకోవచ్చు. ఇందులో భూముల యాజ మాన్యం అనేది ప్రముకమైనది తగిన యాజమాన్య పద్దతుల ద్వారా అదిక దిగుబడిని పొందవచ్చు

**ఆమ్ల నేలలు మరియు యాజమాన్యం**

నేలల యొక్క ఉదాజనిని కొలవడానికి ఉదజని సూచీని వినియోగిస్తారు, ఉదజని సూచీ విలువలను బట్టి నేలలను పలు రకాలుగా విబజిస్తారు. ఒక వేల ఉదజని సూచీ 7 అంతకు తక్కువ విలువను సూచించినట్లయితే ఈ నేలలను ఆమ్ల నేలను అని పిలవడం జరుగుతుంది. ఈ నెలలు అధిక వర్షపాతం ఉన్న ప్రాంతాలలో ఏర్పడతాయి, మన తెలంగాణా రాష్ట్రంలో మెదక్ జిల్లాలోని జహీరాబాద్ మరియు ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రాతాలలో విసరించి ఉంది.

**ఆమ్ల నేలల సవరణ**

- ఈ రకమయిన నేలను సవరించడానికి సున్నం, బేసిక్ స్లాగ్, ప్రెస్ మడ్ వంటి పదార్దాలను వాడవచ్చు. భూమి పరీక్ష అనంతరం ఉదజని సూచీ విలువను బట్టి వీటి మోతాదును నిర్ణయించుకోవచ్చు. సాదరణంగా ఒక ఎకరాకు 2-3 క్వింటల్ల సున్నం వాడుకోవచ్చు.
- సిఫారుసు చేసిన సున్నం పరిణామం మొత్తాన్ని ఒకే దఫాలో వేయకుండా 2-3 దఫాలలో చల్లుకోవాలి
- సున్నాన్ని పచ్చి రొట్ట లేదా పశువుల ఎరువుతో కలిపి వాడడం వలన మంచి ఫలితాలు వస్తాయి
- ఆమ్ల గుణాన్ని తట్టుకునే పంటలను పెంచుకోవడం ద్వారా కూడా మనం అదిక దిగుబడులను పొందవచ్చు ఉదాహరణకు వరి, రాగి, జొన్న వంటి పంటలు పండించుకోవడం ఉత్తమం

**తెల్ల చౌడు నెలలు మరియు యాజమాన్యం**

ఇటువంటి నెలలో నీటిలో కరిగే లవణాల శాతం ఎక్కువగా ఉంటుంది, మనం పొలంలో గమనించినట్లయితే తెల్లటి పొరలుగా మట్టి పెల్లలు మీద పూసినట్లుగా ఎండాకాలంలో దుక్కి దున్నిన తరువాత కనిపిస్తుంది. నెలలో లవణాల శాతం ఎక్కువగా ఉండటం చేత మొక్కల పెరుగుదల సన్నగిల్లుతుంది. ఏఏ నేలను సవరించడానికి ఈ క్రింది పద్దతులను అవలంబించడం మంచిది

- నేల ఉపరితలంపైన లవణాలు అదికంగా ఉన్నట్లయితే మట్టిని ఒక పొర తోలిగించుకోవాలి (పైన ఉండే 5 సెంటీమీటర్ల పొర)
- పొలాన్ని బాగా దున్ని చిన్న చిన్న మడులుగా ఏర్పరిచి అందులో నాణ్యమైన అంతే వర్షపు నీరు లేదా లవణాలు లేనటువంటి నీరు 4-5 రోజులు నిలువ ఉండేలా చూసుకోవాలి
- పశువుల ఎరువు, పచ్చి రొట్ట అలాగే అమ్ల స్వబావం గల రసాయన ఎరువులు ఉదాహరనకు యూరియ, అమ్మోనియం సల్ఫేట్ సూపర్ సల్ఫేట్‌లను తగుమోతాదులో సరియిన సమయంలో వాడటం వలన మంచి ఫలితాలను పొందవచ్చు
- ఉప్పును తట్టుకునే పంటలను పెంచుకోవడం వలన తగినత ఆదాయాన్ని పొందవచ్చు ఉదాహరణకు వరి, చెరకు, జొన్న, సజ్జ, మొక్క జొన్న లేదా వివిధ పంటలను పెంచుకోవచ్చు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వంగాదాలకోసం మీ దగ్గరలోని వ్యవసాయ అధికారిని కాని, వ్యవసాయ శాస్త్రవేత్తలను సంప్రదించగలరు
- విత్తనాలను విత్తే ముందు 0.1 శాతం ఉప్పు ద్రావణంలో విత్తనాలు నాటితే ఉప్పుని తట్టుకునే శక్తి పెరుగుతుంది

**కారు చౌడు నెలలు మరియు సవరణ:**

ఈ నేలల్లో ఉప్పు శాతం 15 కన్నా అదికంగా ఉండి, ఉపరితలం నల్లగా లేదా భూడిద రంగులో కనిపిస్తుంది. ఈ నేలలకు నీటిని ఇంకించుకునే సామర్ధ్యం చాల తక్కువగా ఉంటుంది అందువలన కొద్దిపాటి వర్షం పడినా కూడా పొలంలో నీళ్ళు నిలువ ఉంటాయి అందువలన పంటలు సరిగా

పండవు. ఎండిన నెలలు బాగా బిగుతుగా గట్టిగా తయారవు తాయి, తద్వారా వేరుల పెరుగుదలను నిలిపివేస్తాయి. సాదారణంగా ఇటువంటి నేలలు వ్యవసాయానికి పనికిరావు కాని కొన్ని పద్ధతులను అవలంబించడం వలన ఇటువంటి భూములను కూడా సేద్యానికి వాడుకోవచ్చు

- భూమికి మట్టి పరీక్ష చేయించాలి తద్వారా అందులో ఉన్న సోడియం ఆదారంగా జింక్ పరిణామాన్ని నిర్ధారించి నెలలో వేయాలి ఆ తరువాత పొలంలో దుక్కి దున్ని అందులో కనీసం 7 రోజుల పాటు నీటిని నిలువ ఉంచాలి
- ఇందుకోసం 1.2 నుండి 1.6 టన్నుల జిప్సంని ఒక ఎకరాకు వాడుకోవచ్చు
- భూమి పరీక్ష ద్వారా నిర్ధారించిన జింక్ మొత్తాన్ని ఒకే దఫాలో కాకుండా 2-3 దఫాలలో పశువుల ఎరువులతో కలిపి చల్లుకోవాలి
- ఒక వేల నేలలో సున్నం అదికంగా ఉన్నట్లు భూమి పరీక్షలో తేలిసినట్లయితే ఐరన్ పైరేట్ లేదా అమ్లములను విడుదలచేసే రసాయనాలను తగు మోతాదులో వాడుకోవడం మంచిది (వాడకం భూమి పరీక్ష చేయించిన తరువాత మీకు దగ్గరలోని వ్యవసాయ అధికారిని కాని శాస్త్రవేత్తను కాని సంప్రదించి వాడటం మంచిది)
- ఈ భూములలో జిప్సంం బదులుగా ప్రెస్ మడ్ ని ఒక ఎకరాకు 1.2-1.6 టన్నుల చొప్పున వాడుకోవాలి
- ఈ నేలలు ఎండిన తరువాత బాగా గట్టిగా మారతాయి, కావున లోతుగా దుక్కి దున్నడం, అదిక మొత్తంలో ఇసుక కలపడం వల్ల నేలలోకి గాలి చొరబడటం సులువుగా మారుతుంది తద్వారా మొక్కల పెరుగుదలకు దోహద పడుతుంది

**అడుగు మట్టిలో గట్టి పొర ఉండే నేలలు మరియు వాటి సవరణలు**

- అడుగు మట్టిలో గట్టి పోర ఉండటం వలన నీరు ఇంకిపోదు, ఎల్లప్పుడు నీరు నిలువ ఉంటుంది అంతే కాకుండా మొక్కల యొక్క వేల్లు భూమి లోపలి పొరల్లోకి వెళ్ళలేవు తద్వారా మొక్కల యొక్క పెరుగుదలను నిరోదిస్తుంది
- ఇలాంటి పొరలు కలిగిన భూములను నిజామాబాద్ జిల్లలో ముఖ్యంగా చూడవచ్చు
- ఇలాంటి నెలల్లో లోతుగా నాగలి వేయడం వలన పంటలకు కలిగే నష్టాలను నివారించవచ్చు

**తక్కువ నీరు నిలువచేసుకునే శక్తి గల భూములు మరియు సవరణలు**

ఈ రకం నేలల్లో ఇసుక శాతం అధికంగాను బంక శాతం తక్కువగాను కలిగి ఉంటాయి అందువలన వీటికి నీటిని నిలువచేసుకునే శక్తి తక్కువగా ఉంటుంది

- ఈ రకం భూములలో నీటిని నిలువ చేసుకునే శక్తిని పెంచడానికి వేసవి కాలంలో చెరువులలో పూడిక తీసే సమయంలో చెరువు మట్టిని దాదాపు ప్రతి ఎకరాకు 40 టన్నుల చొప్పున వేసుకొని కలియ దున్నాలి
- పశువుల ఎరువు, పచ్చి రొట్ట, మరియు పంటల అవశేషాలను ఎక్కువగా వాడటం వలన నీటిని నిలువ చేసుకునే శక్తిని పెంపొందించవచ్చు
- ఇటువంటి భూములకు, జొన్న, రాగి, సజ్జ, లాంటి పంటలు అనుకూలం

**గలస అదికంగా ఉండే నేలలు మరియు సవరణలు**

ఈ నెలల్లో నీటిని ఇంకిన్చుకునే శక్తి తక్కువగా ఉంటుంది, నేలపైన నీరు అదికంగా ఉండటం మరియు మట్టి గట్టిగా ఉండటం వలన పంటల పెరుగుదలకు ఆటంకంగా మారుతుంది

- 1 మీ. వెడల్పు గల బెడ్స్ లేదా బోదెలను ఏర్పరుచుకొని వాటిలో పంటలను పండించుకోవాలి, ప్రతి రెండు బెడ్స్ మద్య నీరు బాగా పారే విదంగా చూసుకోవాలి
- సేంద్రీయ ఎరువులను వాడటం వలన కూడా మంచి ఫలితాలను పొందవచ్చు

**చల్కా నేలలు మరియు సవరణ**

ఇటువంటి నేలలు క్షార స్వబావం కలిగి, నీటిని తక్కువ నీటిని నిలువ చేఉకునే సామర్ధ్యం ఉంటుంది. ఈ భూములు గట్టిగ ఉంటాయి. ఇటువంటి నేలలను సవరించడానికి సేంద్రీయ ఎరువులు, పచ్చి ఆకు రొట్ట ఎరువులు వాడటం ఉత్తమం

**యలవర్తి నాగరాజు**, పి.హెచ్.డి స్కాలర్, వ్యవసాయ సూక్ష్మజీవుల విభాగం, యూనివర్సిటి అఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్, రాయచూరు, కర్ణాటక



# నిర్మాణాత్మక డిజిటల్ విద్య

చాక్‌పీసులు పట్టుకుని బోధించే రోజుల నుంచి మౌస్‌తో ప్రొజెక్టర్‌పై పాఠాలను చెప్పే తీరును 'నిర్మాణ్' స్వచ్ఛంద సంస్థ ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తోంది.

ఇందుకు తొలివిడతగా తెలంగాణాలో 30 పాఠశాలలను ఎంపిక చేసింది. డిజిటల్ విద్యకు సంబంధించి అన్ని పరికరాలను సమకూర్చింది. డిజిటల్ బోర్డులపై చిత్రాల ద్వారా ప్రదర్శిస్తూ సవివరంగా భోదన చేయనున్నారు. ఆయా సబ్జెక్ట్‌లోని అంశాలను విద్యా శాఖ అధికారులు తయారుచేసిన హార్డ్‌డిస్క్‌ల సహాయంతో ఉన్నత ప్రమాణాలు పెంచేందుకు దోహద పడనున్నారు. ఈ నేపధ్యంలో రంగారెడ్డి జిల్లా లోని కొత్తగూడ, మణికొండ జెడ్.పీ హైస్కూల్స్ లో నిర్మాణ్ సంస్థ ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాసురూమ్‌లలో, కంప్యూటర్ లాబ్స్‌లో విద్యావికాసం ఇది.

**బేసిక్స్ పై అవగాహన పెరిగింది**

ఈ రెండు ప్రభుత్వ బడుల్లో 50 కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. వారానికి నాలుగు రోజులు పాటు అన్ని తరగతుల విద్యార్ధులకు కంప్యూటర్ పరిజ్ఞానం పై అవగాహన కల్గిస్తున్నారు. కంప్యూటర్ క్లాసులనగానే ఎంతో ఉత్సాహంగా విద్యార్థులు కంప్యూటర్ల ముందుకు చేరుతున్నారు. "మా ఈ హైస్కూల్‌లో 928 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆగస్టు 8, 2018న డిజిటల్‌క్లాసు రూం ప్రారంభమైంది. రోజురోజుకు విప్లవాత్మకమైన మార్పులు వస్తున్న క్రమంలో చిన్న వయస్సులోనే కంప్యూటర్ పరిజ్ఞానం పెంచడం వల్ల వారిలో సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుంది. డిజిటల్ క్లాసు రూంతో పాటు ఇద్దరు విద్యావాలంటీర్లను, ఒక వాచ్‌మెన్, మరొక పారిశుద్ధ్యకార్యికురాలికి కూడా ఉపాధి కల్పించారు, నిర్మాణ్ సంస్థ. దీని వల్ల ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగి ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరేందుకు పిల్లలు క్యూకడుతున్నారు." అన్నారు,






కొత్తగూడ జిల్లాపరిషత్ హైస్కూల్ హెడ్‌మాస్టర్ జె గోవింద్.

**విద్యార్థుల్లో ఆసక్తి**

'గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాలలలో, ముఖ్యంగా ఉన్నత, మాధ్యమిక పాఠశాలలలో, కంప్యూటర్ల వినియోగాన్ని ప్రోత్సహించే వాతావరణాన్ని కల్పించడానికి, కంప్యూటర్ పరికరాలు, ఇంటర్నెట్ కనెక్షన్ సదుపాయాలు, అందుబాటులో వుండేలా చూసి విద్యార్థులకు కంప్యూటర్ పైకనీస అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థులు ఎంతో అసక్తి కనబరుస్తున్నారు.' అంటారు కంప్యూటర్ ల్యాబ్‌లో పిల్లలకు పాఠాలు నేర్పుతున్న శాలిని,శశికళ.

**ప్రభుత్వ బడికి సాంకేతికత అండ**

"మా స్కూల్‌లో 910 మంది విద్యార్థులు చదువుతున్నారు. సంవత్సరం క్రితం నిర్మాణ్ సంస్థ మాకు డిజటల్ క్లాసు రూం ఏర్పాటు చేసి విద్యార్థులకు ఎంతో మేలు చేశారు. కంప్యూటర్ విద్యా విధానం వల్ల తెలివైన విద్యార్థితో పాటు సాధారణ విద్యార్థికి కూడా సులువుగా బోధించే అంశాలు అర్థం అవ్వడంతో పాటు తరగతిలోని విద్యార్థులందరూ సమాన ప్రతిభ కనబర్చడంతో ఆరోగ్యకర పోటీ వాతావరణం ఏర్పడనుంది. ఇటువంటి సమయాల్లో విద్యార్థులకు కూడా ఒత్తిడి లేని బోధన సాధ్యమవుతుంది. బోధించే అంశాలను స్క్రీన్‌పై చూపించడం ద్వారా విద్యార్థి ఎక్కువ ఉత్సాహంగా చదివే ఆస్కారం ఉంది." అన్నారు. మణికొండ,జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, హెడ్‌మాస్టర్ వి. నిరంజన్.

"విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామాల నుంచి పట్టణాల్లోని స్కూల్స్‌కు మార్పించేందుకు ఆలోచన చేస్తున్న సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో డిజిటల్ విద్యను ప్రవేశ పెట్టి రోల్‌మోడల్‌గా నిలవాలనే ఆలోచనతో డిజిటల్ క్లాసురూమ్‌లను ఏర్పాటు చేస్తున్నాం.

సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తరగతి గదులను మార్పు చేస్తూ ప్రొజెక్టర్‌లు, కంప్యూటర్‌లు, టీవీలతో భోదించడంతో విద్యార్థులు కొంగొత్త అనుభూతి పొందనున్నారు. ప్రస్తుతం వేగంగా సాఫ్ట్‌వేర్‌లో చోటుచేసుకుంటున్న మార్పులను విద్యార్థులకు అందిపుచ్చే క్రమంలో భాగమే డిజిటల్ బోధన. ఈ మహత్తర కార్యక్రమానికి సాఫ్ట్‌వేర్ కంపెనీలు చేయూతనివ్వడంతో 'నిర్మాణ్ టీం' అమలు చేస్తోంది." అన్నారు నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఫౌండర్ మయూర్ పట్నాల.

ప్రైవేట్ పాఠశాలలు డిజిటల్ విద్య వైపు ఆలోచించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యను అమలుపరిచి ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిలబడే విధంగా 'నిర్మాణ్' తోడ్పడుతోందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**పూర్ణిమ. కె.**





# పుడమి తల్లి పుత్రోత్సహం – రైతు భాందవుని జన్మదినం

అన్ని వృత్తులకు ఆధారమైనది అధ్యాపక వృత్తి అయినట్లు గానే జీవనాధారం అయిన అంశం వ్యవసాయం అందుకే వ్యవసాయక జీవి అయిన రైతును మనం దేశానికి వెన్నుముక అని సంతోష పెట్టి సంబరపడిపోతున్నాము. నిజమే ఏ దేశానికైన వ్యవసాయం ప్రాణపథమైంది. అసలు వ్యవసాయ రంగం లేకుండా ఏ సమాజాన్ని ఊహించలేము. ఎంతటి అభివృద్ధి చెందిన దేశమైన వెన్నుధన్నుగా నిలిచేది ఒక్క వ్యవసాయ రంగమే!

వ్యవసాయరంగం మన భారతదేశం లాంటి అత్యున్నత రంగానికి తల్లి వేరు లాంటిది. అని చెప్పుకోవడానికి ప్రతి భారతీయుడు గర్వించాలి. ప్రపంచ దేశాలలో వ్యవసాయ రంగంలో తలమానికంగా నిలిచిన మన దేశ ఖ్యాతి ఇప్పుడు పూర్వ వైభవంగా మిగిలిపోవడం విచారకరం.



భుజాన నాగలి తలకు తలపాగ పంచె బానెలు ధరించిన చిహ్నం భారతీయ రైతు చిహ్నంగా వన్నేకెక్కడమే కాక ఏ వృత్తి చిహ్నంకు లేని ప్రత్యేకత "రైతు చిహ్నం"కు దక్కి సాక్షాత్తు సార్వత్రిక ఎన్నికలకు ఒక పార్టీకి ఎన్నికల గుర్తుగా నిలిచింది.

ఇవి అన్ని మన భారతీయ రైతు తన గత కాలపు వైభవం తనకు ప్రస్తుతం దేశయావత్ వ్యవసాయరంగం పట్ల జరిగిన కృషిని గురించి తెలుసుకోవడం సమంజసం.

మన దేశ వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రజానికానికి విశేషమైన సేవలు చేసి రైతు ప్రజా బంధువుగా గుర్తించబడ్డ "చౌదరి చరణ్ సింగ్" రైతాంగ హృదయాల్లో చిరకాలం నిలిచిపోయే గొప్ప నాయకుడు.

పశ్చిమ ఉత్తరప్రదేశలో మీరట్ జిల్లా భరోల్ అనే చిన్న గ్రామంలో సాధారణ మధ్య తరగతి కుటుంబంలో 1902 డిసెంబర్ 23న చరణ్ సింగ్ జన్మించారు. ఉన్నత చదువులు చదివి న్యాయ విద్యను అభ్యసించి న్యాయవృత్తి మీరట్‌లో ప్రారంభించి నిరంతర కృషితో అంచెలంచెలుగా ఎదుగుతూ నిత్యం గ్రామీణులతో మమేకం అవుతూ వారి సేవే ప్రథమ లక్ష్యంగా చేసుకున్నారు. 1931లో జిల్లా బోర్డు సభ్యునిగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానంలో 1937 వరకు ఛౌప్రాలీ శాసన సభ్యునిగా సుధీర్ఘకాలం పనిచేశారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి రెండు సార్లు ముఖ్యమంత్రిగా పని చేశారు. అంతకు ముందు సుచేత కృపాలాని వంటి ముఖ్య మంత్రుల మత్రివర్గంలో వ్యవసాయం, రెవిన్యూ, స్థానిక స్వపరిపాలన, రవానా, అటవీశాఖ వంటి మంత్రి పదవులు సమర్ధవంతంగా నిర్వహించారు. కేంద్రంలో జనతాపార్టీ అధికారంలో ఉండగా ఆర్థిక మంత్రిగా, ఉపప్రధాన మంత్రిగా మెరబ్జి దుశయ్ ప్రభుత్వం అనంతరం ఆరు నెలలు పాటు భారత ప్రధానికగా సేవలందించిన ఈ రైతు బంధువు 1987 మే 29న పరమదించారు.

ఈయన వ్యవసాయ రంగానికి చేసిన అనిర్వచనీయమైన సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం ఆయన పుట్టిన రోజున "డిసెంబర్ 23న" రైతు దినోత్సవంగా జరుపుతుంది. ఈ విధంగా ఆ మహా నాయకుడు ఆశించిన వ్యవసాయ రంగాభివృద్ధే మనం ఆయనకు అందించే నిజమైన నివాళి.

స్వతహాగా రైతు కుటుంబం నుంచి వచ్చిన చౌదరి చరణ్ సింగ్ వ్యవసాయ రంగంలో రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కూలీలకు సంబంధించిన అభివృద్ధి కోసం అనేక భారీ ప్రణాళికలు రూపకల్పన చేశారు. స్వాతంత్ర్యనంతరం మన దేశం శాస్త్రీయంగా అభివృద్ధి చెందడానికి అనుసరించవలసిన వ్యూహంలో ఆయన పాత్ర అమోఘం. వ్యవసాయ అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని భారీ పరిశ్రమలకు మూడవ స్థానం ఇవ్వాలని చరణ్ సింగ్ అభిప్రాయం.

ఉత్తర్‌ప్రదేశ్ రైతాంగ అభివృద్ధికి ఆయన చేపట్టిన చర్యలే అనంతర కాలంలో అన్ని రాష్ట్రాలకు విస్తరించాయి. సుమారు

54% మన దేశప్రజానీకం వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. కాని యువత ముఖ్యంగా విద్యావంతులైన యువకులు వ్యవసాయ రంగం పట్ల ఆసక్తి చూపించక పోగా అదో అనాగరిక వృత్తిగా భావిస్తూ చులకన భావంతో వున్నారు. వ్యవసాయం చేయడం సామాజిక ఉన్నతికి హోదాకు పనికిరావనే అభిప్రాయం బాగా పాతుకుపోయింది.

అదే చైనా, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యవసాయరంగంలో పూర్తిస్థాయి యాంత్రికీకరణ జరిగి పారిశ్రామిక రంగానికి సమాంతరంగా నిలవడం వలన ఆయా దేశాల్లోని యువత వ్యవసాయ రంగం పట్ల చిన్న చూపు చూడకపోగా అదో పారిశ్రామిక ఉద్యోగంలా భావిస్తూ హుందాతనాన్ని పెంచుకుంటున్నారు.

మన దేశం విషయానికి వస్తే వ్యవసాయ ఆధునీకరణలో వెనకబడే ఉన్నాము. విద్యారంగం చూస్తే వ్యవసాయ విద్యను అందించే కళాశాలలు గానీ విద్యార్థుల సంఖ్య గానీ మిగతా సాంకేతిక విద్యలైన ఇంజనీరింగ్ కళాశాలల సంఖ్యలో వెనుకబడి ఉన్నాయి. విద్యార్థి యొక్క భావి లక్ష్యాన్ని ప్రశ్నించిన డాక్టర్, ఇంజనీర్, కలెక్టర్, టీచర్, రాజకీయ నాయకులు అవుతాననే చెబుతారు గానీ గొప్ప వ్యవసాయ శాస్త్రవేత్త మంచి రైతు అవుతానని చెప్పడానికి మనస్సులు రావడం లేదు. కారణాలు ఏవైనా ప్రస్తుతం వ్యవసాయరంగాన్ని బలమైన శక్తిగా తీర్చి దిద్దాల్సిన భాధ్యత అటు ప్రభుత్వాలు పాలకుల మీద తల్లి దండ్రుల మీద అధికంగా ఉంది.

భూమిని నమ్మినవాడు ఏనాటికి నష్టపోడు అన్నది నిజం కాని అది నేటి స్వార్థపూరిత వాతావరణంలో అబాసుపాలై చివరకు అసువులు బాసే స్థాయికి దిగజారి పోయింది.

రైతు జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలన్నా ఆశయంతో మన కేంద్ర ప్రభుత్వం ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త "స్వామి నాథన్" నేతృత్వంలో "జాతీయ రైతు కమీషన్"ను ఏర్పాటు చేసింది. వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దడం కోసం ఈ కమీషన్ అనేక సూచనలతో నివేదిక సమర్పించింది. దీనిలో గ్రామీణ ప్రాంత వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో రైతులకు సహకరించేందుకుగాను ఆయా రంగాల్లో కాస్త పరిజ్ఞానం గల విద్యావంతులైన యువకుల్ని "ఆదర్శ రైతులు" గా ఎంపిక చేయాలని సూచించింది. దీన్ని మొదటగా నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి అమలు పర్చారు. అనంతర కాలంలో దానికి రాజకీయరంగులు పులమబడి అదృశ్యం అయ్యింది.

వ్యవసాయ విశ్వ విద్యాలయాల్లో ఆవిష్కరించబడ్డ ఫలితాలు అతి త్వరగా గ్రామాలకు చేరడానికి రైతుల్లో అవగాహన శక్తి పెంచడానికి, రైతు వృత్తి పట్ల గౌరవం ఉన్నత భావం పెంచడానికి ప్రభుత్వ పరమైన వ్యవసాయ అధికారుల సేవలు ప్రస్తుతం అత్యవసరం.

రైతు పంట నష్టాలకు, పంటల రుణాల మాఫీలకు సహకరించే ప్రభుత్వాలు ముందుగా రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర న్యాయబద్ధంగా నిర్ణయించి పంటలను కొనుగోలు చేయడంతో పాటు వ్యవసాయ రంగంలో పాతుకుపోయిన దళారి వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సి న అవసరం ఎంతైనా ఉంది.

వ్యవసాయ రంగం పట్ల యువత ఆసక్తి చూపే విధంగా ఆ రంగం కృషి చేయాలి. ప్రచార, ప్రసార సాధనాలు కూడా ప్రజలను చైతన్యం చేయడంలో కృషి చేయాల్సి ఉంది. భూస్వాములైన యువత తమ పంట పొలాలను ఉపాధి కేంద్రాలుగా మలుచుకోవాలి తప్ప ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు అంటూ ఊళ్ళు పట్టుకు తిరగడం అనాలోచిత చర్యగా భావించాలి.

ఏ వృత్తి చేస్తున్న వారైనా ఆ వృత్తి పట్ల మొదట అభిమానం, ప్రేమతో చేపట్టాలి. ఆ వృత్తి ద్వారా వచ్చే సామాజిక గౌరవం ఆపైన ఆదాయం, అటు తరువాత సుఖం, గురించే చూస్తారు. కనుక "వ్యవసాయ వృత్తి"కి కూడా ఆ మూడు అన్వయించి అందించినప్పుడు భావితరం యువత తప్పకుండా వ్యవసాయ ఉద్యోగాలై ఆ రంగానికే తలమానికంగా నిలుస్తాయి.

ఆ దిశగా మన దేశ, రాష్ట్రాల పాలకులు ఆలోచనలు ఆచరణలు సాగాలని అప్పుడే మన "కిసాన్ దివాస్" కు అర్థం చేకూరుతుంది. ఆ ప్రజా రైతు బంధువుకి నిజమైన నివాళి అందుతుంది.

**డా॥ అమ్మిన శ్రీనివాస్ రాజు**
జూనియర్ లెక్చరర్, వాజేడు
జయశంకర్ భూపాలపల్లి జిల్లా



# ఆనందంగా జీవించాలంటే....

భగవంతుడు భక్తునికి ప్రత్యక్షమై ఏం వరం కావాలో కోరుకోమన్నాడు. నేను ఎల్లవేళలా ఆనందంగా ఉండేలా వరం ఇమ్మని కోరాడట భక్తుడు. శభాష్! మనుషులందరిలోకి నీవే తెలివైనవాడివని మెచ్చుకొని భక్తునికి వరం ప్రసాదించాడట దేవుడు. ఇది గ్రీకు కథ.

నిజమే మనిషి ఆనందంగా జీవించడం కంటే కావాల్సిందేమున్నది . కాని ఇప్పుడు అదే కరువవుతోంది. పరుగులు పెట్టె ఈ జీవిత గమనంలో కొన్ని మార్పులు చేసుకుంటే ఆనందం మన వెన్నంటే వుంటుంది.

ఆనందంగా జీవించాలంటే మొదట మనల్ని మనం నియంత్రించుకోవాలి. మనకు మనం కొన్ని కట్టుబాట్లు విధించుకొని ఆ ప్రకారం నడుచుకోవాలి.

ఆనందంగా ఉండాలంటే అనవసర ఉద్రేకాలకు లోనుకాకుడదు. ఉద్రేకానికి లోనయ్యే విషయాల పట్ల అవగాహన కలిగి వుండి మానసికంగా ధృడత్వాన్ని పొందడం వలన మనిషి ఆనందంగా ఉండడానికి దోహదపడుతుంది.

ఆనందంగా ఉండాలంటే మీరు పాటించాల్సింది ముఖ్యంగా టైం మేనేజ్ మెంట్. నిద్ర లేవడం దగ్గరనుండి పడుకునే వరకు ఒక పద్ధతి ప్రకారం చేసుకుంటూ పోతే అనవసర శ్రమను తప్పించిన వారవుతారు. చేసే పనులలో ఇబ్బందులు ఎదురవకుండా ఉంటాయి. ఒక టైం ప్రకారం చేసుకుంటూ పోతే మనం సాధించలేనిది అంటూ ఉండదు. అనుకున్నది సాధించినప్పుడు ఆనందానికి అవదులు ఉండవు.

ఒక పనిని అప్పటికి చేస్తాను, రేపు చేస్తాను అని వాయిదా వేయకండి. లీదా అదే సమయానికి వేరే పని వుంటే ఈ పని చేయలేక, ఆ పని చేయలేక సతమతమవుతూ ఆనందానికి దూరం అవుతారు. ఎప్పుడు చేయాలనుకున్న పనిని అప్పుడే పూర్తి చేస్తే మీకు ఏ వీధమైన ఇబ్బంది ఉండదు. పలితంగా మీ ఆనందానికి హద్దు ఉండదు.

రోజు చేసే పనే, రోజు చేసే ఉద్యోగమే, ఇలా యాంత్రిక జీవనం గడపడంలో ఆనందం ఉండదు. అప్పుడప్పుడు స్నేహితుల ఇంటికి, బందువుల ఇంటికి వేలుతుండాలి. ఎప్పుడు కుటుంబంతో ఆహ్లాదంగా గడపడానికి సమయమెక్కడిది అంటారా... నిజమే కాని వీలు చూసుకొని రోజుకు ఒక గంటాయిన కుతుహ్మంతో సరదాగా గడపాలి. కబుర్లు చెప్పుకోవడం, జోక్స్ వేసుకోవడం, కలిసి భోజనం చేయడం, అలాగే సెలవుల్లో కుటుంబంతో కలిసి పిక్నిక్ లకు, టూర్లకు, పార్కులకు, సినిమాలకు వెళ్తుంటే కలిగే ఆనందం అనుభవించాలే కాని చెప్పునలవి కానివి.

ఎప్పుడు నవ్విస్తూ, నవ్వుతూ ఉండాలి. చిరుదరహాసాన్ని



పెదవులపై నుంచి చేదరనియకండి. ఆ నవ్వే జీవితంలో మీకు నాలుగు విదాలుగా ఉపకరిస్తుంది. ఆనందాన్ని కలిగిస్తుంది.

మీ కంటే ఉన్నత స్థానంలో ఉన్నవారిని చూసి ఈర్ష్య,అసూయలను పెంపొందించుకోకండి. దాని వలన ఆనందం మీకు దూరం అవుతుంది. అలా కాకుండా వాళ్ళలాగే నేను కూడా కష్టపడి వాళ్ళకంటే పైకెదగాలి అని గట్టి నిర్ణయం తీసుకోండి.

ఆందోళన ఉంటే ఏ మనిషి ఆనందంగా జీవించలేడు. కొంతమంది చిన్న మానసిక సమస్య వచ్చినా కూడా తట్టుకోలేక వివరీతంగా స్పందిస్తారు. ఎందుకంటే వారి ఊహలకు,వాస్తవానికి ఎక్కువ తేడా లేకపోతే మన ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఎప్పుడూ సమస్యల గురించే ఆలోచించకుండా ఏ సమస్యకు ఎంతవరకు స్పందించాలో అంతవరకే స్పందిస్తూ..అలాగే అనవసరమైన విషయాలు పట్టించుకోకుండా, అవసరమైన విషయాలు మాత్రమే పట్టించుకోవడం వలన మీ ఆందోళనని తగ్గించుకొని జీవితాన్ని ఆనందమయంగా గడపవచ్చు.

మీరు మీలో పాజిటివ్ ధృక్పతాన్నే అలవారుచుకోండి. నెగటివ్ ఆలోచనలకు స్వస్తి చెప్పండి.దేనినైనా సాధించగలననే ఆత్మవిశ్వాసాన్ని పెంపొంధించుకోండి. ఆ ఆత్మవిశ్వాసమే మీలో ఆనందాన్ని పెంపొందిస్తుంది.

గతంలోని చేదు అనుభవాలు తరచు గుర్తు చేసుకొని మరీ వర్తమానాన్ని, భవిష్యత్తును బాధమయం చేసుకోకూడదు. గతంలోని మంచి అనుభవాలను మాత్రమే గుర్తు తెచ్చుకోవాలి. అప్పుడే ఆనందంగా ఉండగలుగుతారు.

ఎప్పుడైతే మనం సమస్యల్ని, ఆవరోధాలను , అడ్డంకులను అతి సాధారణమని భావించి తేలిగ్గా తీసుకుంటూ, జీవితాన్ని గడిపేయాలని, క్షణక్షణం సరదాలతో జీవితాన్ని సంతోషమయం చేసుకోవాలని, నరనరంలో కోరికలను నింపుకున్న వ్యక్తులు జీవితంలో ఆనందంగా ఉంటారు. మీకు ఇష్టమైన హాబీని గుర్తించి ఆ హాబీపై ఆసక్తిని పెంపొంధించుకోండి. అసలు ఏ పని చేస్తే ఆనందంగా ఉంటుందో ఆలోచించండి. సాధ్యమైనంత వరకు ఎక్కువ మందితో స్నేహం చేసుకోండి. ఎక్కువ మంది స్నేహితులను కలిగి వున్నా వ్యక్తి మిక్కిలి ఆనందంగా ఉంటాడు. ఎవరో ఏదో అన్నారని ప్రతి చిన్న విషయానికి గొడవ పెట్టుకోకండి. దానివలన ఎందరో శత్రువులు అవుతారు. దానితో వారు మీకు ఏ హాని చేస్తారోనన్న భయం ఏర్పడుతుంది. ఎప్పుడైతే మనకు భయం ఏర్పడుతుందో అప్పుడు ఆనందం దూరం అవుతుంది. కాబట్టి శత్రువులను తగ్గించుకోండి.

కోరికలు,ఆనందం ఎప్పుడు వీలోమానుపాతాల్లో ఉంటాయి. ఒకటి ఎంతగా పెరిగితే అదే స్థాయిలో అంతగా మరొకటి తగ్గిపోతుంది. కనుక ఆశల అలలకు ఓ ఆనకట్ట వేయండి. జీవితం ఆనందంగా సాగిపోతుంది. కోరికలు పెరిగాయా! ఆనందం గ్యారంటీగా తగ్గిపోతుంది.

భాదలు పంచుకుంటే తగ్గుతాయి. ఆనందం పంచుకుంటే పెరుగుతుంది. ఈ సూత్రం గుర్తుంచుకొని కష్టాలు కలిగినప్పుడు మన భావాల్ని పంచుకునే వ్యక్తి ఆనందం లభించినా దాన్ని కూడా పంచిపెట్టడం మరచిపోకూడదు.

పనిలోనే ఆనందం

పని లేకపోతే అసలు మానవ నాగరికతనే లేదు. చివరకు ఆటవిక దశలో సైతం మనిషి ఆహారాన్ని సంపాదించుకోవడం అనే పని చేశాడు. ఆహారం కోసం జంతువులను వేటాడాడు. అది కూడా పనే.

ఏ పని లేకుండా ఉండడం కన్నా మించిన శిక్ష మనిషికి మరోటి ఉండదు. మనిషి జీవితంలో పని అనివార్యం అయినపుడు చేసే పనిలో ఆనందం పొందితే జీవితం సంతోషమయంగా మారుతుంది.

'చేసే పనిలో నువ్వు ఆనందించగలిగితే జీవితంలో ఏ రోజు పని మరొక రోజు చేసే అవసరం రాదు' అని ఒక చైనా సామెత. అయితే పనిలో ఆనందించడమంటే పనిచేస్తూ పక్కవాళ్ళతో పనిగట్టుకొని జోకులు పేల్చడం, అందరికీ నవ్వొచ్చేలా తయారై ఆఫీసుకు వెళ్ళడం కాదు. దానికి ఒక సరైన ఆలోచనా విధానం, పద్ధతి కావాలి.

ఏ పని చేస్తున్న ఆ పనిలోని ప్రతి చర్యలో ఆనందం పొందాలి. ఇక్కడ జెన్ గురువుల గురించి ప్రచారంలో ఉన్న ఓ కథను చదవండి.

ఒక హొటల్ లో ఇద్దరు వ్యక్తులు టీ తాగుతున్నారు. ఎన్నాళ్ళ నుంచో జెన్ గురువుల గురించి ఎదురుచూస్తున్న ఆ హొటల్

యజమాని టీ తాగుతున్న ఆ ఇద్దరి వద్దకు వచ్చి నా జీవితం ధన్యమైంది. మీరు జెన్ గురువులు కదా! అ సంపూర్ణ ఆనందంతో, సంతోషంతో చేయాలనేది జెన్ గురువుల సిద్ధాంతం. మీరు టీ తాగుతూ టీ తాగాడంలోని సంపూర్ణ ఆనందాన్ని అనుభవిస్తున్నారు. కప్పు నోటి వద్ద పెట్టుకోవడం మొదలుకొని, టీని తాగడం వరకు ప్రతి చర్యను సంపూర్ణ ఆనందంతో చేస్తున్నారు. దాన్ని చూసి మీరు జెన్ గురువులని గ్రహించానని చెబుతాడు.

ప్రపంచంలో ప్రస్తుతం కనిపిస్తున్నా సౌకర్యాలు, అద్భుతాలు అన్ని ఎవరో ఒకరు పనిలో ఆనందాన్ని అనుభవిస్తూ వాటిని ఆవిష్కరించడం వల్లనే ఇప్పుడు మనం వాటి నుంచి ప్రయోజనాలను పొందుతున్నాం.

జీవితంలో చెయ్యాలనుకున్న వాటికి ఇప్పుడు చేస్తున్న దానికి సంభంధం లేదు..అంటూ భాధపదేవాళ్ళు, చేస్తున్న పనిలో ఆనందాన్ని దూరం చేసుకుంటారు. అలా కాకుండా ప్రస్తుతం పనిచేస్తున్న చోటే అభిరుచికి తగినవి కూడా చేయవచ్చేమో ఆలోచించాలి. పదిమందికి మంచికి ఉపయోగపడే లక్ష్యమే అయితే అలాంటి ఆలోచనా భీజాలను చుట్టూ ఉన్న నలుగిరిలో వేసి ఆ ద ృక్పథాన్ని పెంపొందించే ప్రయత్నం చేయవచ్చు. పని చేస్తున్న ప్రదేశ్ని, కనీసం మీ చుట్టూ ఉన్న పరిసరాలను మీ అభిరుచులకు, మనస్తత్వానికి తగినట్టుగా తీర్చిదిద్దుకుంటే అది కూడా పనిలో ఉన్నంతసేపు అందులోనే ఆనందించే ఆలోచనలను అందిస్తుంది.

ఎవరికివారు తక్కువ అంచనా వేసుకోకుండా ఉండాలి. చాలామంది నిరంతర భారంతో, భయతో, ఇష్టంలేని తనంతో, ఏదో తప్పదు అన్నట్లుగా పనిచేస్తుంటారు. ఇలా ఆలోచిస్తూ చేసే పని ఏదైనా కానీయండి. .. అందులో కచ్చితంగా వాళు ్ళ ఆనందించలేరు. అందుకే చేసే పని విషయంలో 'నేను చేయగలను' అనే ఆత్మవిశ్వాసం ఆనందాన్ని ఇస్తుంది. చేసే పనిని గురించి సమగ్రంగా, ఏ పని చేయగలరో స్పష్టంగా తెలుసుకొంటే.. పనిలో బోలెడంత ఆనందం లభిస్తుంది. ఏ పని చేస్తున్నారన్నది ముఖ్యం కాదు. ఆ పనిని ఎంత సమర్థ వంతంగా చేస్తున్నారన్నది ముఖ్యం. చేసే పనిలో అసంతృప్తి ఉంటే జీవితం అంతా అసంత్రుప్తిమయంగానే వుంటుంది.

వీధులు వుడవడం నీ పని అయితే ఆ వీధులను చూసి భాగవతుడు కూడా సంతోషపడాలి. ఇక్కడ ఎంత పరిశుభ్రముగా వుంది. ఈ వీధుల నుంచి పోవాలనిపిస్తుంది అని అనుకోవాలని ఒక తత్వవేత్త అంటారు.

పని మీదనే ద ృష్టి పెట్టి దాన్ని సమర్థవంతంగా చేసినప్పుడు ఫలితం దానంతట అదే వస్తుంది. చేయదలుచుకున్న ఆ పనిని సంతోషంగా, మనస్పూర్తిగా చేసినప్పుడు ఆలసట ఉ ండదు. పనిలోనే ఆనందం లభిస్తుంది.

పనో చేసే వ్యక్తి చుట్టూ పాజిటివే వేవ్స్ ఏర్పడతాయి. పాజిటివ్గా ఉన్న వారిలో ఆనందం వుంటుంది. చేసే పనిలో ఆనందాన్ని అనుభవించగల్గితే ఆ పనిలో నైపుణ్యం వుంటుంది. పనికి విచిత్రమైన లక్షణం వుంది. ఒంటరిగా దిగులుగా ఉంటే పని చేయండి.. దానివల్ల దిగులు కనిపించకుండా పోతుంది. దిగులుగా వున్నా ఏదో విషంపై కలవరం కలుగుతున్నా వొంటరిగా ఆ పని గురించి ఆలోచించడం కన్నా పనిచేయడం ఉత్తమం. డిప్రెషన్ కు మంచి మందుల్లో పని ముఖ్యమైంది.

వాయిదాలు కుడా చేసే పనిలో ఇబ్బంది పడే శాతాన్ని పెంచుతాయి. అందుకే వాయిదా అనే మాటను వాయిదా వేస్తే ఎప్పుడు ఆహ్లాదంగా పని ప్రారంభించుకోవచ్చు.పాజిటివ్ ద ృక్పథం కుడా ఎంతో మానసిక ప్రశాంతతను, చేసే పనిలో ముందుకు దూసుకుపోయే ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. పనిలో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పంచిపెడుతుంది..

**ఆనందానికి ఐరాస ఆరు కొలమానాలు..**

- ఆరోగ్యకరమైన జీవన ప్రమాణాలు
- తలసరి ఆదాయం
- స్వేచ్ఛ
- దాతృత్వం
- సామాజిక భద్రత
- అవినీతి రహితంగా జీవించడం.

చేతిలో చిల్లిగవ్వ లేకున్నా చిరునవ్వులొలికిస్తూ ఆనందంగా గడిపేస్తుంటారు చాలా మంది. సంపద ఎంత ఉ న్నా ఆనంద లేమితో జీవిస్తుంటారు మరికొంతమంది. ఏమిటీ వ్యత్యాసం??అంటే.. సంపదే సమస్తం కాదు. అది ఉంటే సౌకర్యాలతో సుఖంగా ఉండొచ్చేమో కానీ.. ఆనందంగా ఉ ండలేమంటున్నారు నగర యువత. ఆనందమనేది హ ృదయానికి సంబ్యాధించినది. అది అంతర్గతమైన అనుభూతి. సామాజిక పునాదులు బలంగా ఉంటేనే ప్రజలు ఆనందంగా ఉంటారని ఐరాస చెబుతోంది. అందుకే.. ఐక్యరాజ్యసమితి ఆనందానికి ఆరు కొలమానాల్ని ప్రాతిపదికగా తీసుకుంటోంది.

**కోరుకంటి మహేందర్ రావు**
కరీంనగర్



# మీరు - మీ వ్యక్తిత్వం

మనిషికి అసలు సిసలైన ఆస్తి అతని వ్యక్తిత్వమే. వ్యక్తిత్వం గల మనిషిని సమాజంలో గౌరవిస్తుంది. ఆ వ్యక్తి ఆత్మగౌరవం పొదుతూ ఉంటాడు. నిజానికి మనిషికి డబ్బు ఒక పెద్ద అవసరం. కాని డబ్బు మనిషి జీవితం కాదు. డబ్బు వస్తుదంటే ఆత్మగైరవం వదులుకోరు మంచి వ్యక్తిత్వం గల వ్యక్తులు.

తన ప్రవర్తన వల్ల మనిషి వ్యక్తిత్వాన్ని నిర్మించు కోగలుగుతాడు. వ్యక్తి మాటల్లో, చేతల్లో, సత్యసంధత, నీతినిజాయితీ ఉండాలి. మనిషి తను విన్న అభినంధన మాటల వెల్లువ నుండి వ్యక్తిత్వాన్ని ఊహించుకోకూడదు. తాము ఏమిటో నిజాయితీగా నిర్ణయించుకోవడం కొంత బాధాకరంగా ఉ ఒడవచ్చు. కాని అలా నిర్ణయించుకోగలిగే వారి ఆత్మవిశ్వాసం బాగా అభివృద్ధి చెందుతుంది.

నిజాయితీ అనేది జీవితంలో ఎంతో ముఖ్యమైన అంశం. దీనిని అలవర్చుకొని నిజాయితీగా జీవిస్తూ ఉంటే ఎన్నెన్నో సత్ఫలితాలు వస్తాయి.

ఎవరైతే తమ గురించి తాము అధికంగా ఊహించు కొని తమను తాము మోసం చేసుకుంటూ ఉంటారో వారి జీవితాలు ఓడిదుడుకుల్లో పడుతూ ఉంటాయి.

**పరిపక్వత :-**

మనిషి పరిపక్వతకు రావాలంటే అతనిలో నిజాయితీ ఎంతో ముఖ్యమైన విషయం అవుతుంది. ఎవరైతే తమను తాము మోసగించుకుంటారో వారు పెద్ద మనిషి తరహాలో ఏ మాత్రం ఉండలేరు. పరిపక్వత లోపించిన విధంగా ప్రవర్తించేవారు తమను తాము చూసుకొని కలవర పడుతుంటారు. పరిపక్వత చెందిన వ్యక్తి అభూత కల్పన, యదార్ధతకు తేడా గమనించగల్గుతాడు. మనము ఏమిటో మనకు తెలియవచ్చు కాని మనము మనము ఏమి కాబోతున్నామో మనకు తెలియదు.

**నిజాయితీగా ఉండటం :-**

మనిషికి మానసిక బలం ఉన్నప్పుడే తనను తాను నిజాయితీగా చూసుకోగల్గుతాడు. దీని వల్ల మనిషిలో ఎంతో సంతోషం కలుగుతుంది. సాధారణంగా ఎవ్వరు తమ తప్పులను, బలహీనతలను అంగీకరించేందుకు సముఖంగా ఉండరు. ఇటువంటి వ్యతిరేఖ ధోరణులను అనుకూల ధోరణులుగా మార్పు చెంధించుకునే ప్రయత్నం చేయాలి. ఎవరికి వారే తమ బలహీనతలను, బలాలను ఎంచుకో గలగాలి. తమ లక్షణాలను నిక్కచ్చిగా ఆత్మ విమర్శ చేసుకోగలగాలి.

మామూలుగా మనకు భాద కలిగించే విషయాలు, అంగీకరించని విషయాలను మన స్మృతి పథం నుండి గెంటి వేసి మరచి పోయే ప్రయత్నం చేస్తూ ఉంటాం. దీనినే మానసిక అణిచివేత అంటాము. చాలా మందిలో ఈ అణిచివేత కార్యక్రమం జరుగుతూ ఉంటుంది. దీని వల్ల నష్టం ఉండదు. కాకపోతే ఈ ప్రక్రియలో ఒక ప్రమాదం ఉండే అవకాశం ఉ ఒది. మనిషిలో ఉన్న లోపాలు కూడా ఇటువంటి అణచివేతకు గురికాబడుతూ ఉంటారు. ఈ అణచివేత వల్ల లోపాలు సవరించుకోబడవు. సరికదా మనిషి వ్యక్తిత్వానికి ఇదొక మచ్చగా తయారవుతాయి.



**కీర్తి :-**

మనిషికి పేరు ప్రఖ్యాతలకన్నా వ్యక్తిత్వమే ముఖ్యం వ్యక్తిత్వం లేని వ్యక్తికి పేరు ప్రఖ్యాతలు వస్తే అవి పునాధిలేని భవంతిలా సులువుగా నేలకొరిగి పోతాయి. కీర్తి కోసం చాలా మంది ఆశిస్తారు. ఇతరుల దృష్టిలో మనమేమిటో ? చెప్పేది ఖ్యాతి వ్యక్తిత్వం అంటే మన దృష్టిలో మనం ఏమిటో ? తెలుసుకునేది.

వ్యక్తిత్వం అనేది నిజం. కీర్తి నీడ లాంటిది. ఇది అసలు రూపాన్ని కప్పుతుంది. తమాషా ఏమిటంటే ఎవరికి వారు నిర్మాలించుకో గల్గినది వ్యక్తిత్వం. కీర్తి మాత్రం ఇతరుల చేతిలో ఉంటుంది. ఎంతో కష్టపడితే గాని వ్యక్తిత్వం రూపం పోసుకోదు. దీనికి నమ్మకం పునాధి ఉంటుంది. పైగా అంతర్గత సౌందర్యం.

బ్యాంక్‌లో డబ్బు లాంటిది మన వ్యక్తిత్వం బ్యాంక్ ఇచ్చే లోన్ లాంటిది మన కీర్తి. ఇంకా చెప్పుకోవాలంటే వ్యక్తిత్వం మహావృక్షం వంటిది. కీర్తి కుక్క గొడుగు లాంటిది.

కీర్తి నిజమైనది కాకపోతే ఆ మనిషి చుట్టు ఎవ్వరూ మిగలరు. వ్యక్తిత్వం వున్న వ్యక్తి ఎల్లవేళలా అందరి దృష్టి ఆకర్షిస్తూ ఉంటాడు.

**గౌరవ ప్రదమైన వ్యక్తిత్వం :-**

గౌరవ ప్రదమైన వ్యక్తిత్వం ఏర్పర్చుకునేందుకు కొన్ని నియమాలు దృష్టిలో ఉంచుకోవాలి.

- ఎవరిని ఎప్పుడు మోసం చేయకూడదు
- నమ్మదగిన నిజాయితీ గల వ్యక్తిగా అందరిలో ముద్ర వేసుకోవాలి
- స్నేహాన్ని కొనకూడదు. స్నేహాన్ని అమ్ముకునే వారికి దూరంగా ఉండాలి. స్నేహం బజారులో దొరికే సరుకు కాదు
- మనకు వచ్చేదానికన్నా ఇచ్చేది ఎక్కువగా ఉండాలి అనే నియమంతో జీవితం గడపాలి.
- బాధ్యతలు స్వీకరించాలి గాని నిర్దేశించకూడదు.
- ఉన్నత వ్యక్తిత్వం గల వ్యక్తులతో సహవాసం చేయాలి.
- అన్నమాట నిలబెట్టు కోవాలి. ఇతరులను చులకనగా చేసి మాట్లాడకూడదు.
- ఇతరులకు మేలు చేసేందుకు తమ పరిధిని దాటి కూడా ప్రయత్నించవచ్చు.
- ఏది దొంగలించకూడదు. ఇతరుల అనుమతి లేకుండా వారి వస్తువులను తీసుకోవడం దొంగలించడంతో సమానం.
- సున్నితంగా సంభాషించాలి. ఇతరుల మనసులు గాయపడే విధంగా మాట్లాడకూడదు.
- చక్కగా వినడం అలవర్చుకోవాలి. ఇతరులు మాట్లాడు తుంటే మధ్యలో కలుగజేసుకోవడం లేదా వారు చెప్పదలుచుకున్నది మీరే చెప్పడం వంటి పనులు చేయకూడదు.
- వదంతులు, అనవసరపు మాటలు ప్రచారం చేసేవారు ఉంటారు వారితో మాట్లాడాల్సి వచ్చినప్పుడు అనుకూల ధోరణిలోనే మాట్లాడాలి. ఏ మాత్రం అసూయ, ద్వేషం ఉ ండకూడదు.
- ఎప్పుడు ఏదో సృజనాత్మకమైన పనిలో నిమగ్నమై ఉండాలి. అందరికి ఉపయోగపడే సమాజాన్ని నిర్మించాలి.
- ఇతరుల దురదృష్టం చూసి నవ్వడం లేదా ఆనందపడటం వంటి పనులు చేయకూడదు. ఎటువంటి పరిస్థితి అందుబాటులోకి వచ్చినా ఎప్పుడు ఎవ్వరిని వేళాకోళంగా మాట్లాడకూడదు.
- మర్యాదగా ఇతరులతో గౌరవంగా ఉండాలి. అది మీ బలానికి సంకేతం. బలహీనంగా ఉండేవారు కౄరంగా ఉ ంటారు.
- మీ తల్లిదండ్రులు గర్వపడే విధంగా మీరు ఉండాలి. మీ గురించి ఎంతగానో ఎదిరిచూస్తూ ఉంటారు. మీ తల్లిదండ్రులకు మీరు ఎప్పుడు కృతజ్ఞతతో ఉండాలి. నిజాయితీ గల తల్లిదండ్రులు ఉండటం మన సంస్కృతిలో ఒక భాగం ఇదే రకంగా మీ పిల్లలకు మీరు ఉండాలి.
- ఇతరుల గురించి పూర్తి సమాచారం తెలియకుండా న్యాయ నిర్ణయం చేయకూడదు. ఇతరులు లేనప్పుడు వారి గురించి చెడ్డగా మాట్లాడకూడదు.
- గోప్యంగా యాజమాన్యం చేయడం నేర్చుకోవాలి. ఎవరైనా మీకు రహస్యం చెబితే దానిని రహస్యంగా మీలో ఉంచుకోవాలి. బట్టబయలు చేయకూడదు.

**ఆహ్లాదకరమైన వ్యక్తిత్వం :-**

- నిజాయితీ, నిస్వార్థత, అవగాహన, నమ్మకము, సాహసము,

వినయము, మర్యాద వంటి వాటి కలయిక వ్యక్తిత్వం.

- ఆహ్లాదకరమైన వ్యక్తిత్వం ఒక ప్రత్యేక తరగతికి చెందినది.
- అతౌక స్థైర్యము, హుందాతనం, గర్వంలేని ఆత్మవిశ్వాసం ఇతరులకు లోబడి బ్రతకని వ్యక్తిత్వం.
- ఎప్పుడూ క్షమాపణ కోరని వ్యక్తిత్వం, మర్యాద, మంచి ప్రవర్తన, చిన్న చిన్న త్యాగాలు చేయాల్సి వస్తుందని తెలిసిన వ్యక్తిత్వం
- ఇది డబ్బుతో సంబంధం లేనిది. దుర్మార్గాన్ని ఎదిరించగల గుప్త గర్వం కల్గి ఉంటుంది. అద్భుతాలు చేస్తుంది. మనవాతీత విజయాలు తెచ్చి పెడుతుంది. నమ్రత ఉంటుంది. బాధ్యతలు స్వీకరిస్తుంది.

**విమర్శలు :-**

- ప్రతి ఒక్కరు విమర్శ చేయగలరు, చేస్తూ ఉంటారు. విమర్శ నిర్మాణాత్మకంగా ఉండాలి గాని గాయ పరిచేదిగా ఉండకూడదు.
- ఎక్కువ మంది గాయపడే విధంగా విమర్శిస్తూ ఉంటారు. దానికి కారణం " విమర్శ" పై అవగాహన లేకపోవడమే.
- విమర్శ అవతల వ్యక్తికి సహకరించేదిగా ఉండాలి. నిరుత్సాహ పరిచేదిగా ఉండకూడదు.
- విమర్శలో పరిష్కారాలు సూచించాలి. మనిషిని విమర్శించ కుండా అతని చర్యలను విమర్శించాలి. మనిషిని విమర్శిస్తే అతని ఆత్మగౌరవం దెబ్బ తింటుంది.
- సహాయం చేసే ధోరణి వున్న వారికే విమర్శించే హక్కు ఉంది.
- విమర్శల వల్ల విమర్శకుడు ఆనందం పొందుతున్నట్లు అనిపిస్తే ఇక విమర్శ ఆపివేయాలి.

**ఎలా విమర్శించాలి :-**

- విమర్శ ఇతరులకు ప్రేరణగా ఉండాలి. క్రీడాకారుడిని కోచ్ విమర్శించే విధంగా ఉండాలి. కోచ్ విమర్శల వల్ల క్రీడాకారుడు తన క్రీడా నైపుణ్యాన్ని పెంచుకుంటాడు.
- అకస్మాత్తుగా నిర్ణయాలకు వచ్చి విమర్శ చేయకూడదు. విమర్శ చేసేందుకు తయారయి పోకూడదు.
- కారణాలు చూపి విమర్శ ఒప్పించేటట్లు ఉండాలి గాని మనిషిని బయపెట్టేటట్లు ఉండకూడదు.
- వ్యంగ్యంగా విమర్శించకూడదు. దీని వల్ల మనిషిలో తిరగబడే ధోరణి వస్తుంది.
- వ్యక్తిని ఒంటరిగా పిలిచి విమర్శించవచ్చు. నలుగురిలో బహిరంగంగా విమర్శించకూడదు.
- తప్పు సరిదిద్దుకోకపోతే మనిషి ఎంత నష్టపోతాడో




తెలియజెప్పాలి.
- విమర్శ అనేది ఒక ఔషధంలా ఉండాలి గానీ, ముల్లు వలే గుచ్చుకోకూడదు.
- విమర్శతో పాటు అభినందన కూడా చేతకావాలి.

**అవకాశాలు :-**

- అవకాశాలు మనం సృష్టించుకోవాలి. సాధారణంగా అవి మనకు సమీపంలోనే ఉంటాయి. దానిని గుర్తించడం నేర్చుకోవాలి.
- అవకాశం గుర్తించడం తెలియకపోతే అది మన తలుపుతట్టినప్పుడు శబ్దం చికాకు పరుస్తోందనుకుంటారు.
- అవకాశం ఒకసారి వస్తుంది. అటువంటి అవకాశం మళ్ళీ రాదు. అంతకన్నా పెద్దది లేదా చిన్నది రావచ్చు.
- ఉన్న చోటునే ఉనికిని చాటుకోవాలి.

**వ్యక్తిగత వనరు :-**

- మనిషి నిజాయితీకి, కఠిక పరిశ్రమ చేసే సమర్థత ఉంటుంది.
- ఆసక్తి, నిర్ణయ శక్తి, నమ్మకం, జట్టుతో కలిసి పనిచేసే నైపుణ్యం ఉంటుంది.
- వాక్ చాతుర్యత, కార్యనిర్వాహణ సామర్థ్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు ఉంటాయి.
- సమయస్ఫూర్తి, పాజిటివ్ దృక్పథం, సృజనాత్మకథ, ఆధారపడటం మంచి జ్ఞాపకశక్తి కల్గి ఉంటాడు.
- మేధాశక్తి, ఆత్మవిశ్వాసం, దక్షత, మార్కెటింగ్ చాతుర్యత, విశ్లేషణాశక్తి కల్గి ఉంటాడు.
- ఇవన్నీ వ్యక్తి గల వనరులు ఏ ఒక్కరికి ఇవన్నీ ఉండవు. ఇందులో కొన్ని ఉంటాయి.
- తమకు ఎటువంటి వ్యక్తిగత వనరులు వున్నాయో వాటిని తెలుసుకొని అభివృద్ధి పరుచుకోవాలి.

**సి.వి. సర్వేశ్వర శర్మ**
రీడర్ ఇన్ ఫిజిక్స్ (రిటైర్డ్)



# మానసిక ఆరోగ్యం మెరుగుపరుచుకోవడం ఎలా ?

ప్రస్తుత సమాజంలో మనుష్యులు మానసిక ఆరోగ్యం దెబ్బతి బాధపడుతున్నారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ఆధునిక సాంకేతిక పురోభివృద్ధి జరుగుతున్నది. అనేకనేక అవకాశాలు అందుబాటులోకి వస్తున్నా మనిషి మాత్రం ఆనందంగా ఉండలేక పోతున్నాడు. మానసిక సమస్యలకు గురి అవుతున్నాడు. మానసిక ఆరోగ్యం అనేది శరీర ఆరోగ్యం వంటిది కాదు. మానసిక ఆరోగ్యం ఎలా ఉంటున్నది చూడలేము. దానిని లోపల నుండి అనుభవించాల్సిందే శరీరానికి గాయం అయితే అది తగ్గడం కనబడుతుంది. కాని మానసిక సమస్యలు పైకి కనబడవు. అసలు ఈ మానసిక సమస్యలకు ప్రధాన కారణం యాంత్రికమైన జీవన విధానం. అహం దెబ్బతినడం, ఈర్ష్య, అసుయలు ఎక్కువ కావడం, లక్ష్యాలను సాధించకలేక పోవడం, లైంగిక పరమైన సమస్యలు, నిరాశ నిస్పృహలకు గురి కావడం, మొదలైన పలు అంశాలు మనిషి మానసికంగా కృంగి పోవడానికి మానసిక సమస్యలకు గురి కావడానికి కారణమవుతున్నాయి.

**మానసిక ఆరోగ్యం – కారణాలు**

బాహ్య పరిస్థితుల కారణంగా ఎలాగయితే శారీరకారోగ్యం ప్రభావితమవుతుందో మానసిక ఆరోగ్యం కూడా అదేవిధంగా ప్రభావితమవుతుంది . వాతావరణ కాలుష్యం, ప్రకృతి విపత్తులు, వైరస్లు, బ్యాక్టీ వ్యాయామం లోపించడం, పౌష్టికాహార లోపం, వయసు పెరగటం వంటి అనేక అంశాలు మనిషి శారీర కారోగ్య పరిస్థితులను నియంత్రించినట్టే, సామాజికంగా వ్యక్తి ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, ఒత్తిడి జీవితాశయాలను చేరుకోలేకపోవడం, వైఫల్యాలు వంటి అనేక అనుభవాలు మానసికారోగ్య స్థితిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. మానసిక లోపాలు, బలహీనతలు, సమస్యలు, రుగ్మతలకు ప్రత్యేకించి ఒక కారణాన్ని చెప్పలేం. పలు అంశాల సమష్టి ప్రభావంవల్ల పలు మానసిక సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. అవి ముదిరి ఇలాంటి వాటికి దారితీస్తుంటాయి. శారీరక, జన్యుపర, వంశానుగత అంశాలు కొన్నిసార్లు ప్రధానపాత్ర పోషిస్తాయి. పెరిగిన వాతావరణం, కుటుంబ పరిస్థితులు, చెడు స్నేహాలు కారణాలవుతుంటాయి. వృద్ధుల్లో వయస్సు కారణం అల్జీమర్స్, డిప్రెషన్, నిద్రలేమి, ఆందోళన, డిమెన్షియా వంటి సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. బాల్యం, యుక్తవయస్సులో తలకు బలమైన గాయాలు కావడం, నాడీ వ్యవస్థలో తలెత్తే లోపాలు కూడా రకరకాల సమస్యలకు పునాది వేస్తుంటాయి.

**మానసిక ఆరోగ్యం – లక్షణాలు**

ధర్మామీటరు, ఎక్స్ రే, స్కానింగ్ లతో శారీరక రోగాలను నిర్ధారించినట్టు మానసిక వ్యాధులను గుర్తించలేము. వ్యక్తిత్వ వైఫల్యాలు, అసహజ ప్రవర్తన, విపరీత ధోరణులు, ప్రతికూల ఉద్వేగాలు ఇతర ! పరిశీలించాకే మానసిక రుగ్మతలు వెలుగులోకి వస్తాయి మామూలుగా మానసిక లోపాలున్నవారి ఆలోచనల్లో ప్రతికూలతలు, భావాలలో అపసవ్యతలు, ఏకాగ్రత లోపం, ఉద్వేగాలలో విపరీతాలు నీవైర స్వభావం, క్రూర ప్రవర్తన, హింసాధోరణి, ఇతరులను అవమానించే గుణం, వేధించే తత్వం హత్యలు, ఆత్మహత్య ఊహలు. ఈర్ష్య, ద్వేషం, కోపం, అసహనం, విసుగు, చిరాకు అనవసర భయాలు. ఈ నిరంతరం తలనొప్పి, మైగ్రేన్, ఒళ్లునొప్పులు, నిద్రలేమి, మలబద్ధకం, శ్వాసకోశ సమస్యలు ఆత్మన్యూనత, స్వీయ సానుభూతి, ఆత్మ నిందలతో కుంగిపోవడం నేర ప్రవృత్తి, మాదకద్రవ్యాలు తీసుకోవడం, వ్యభిచారం తదితర దుర్వ్యసనాలపట్ల మొగ్గు బాధ్యతల్ని తప్పించుకుంటూ, బంధాలకు దూరమవడం విపరీతమైన సిగ్గు, అసంకల్పిత చర్యలకు పాల్పడడం. అప్పగించిన పనిని వదిలిపెట్టి తిరగటం, కుటుంబసభ్యులతో కూడా అంటీ ముట్టనట్లుగా ఉండడం భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు సంబంధించిన భ్రమలు, భ్రాంతులతో కాలం గడపడం.



మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రధానంగా మానసిక ప్రశాంతతను పొందాలి. మానసిక ప్రశాంత ద్వారా పలు మానసిక సమస్యలను నివారించవచ్చు. తద్వారా శరీర రుగ్మతలు కూడా నివారించవచ్చు. మానసిక ప్రశాంతత పొందడానికి కొన్ని చిన్న చిన్న సూచనలు పాటిస్తే మానసిక ఆరోగ్యం పొందవచ్చు.

**ధ్యానం చేయడం :**

ఇటీవలి కాలంలో తరచుగా వినిపిస్తున్న పదం ఇది. వైద్యులందరూ కూడా ధ్యానం ప్రాముఖ్యత గురించి చెబుతున్నారు. కేవలం కళ్లు మూసుకు కూర్చున్నంత మాత్రాన అది ధ్యానమనిపించుకోదు. అలా కూర్చున్న సమయం లో మీకు వస్తున్న ఆలోచనలపై ద ృష్టి సారించండి. వాటిని నిలువరిస్తూ ఆలోచనా రహిత స్థితికి చేరడానికి యత్నించండి. అలాగే మనస్సును గమనిస్తుండండి. చంచలమైన మనస్సును కట్టడి చేయడానికి యత్నించండి. ముందుగా మూడు రోజులపాటు ధ్యానం చేయండి. ఆ తరువాత మరొక మూడు రోజులు పొడిగించండి. ఇలా అలవాటు చేసుకుంటూ వెళ్లండి. ఇలా తొమ్మిది రోజులు చేసిన తరువాత నెమ్మదిగా మీ శ్వాసను గమనించండి. ధ్యానం చేస్తున్న సమయంలో మీరు నిద్రలోకి జారుకోవచ్చు. దానిని కూడా గమనించడానికి ప్రయత్నించండి. నిద్ర వస్తుంటే బలవంతంగా ఆపడానికి ప్రయత్నించకండి. ఈ ప్రక్రియ చాలా సహజంగా జరిగేలా చూసుకోండి. మీ వ్యక్తిత్వాన్ని పరిశీలించుకోండి. మీ ఆలోచనా సరళి, కోపతాపాలు మొదలైన వాటిని విశ్లేషించుకోండి. వాటినుంచి బైటపడటానికి కృషి చేయండి.

**కుటుంబంతో గడపడం :**

వారానికి ఒక రోజు పూర్తిగా కుటుంబ సభ్యులతో గడపండి. అందరూ కూర్చుని వివిధాంశాలను చర్చించండి. ఆ వారంలో మీరు ఏం చేశారు? రానున్న వారంలో ఏం చేయాలను కుంటున్నారు? అనే విషయాలు చర్చించండి. అలాగే కుటుంబ సభ్యులలో ఎవరికైనా ఏమైనా సమస్యలున్నాయా? వాటిని పరిష్కరించడం మెలా? అనే విషయాలపై దృష్టి సారించండి.

**ఎప్పుడూ ఆనందంగా ఉండడం**

మీతో పాటు మీ చుట్టూ ఉన్న వ్యక్తులందరూ ఆనందంగా ఉండేలా చూడండి. ఇతరులకు చిన్న చిన్న సహాయాలు చేయండి. అవసరానికి సహాయపడినందుకు వారు మిమ్మల్ని ఎంతగానో అభినందిస్తారు. ఇది మీకు ఎంతో త ృప్తినిస్తుంది. ఈ తృప్తి మానసికోల్లాసాన్ని, మానసికానందాన్ని కలిగిస్తుంది.

**డైరీ వ్రాయడం అలవాటు :**

మీరు రోజూ డైరీ రాయడం అలవాటు చేసుకోండి. దానిలో మీకు ఉన్న సమస్యలను క్రమబద్ధంగా రాయండి. అది సాధారణ స్వల్ప సమస్యనుంచి అతి పెద్ద సమస్య వరకూ రాసుకోండి. దీనివల్ల మీకు సమస్య ఎక్కడ ఉందనే విషయం తెలుస్తుంది. ఏ కారణంగా ఆ సమస్య ఉద్భవించిందో అర్థం చేసుకుని, దానిని పరిష్కరించుకోవడానికి ఏం చేయాలో ఆలోచించుకోండి.

**ఆర్థిక లేదా కుటుంబ సమస్యలు చర్చించడం :**

మీ సమస్యలు ఆర్థికపరమైనవా, కుటుంబ సమస్యలా, లైంగిక జీవనానికి సంబంధించినవా లేక ఇతర అంశాలకు చెందినవా అనే విషయాలను తెలుసుకోండి. మీ జీవిత భాగస్వామితో ఆయా అంశాల గురించి సమగ్రంగా చర్చించండి.

**సమస్యలను అధిగమించడానికి ప్రయత్నించడం :**






సమస్య ఎదురైనప్పుడు ధైర్యంగా నిలబడి దానిని పరిష్కరించుకోవడానికి ప్రయత్నించండి తప్ప దానినుంచి తప్పించుకుని పారిపోవడానికి ప్రయత్నించవద్దు. సమస్య ఎంతటిదైనా, ఎలాంటిదైనా దానికి తప్పకుండా పరిష్కారం ఉంటుంది. మీ సమస్యను మీరు ఒక్కరూ పరిష్కరించుకోలేకపోతే మీ సన్నిహితుల సలహాలు , సూచనలు తీసుకోండి.

**పెడచెవిన పెట్టండి :**

మానసిక ఆరోగ్యానికి అభద్రత అనేది మొదటి కారణం. ఇతరులు ఏమి చెప్పినా తేలికగా గాయ పడటం మంచిది కాదు. అది మీ అభద్రతను సూచిస్తుంది. ఉదాహరణకు చెప్పాలంటే హాస్యానికి నీవు లావు ఎక్కుతున్నావు? అన్నారనుకోండి అది మిమ్మల్ని గాయపరుస్తుంది. అదే మీరు కనుక వారి మాటలు లక్ష్య పెట్టని వారైతే అస్సలు పట్టించుకోని వారైతే ఎవ్వరూ కూడా మీ మనస్సుకు నొప్పి కలిగించలేరు. సాధనలో కష్టం. మరి మానసిక ఆరోగ్యం పొందాలన నుకుంటే ఏది విన్నప్పటికి పట్టించుకోనట్లుండాలి. ఎందరో ఎన్నో వ్యాఖ్యలు చేస్తారు. వాటికి మనం ప్రాధాన్యత ఇస్తే వారికి మనం పవర్ ఇచ్చినట్లవుతుంది. కనుక ఆ పవర్ లేదా ఆధికృత మీరే ఉంచుకోండి. మిమ్మల్ని మీరు ప్రపంచం నుండి కాపాడు కోండి.

**మీలోని లోపాలకు మీరే ఆనందించడం**

మీరు బట్టతల కలిగివుంటే, మీ స్నేహితులు ఎగతాళి చేస్తే, అవును నాది బట్టతలే అంటూ ఆనందంగా నవ్వేసుకోండి. ఇక మిమ్మల్ని వారు ఏమీ చేయలేరు. ఆపై మిమ్మల్ని ఏమీ చేయలేమనే దానిని వారు తర్వాత గ్రహిస్తారు. అది మీ మనసుకు పట్టకుండా మీకు మీరు ఆనందంగా ఉంటారు. అది ఒక వాస్తవం కూడాను.

మరో రకంగా మానసిక దెబ్బను ఎదుర్కొనాలంటే, మీరు అందంగా అలంకరించుకొని బయట తిరగండి. ఇక మీకు వచ్చే డిప్రెషన్ కూడా రాకుండా దూరం అయిపోతుంది. మీరు కనుక బాధ పడుతూ, ఏడుస్తూ, ఏ అలంకరణ లేకుండా కూర్చుంటే మీకు మనో వేదన కలిగి మరింత దిగజారిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. కనుక మొదటి చర్యగా అందంగా అలంకరించుకొని గ్రేట్ గా భావించండి. అది ఒక కొత్త డ్రస్ వేసుకోవటం కావచ్చు లేదా, ఒక నెక్లెస్ కొనుక్కోవటం కావచ్చు. లేదా చివరకు మీ హెయిర్ కటింగ్ చేయించుకోవటం కావచ్చు. గంభీరంగా ముఖం పెట్టి గ్రేట్ ఆచరిస్తే ప్రపంచంలో మీరు మరింత కుంగిపోయినట్లు అనిపించదు.

**పిల్లల్లో మానసిక ఆరోగ్యం :**

పిల్లల్లో మానసిక ఆరోగ్యం ఎంత బాగుంటుంది మరి ముఖ్యంగా ధృడమైన స్నేహాలు ఉన్న పిల్లల్లో మానసిక ఆరోగ్యం ఇంకా బాగుంటుందని సర్వేలు చెబుతున్నాయి. వారికి యాంగ్జియిటీ, డిప్రెషన్ వంటి మానసిక జబ్బులు దరిచేరవు. అంతే కాదు సోషల్ యాక్సెప్టెన్సి, స్వీయ అంగీకారం వంటి సద్గుణాలు కూడా వారిలో ఎక్కువగా ఉండవు. అందుకే పిల్లలు నలుగురితో కలివిడిగా ఉండటం, స్నేహాలు పెంచుకోవడాన్ని తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు అధ్యయనకారులు. యుక్త వయస్సులో వారు పెంపొందించుకున్న సన్నిహిత స్నేహాలు వారిని మానసికంగా దృఢంగా తయారు చేస్తాయట పిల్లలకున్న స్నేహితులను బట్టి దీర్ఘకాలంలో వారి మానసిక, శారీరక ఆరోగ్యాలను సైతం కనిపెట్టవచ్చని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సమాజంలో వ్యక్తిగతంగా కర్తవ్యాలను నెరవేర్చుకుంటూ లక్ష్యాలను చేరి ఆనందంగా జీవించేందుకు ఇతర శరీర అవయవాలతో పాటు మానసిక ఆరోగ్యం సంతృప్తికరంగా ఉండేలా చూసుకోవాలి.

మానసిక ఆరోగ్యం సక్రమంగా లేకపోతే ఆ ప్రభావం ఆవ్యక్తి పరిమితం కాదు. అది సమాజంపై కూడా ప్రభావాన్ని చూపుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరు మానసిక ఆరోగ్యం మెరుగుపరిచే మార్గాలను అనుసరిస్తూ ఆందోళనను తగ్గించుకొని మనిషి ఆనందంగా జీవించాలి. ఏ చిన్న మానసిక సమస్య వచ్చిన కృంగిపోకుండా ఆత్మ విశ్వాసంతో ఎదురుకోగలగాలి. ఎప్పుడు సమస్యల గురించి ఆలోచించకుండా ఏ సమస్యకు ఎంత స్పందించాలో అంతే స్పందిస్తూ అనవసర విషయాలు పట్టించుకోకుండా అవసరమైన విషయాలు మాత్రమే పట్టించుకోవడం వలన మీ ఆందోళనను తగ్గించుకుని జీవితాన్ని ఆనందమయంగా గడపవచ్చు.

**సి. హెచ్. రేణుక**
రీసెర్చ్ స్కాలర్

# ఖిలాఫత్ ఉద్యమం

## (1919 నవంబరు 23న ఢిల్లీలో మొదలైంది)

గతసంచిక తరువాయి ...

స్వాతంత్ర్యోద్యమ చరిత్రను అధ్యయనం చేసే సందర్భంలో ఖిలాఫత్ ఉద్యమాన్ని అర్థం చేసుకోకుంటే, జరిగిన సంఘటనలలో కొన్నిటికి వివరణలిచ్చుకోవటం కష్టమవుతుంది.

**ఖలీఫా :** ఇస్లాం ప్రకారం, మతాధిపతి మరియు రాజ్యాధిపతి పదవులను రెంటినీ (చేపట్టిన) అధిష్టించిన వారిని 'ఖలీఫా' అంటారు. అతని ఆపదవిని బట్టే ఖిలాఫత్ అన్న మాట వచ్చింది. టర్కీ సుల్తాను ఖలీఫాగా ఉన్నప్పుడు బ్రిటను, ఫ్రాన్స్, అమెరికాలు సుల్తానును ఖలీఫా పదవినుండి తొలగించడానికి సిద్ధమయ్యాయి. దానికి నిరసనగా, మన దేశంలో **షౌకత్ ఆలీ, మహమ్మద్ ఆలీ (వీరినే ఆలీ సోదరులంటారు)** ల నేతృత్వంలో ముస్లింలు ఆందోళన చేశారు. హిందూ ముస్లింల ఐక్యత సాధనకు గాను, గాంధీ ఆ ఉద్యమానికి తన మద్దతును ప్రకటించారు. గాంధీ తీసుకున్న ఆ నిర్ణయం అప్పట్లో సఫలమైనట్లే కనిపించింది. సహాయ నిరాకరణోద్యమానికి ముస్లింల మద్దతు తోడైంది. ఒక దశలో జిన్నా కూడా 1922 సెప్టెంబరులో కలకత్తాలో జరిగిన ప్రత్యేక సమావేశంలో సహాయ నిరాకరణకు తన మద్దతును ప్రకటించాడు. అంతకుముందే గాంధీ (1921 జూలైలో కరాచీలో జరిగిన సమావేశాలకు ముందు) ఖిలాఫత్‌కు హిందువులు మద్దతివ్వాలని కోరాడు. ఈ దశవరకు జిన్నా భారత్ జాతీయునిగనే ప్రవర్తించాడు. బ్రిటిష్ వాళ్ళు పరాయివాళ్ళన్న దృష్టినే కనబరిచాడు.

**ప్రజలు విధేయతతోనూ, మనస్ఫూర్తిగాను ఆ ఉద్యమంలో పాల్గొంటే ఒక సంవత్సరంలోగానే స్వరాజ్యం వస్తుందని గాంధీ ప్రకటించాడు. దానితో ప్రేరణ పొంది 40 లక్షల మంది హిందువులు అందులో పాల్గొనడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు.**

**గమనిక:** గాంధీ యొక్క ఈ అంచనా తప్పయిందని, చరిత్ర తెలిసినవారికి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదను కొంటాను. ముస్లింల మతపెద్దలే దానిని వ్యతిరేకించారు. ఖిలాఫత్ ఉద్యమమూ చల్లారిపోయింది. టర్కీ సుల్తాను ఖలీఫా పదవి రద్దయింది. మలబారులోని మోప్లాలు హిందువులపై దౌర్జన్యం చేయటం, అనేకచోట్ల హిందూ ముస్లింల మధ్య ఘర్షణలు తలెత్తడం, చౌరీచౌరాలోను (ఉత్తరప్రదేశ్), బొంబాయి, మద్రాసులలోను హింసాకాండలు చెలరేగడం వగైరాల ప్రభావంతో గాంధీ సహాయ నిరాకరణోద్యమాన్ని అర్థాంతరంగా విరమింపజేశాడు. **మతపిచ్చి తలకెక్కినవాళ్ళు, మతావేశం రేగినవాళ్ళు హిందువులైనా, ముస్లింలైనా, మరొకరైనా ఎవరి మాటా వినరన్నది నిష్ఠుర సత్యం. భారతేతిహాసంలో ఎప్పటిలానే మతభూతం ఇరుపక్షాలలోని బలహీన మనస్కుల్ని, మూర్ఖుల్ని ఆవహించి వికటతాండవం చేసింది. అయినా నేటికీ మనకు బుద్ధిరాలేదు.**

ఖిలాఫత్ ఉద్యమానికి హిందువులు మద్దతు తెలపడాన్ని, ముస్లింలోని ఒక వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ బృందంవారు, మహమ్మదీయులను నిర్వీర్యులను చెయ్యడానికే గాంధీ కుటిల ఎత్తుగడతో హిందువులతో చేతులు కలిపాడని తలంచారు. ఆ విధంగా ప్రచారం చేశారు కూడా. అదిక్కడ ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే, ఆపని, హిందూ ముస్లింలను ఏకం చెయ్యాలనుకున్న గాంధీ ఆలోచనకు బలాన్నివ్వకపోగా పూర్తి వ్యతిరేకంగా, మహమ్మదీయులను నిర్వీర్యులను చెయ్యడానికే గాంధీ అలా చేశాడన్న నింద పడిందాయన పైన. అంతకంటే ప్రమాదకరమైన, **దేశవిభజనే పరిష్కారమన్న** వాదనా ప్రారంభమైంది. ఎంతటి విషాద ఘడియలవి!?!

భారత రాజ్యాంగ రూపకల్పనపై ఎంతో ప్రభావాన్ని కనబరిచిన స్వాతంత్ర్య పూర్వ చరిత్రలోని, ఖిలాఫత్ ఉద్యమానంతరం జరుగుతూ వచ్చిన హిందూ ముస్లింల మత కలహాలను నిశితంగా పరిశీలించాల్సి ఉంటుంది.

సైమన్ కమీషన్ (1972–1930) నిర్వహించిన పాత్ర, భారత రాజ్యాంగ రూపకల్పనపై తగినంత ప్రభావాన్ని కలిగించింది. దేశానికి ఒక రాజ్యాంగాన్ని నిర్మించాలన్న ప్రతిపాదన సైమన్ కమీషన్ నివేదికలో చోటుచేసుకొంది. అలాగే దేశం నుండి బర్మాను వేరుచేయాలన్న సూచనా అందులో ఉంది. ఈ రెండంశాలను మనం జాగ్రత్తగా గుర్తుంచుకోవాలి.

మతపిచ్చి తలకెక్కినవాళ్ళు, మతావేశం రేగిన వాళ్ళు హిందువులైనా, ముస్లింలైనా, మరొకరైనా ఎవరి మాటా వినరన్నది నిష్ఠుర సత్యం. భారతేతిహాసంలో మతభూతం ఇరుపక్షాల బలహీన మనస్కుల్ని ఆవహించి విలయతాండవం చేసింది. అయినా నేటికీ మనకు బుద్ధిరాలేదు.

**రాజ్యాంగ నిర్మాణ సదస్సు – ఆరంభ యత్నాలు**

1. 1945 సెప్టెంబరు 19న, వీలైనంత త్వరలో భారత రాజ్యాంగ నిర్మాణ సదస్సును ఏర్పరుస్తామని బ్రిటీష్ ప్రభుత్వం ప్రకటించింది.
2. 1946 మార్చి 24న, (క్రిప్స్ రాయబారం) కేబినెట్ మిషన్ కొన్ని సిఫార్సులు చేసింది.
3. 1946 సెప్టెంబరు 2న నెహ్రూ ప్రమాణ స్వీకారం చేశాడు. ఆ సందర్భంలోనే **'పాకిస్తాన్ జిందాబాద్'** అన్న అరుపులు వినవచ్చాయి. అనంతరం కాంగ్రెస్ – ముస్లింలీగ్‌ల మధ్య బేధాభిప్రాయాలు పెచ్చరిల్లాయి. బ్రిటీష్ ప్రభుత్వం ముస్లింలను సమర్థించడంతో, వారు రెచ్చిపోయి **1946 ఆగస్టు 16ను ప్రత్యక్ష చర్యదినంగా ప్రకటించి విధ్వంసానికి దిగారు.**
4. **ఈ దశలో మౌంట్‌బాటన్ వైస్రాయిగా వచ్చాడు. ఇక్కడి పరిస్థితులు, దేశ విభజనను అనివార్యం చేస్తున్నాయని అతడు భావించాడు. ఒక దశలో, దేశ విభజన కంటే అంతర్యుద్ధాన్ని భరించటమే సరైందనుకున్న గాంధీ, మనసు మార్చుకొని క్రమంగా విభజనకు సిద్ధమైనాడు. విస్తృత చర్చలనంతరం మౌంట్‌బాటన్ 1947 జూన్ 3న ఒక ప్రకటన చేశాడు.**

మత ప్రాతిపదికన దేశాన్ని విభజించడం (భారత: – పాకిస్తాన్‌లు) ముఖ్యాంశంగా ఆ ప్రకటన ఉంది.

ఇదండీ మిత్రులారా! సంక్షిప్తంగా స్వాతంత్ర్యానికి ముందున్న పరిస్థితుల వివరం.

**రాజ్యాంగ సదస్సు – 1946 నవంబర్**

**(రాజ్యాంగ పరిషత్తు, రాజ్యాంగ నిర్మాణసభ అని అంటారు)**

1. 1946 జూన్‌లో దేశంలో ఎన్నికలు జరిగాయి. మొత్తం 296 మంది ప్రతినిధులు, వారిలో 202 మంది కాంగ్రెస్‌వారు, 73మంది ముస్లింలు, బలూచిస్తాన్ నుండి 4గురు, మిగిలిన వారు ఇతరపార్టీలు, స్వతంత్రులు. వారుగాక 93 మంది స్వదేశీ సంస్థానాల ప్రతినిధులు, వెరసి 389 మందితో ఆ రాజ్యాంగసదస్సు ఏర్పడింది. (ఈ అంకెలు గుర్తుంచుకోండి)
2. కానీ అంతలో, దేశ విభజనపై జూన్ 3న తుది నిర్ణయం జరగడంతో, ఆ సంఖ్యలో మార్పు జరిగింది. కడకు 299 మందితో నూతన రాజ్యాంగ సదస్సు **1947, అక్టోబరు 31న సమావేశమయింది.**

**గమనిక: ఇక్కడ ఒక ముఖ్య విషయాన్ని చెప్పుకోవాలి. రాజ్యాంగ సదస్సు, దేశంలోని దాదాపు అన్ని వర్గాల ప్రాతినిధ్యంతో ఏర్పడింది. ముఖ్యంగా కాంగ్రెస్, అన్ని వర్గాల నుండి సంబంధంలేని సర్వేపల్లి రాధాకృష్ణన్, ఎ.కె.గోపాలస్వామి లాంటి వారికీ చోటుకల్పించింది. అలాగే దళితులకు ప్రాధాన్యతనిచ్చింది. మహిళలకూ ప్రాతినిధ్యం కల్పించింది. రాజ్యాంగ సదస్సులోని 31 మంది హరిజనులలో 29 మంది కాగ్రెస్ ద్వారా ఎంపికైనవారే.**

కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకి అయిన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి, సదస్సులో స్థానం ఇవ్వబడింది. అలాగే మేధావులు, ప్రజ్ఞావంతులునైన కె.సంతానం, కుంజ్రశ్రీ, అల్లాడి కృష్ణస్వామి, బి.శివరావు మొదలగు వారికి సభలో చోటుకల్పించబడింది. **ఈ సందర్భంలో అంబేద్కర్ గురించి నాలుగు మాటలు చెప్పుకోవాలి.**

రాజ్యాంగ నిర్మాణంలో డా॥ అంబేద్కర్ ఉండాల్సిన అవసరాన్ని ఎందరో ప్రముఖులు గుర్తించారు. (కొందరతన్ని వ్యతిరేకించారు కూడా) వారిలో ఎన్నో విషయాలపై ఆయనతో విభేధిస్తున్న వారూ ఉన్నారు. రాజ్యాంగ ముసాయిదా కమిటీకి తనను ఎంపిక చేసిన సందర్భంలో డా॥ అంబేద్కరే, ఇది తానూహించని ఘటన అంటే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. **భావిభారత సమాజాన్ని ఒక కట్టుగా నిలిపి, నడిపించడానికి అవసరమైన కట్టుబాట్లను రూపొందించడంలో డా॥ అంబేద్కర్ అనుభవజ్ఞత, విజ్ఞత పాలుపంచుకోవడం తప్పనిసరి అని గుర్తించి, ఆయనను సభలోనికి తెచ్చుకొనే కృషిచేసిన వాళ్ళను మనమంతా అభినందించాలి. ఆనాడు గనక ఆ పని జరగకుంటే, రాజ్యాంగపు తీరుతెన్నులు ఎలా ఉండేవో, ఇలా**

మాత్రం వుండేవి కావు.

మనకంటూ ఒక స్వంత రాజ్యాంగం ఉండాలన్న ఆలోచన, 19న శతాబ్ది ఆరంభంనుండే, స్వాతంత్ర్యానికై కృషిసల్పుతున్న మేధావులలో మొదలైంది. వివిధ యత్నాల, వత్తిడుల పర్యవసానంగా, ఒకింత అపసవ్య రూపంలోనైనా, 1935 నాటికే అట్టిదొకటి ఏర్పడింది. అనంతరం జరిగిన అనేకానేక పోరాటాల ఫలితంగాను, ప్రపంచ దేశాలతోటి బ్రిటిష్ వాళ్ళ అనుకూల, ప్రతికూల సంబంధాల వల్ల ఏర్పడిన పరిస్థితుల వత్తిడి ఫలితంగానో అంగ్లేయులు కూడా భారత దేశాన్ని విడిచిపెట్టడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చారు. **కుటిల పన్నాగం, అంటే విభజించు పాలించు అన్న కుటిల నీతి కారణంగానో, వారిక్కడకు వచ్చేనాటికున్న వాస్తవ పరిస్థితులు కారణంగానో, హిందే ముస్లింలకు విడి విడిగా స్వాతంత్ర్యాన్ని వ్వాలన్న నిర్ణయానికి వచ్చారు వారు.**

**గమనిక: ఆంగ్లేయులు ఈ దేశానికి వచ్చేటప్పటికి ఈ దేశం అనేక రాజ్యాలుగా హిందువుల, ముస్లింల పాలనలో ఉండేది. కనుక ఆంగ్లేయుల లెక్క ప్రకారం హిందువులు, ముస్లింలు కూడా ఈ దేశస్థులే. అయితే హిందువుల ప్రకారం ఆంగ్లేయుల మాదిరే ముస్లింలు కూడా ఈ దేశానికి బయటనుండి వచ్చి దీనినాక్రమించుకున్న వారే. ఈ చారిత్రక నేపథ్యాన్ని, ఈ రెండు దృష్టికోణాలను, మనమంతా జాగ్రత్తగా గుర్తుంచుకోవాలి. హిందువులు కూడా ఈ దేశానికి బయటనుండి వచ్చినవారే అననాలనుకున్న పక్షమూ ఉండవచ్చు. నా లెక్కన అది అతివాదం, కుతర్కపూరితం.**

సొంత రాజ్యాంగాన్ని నిర్మించుకోవాలన్న ఆలోచన స్వతంత్ర్యం రాకముందే నిర్ణయరూపాన్ని ధరించింది. 1946 నవంబరు నాటికే అఖండ భారత్ పరిధిలోనే, రాజ్యాంగ నిర్మాణ సభ ఏర్పడింది. ఇది మరోసారి గుర్తుచేసుకోండి.

1. అది, 9-12-1946న, డా. సచ్చిదానంద సిన్హా అధ్యక్షతన, ఢిల్లీలో సమావేశమైంది. రెండురోజుల తరువాత డా. రాజేంద్రప్రసాద్‌ను సభకు శాశ్వత అధ్యక్షునిగా ఎన్నుకుంది.
2. అదే సమావేశంలో నెహ్రూ 'రాజ్యాంగ ఆశయాలు - లక్ష్యాల'కు సంబంధించిన తీర్మానం ప్రవేశపెట్టారు. దానిపై అంబేద్కర్ 17-12-1946న సమీక్షాత్మకంగా ప్రసంగించారు. దానినీ మనం శ్రద్ధగా పరిశీలించాల్సి ఉంది. ఇదిగో చూడండి నెహ్రూ ఉపన్యాసాన్నీ ఆ తరువాత అంబేద్కర్ సమీక్షనూ.

**లక్ష్యాలు, ఉద్దేశ్యాలకు - సంబంధించిన తీర్మానం**

**అధ్యక్షుడు :** తన పేరున ఉన్న తీర్మానాన్ని ఇప్పుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సభలో ప్రవేశపెడతారు.

గౌరవనీయులు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ (యునైటెడ్ ప్రావిన్సెస్, జనరల్) : -

అధ్యక్షా !

ఈ రాజ్యంగ నిర్మాణ సభ కొద్దిరోజులుగా సమావేశం కాలేదు. ఈ సభ సాధారణ వ్యవహారాలను చాలా వాటిని నడిపినప్పటికీ ఇంకా చాలా భాగం మిగిలే ఉంది. రాజ్యాంగం అనే మహాసౌధాన్ని నిర్మింపతలపెట్టిన ప్రదేశంలోను, అక్కడికి చేరే మార్గంలోను ఉన్న తుమ్మల్నీ, తుప్పల్నీ నరుక్కుంటూ, దారి చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం. ఈ పని ప్రారంభించడానికి ముందే, మన మెక్కడికి వెళ్తున్నామో, ఏమి నిర్మింపతలపెట్టామో అన్న వాటిపట్ల స్పష్టమైన అవగాహన కలిగిఉండాలి. ఇటువంటి సందర్భాల్లో లోతైన వివరాలలోకి పోవడం అనవసరం అన్నది అందరికీ తెల్సిన విషయమే. నిర్మాణం జరిగే సమయంలో మనం ప్రతి ఇటుకను పూర్తి అవగాహనతోనే వినియోగిస్తాం. సాధారణంగా భవననిర్మాణం తలపెట్టిన వాడు ఒక ప్రణాళికను సిద్దం చేసుకుంటాడు. అవసరమైన సామగ్రినీ సేకరించుకుంటాడు. స్వాతంత్ర్య భారతదేశానికి రకరకాల ప్రణాళికలు చాలా కాలంగా మన మనసుల్లో మెదులుతూనే ఉన్నాయి. అయితే ఇప్పుడు, మనమనుకున్న నిర్మాణాన్ని ప్రారంభించే సందర్భంలో ఆ ప్రణాళిక యొక్క స్పష్టమైన రూపాన్ని మనకు మనం దర్శించటమే కాకుండ, మనదేశప్రజలలూ, ఇంకా చెప్పాలంటే ప్రపంచమానవాళికీ చూపించాలి. ఈ విషయంలో మీరూ నాతో ఏకీభవిస్తారని ఆశిస్తాను. **నేను ప్రవేశపెడుతున్న ఈ తీర్మానం మన లక్ష్యాలను**

ఒక పార్టీయో, ఒక సమూహమో కాకుండా ప్రజాబాహుళ్యం మొత్తం కోరుకున్న రీతిలో మనం ముందుకెళ్తాం. అందుచేత భారతదేశపు సామాన్య ప్రజల హృదయాకాంక్షల్ని నిరంతరం గమనికలో ఉంచుకుని, వాటిని నెరవేర్చడానికి ప్రయత్నించాలి.

**నిర్వచిస్తుంది. మన ప్రణాళికను రేఖా మాత్రంగా చూపిస్తుంది. మన అడుగులు పడే మార్గమేదో సూటిగా చూపిస్తుంది.**

ఈ రాజ్యాంగ నిర్మాణ సభ, మనలో చాలామంది ఉద్దేశించిన రీతిలో లేదన్నది మీకందరికీ తెలుసు. కొన్ని ప్రత్యేకమైన పరిస్థితుల్లో ఈ సభ ఈ విధంగా ఉనికిలోకి రావడంలో బ్రిటిష్ ప్రభుత్వం యొక్క హస్తం కూడా ఉంది. వాళ్ళు కొన్ని నిబంధనలు విధించారు. ఈ సభకు పునిదియనదగ్గ ఈ రాజపత్రాన్ని అనేక తర్జనభర్జనల తర్వాత అంగీకరించాం. దాని పరిమితులకు లోబడి పనిచెయ్యడానికే గట్టిగా ప్రయత్నం చేద్దాం. అయితే ఈ సభ దేన్నుండి బలాన్ని పొందిందో ఆ మూలాధారాన్ని మనం విస్మరించకూడదు. కేవలం రాజపత్రాలవల్లనే ప్రభుత్వాలు ఉనికిలోకి రావు. **నిజానికి ప్రభుత్వాలంటే ప్రజాభీష్ట వ్యక్తీకరణలే.** ప్రజాశక్తి మన వెనకుంది కనుకనే, మనం ఇక్కడ ఈ రోజు సమావేశమయ్యాం. ఒక పార్టీయో, ఒక సమూహమో కాకుండా ప్రజాబాహుళ్యం మొత్తం కోరుకున్న రీతిలో మనం ముందుకెళ్తాం. అందుచేత భారతదేశపు సామాన్యప్రజల హృదయాంకాక్షల్ని నిరంతరం గమనికలో ఉంచుకుని, వాటిని నెరవేర్చడానికి ప్రయత్నించాలి.

చాలామంది సభ్యులు గైర్హాజరయినందుకు విచారిస్తున్నాను. సభలో పాల్గొనే హక్కువుండీ, చాలా మంది ఈ రోజు ఇక్కడ లేరు. ఒక విధంగా ఇది మన బాధ్యతను పెంచింది. ఇతరులకు మనస్తాపం కలిగించేదేదిగానీ, ఏర్పరచుకున్న నియమాలను అతిక్రమించేదేదిగానీ, మనం చెయ్యకుండా జాగ్రత్తపడాలి. సభకు హాజరు కాని వాళ్ళు త్వరలో మనతో కలిసి ఈ సభావ్యవహారాల్లో పాలు పంచుకుంటారని ఆశిద్దాం. ఎందుకంటే రాజ్యాంగం దాని వెనుకవున్న బలం దాన్ని నెడుతున్నంతవరకే ముందుకు పోగలదు. **ఎల్లప్పుడూ దేశ ప్రజలంతా సమైక్యంగా ఉండాలన్నదే ప్రగాఢవాంచగా ఉండాలి.** అప్పుడు మాత్రమే ప్రజలందరికీ ఆమోద యోగ్యమైన రాజ్యాంగాన్ని నిర్మించుకోగలం. అదే సమయంలో విశదమయ్యే విషయమేమంటే – ఏ గొప్ప దేశమైనా ప్రగతి పథం పట్టినప్పుడు దానిని ఏ పార్టీగానీ, ఏ వర్గంగానీ ఆపుచేయలేదనీ తెలుస్తుంది. ఈ సభ గతంలోనూ, భవిష్యత్తులోనూ కొంతమంది సభ్యులు లేకుండా సమావేశమైనప్పటికీ తన విధులను నిర్వర్తించడానికే శాయశక్తులా ప్రయత్నిస్తుంది.

**మీరు ఈ తీర్మానంలోని మాటలను మాత్రమే పరిగణలోకి తీసుకొని, దాన్ని ఆమోదిస్తారు. కాని మాటలకంటే, తీర్మానం వెనక ఉన్న హృదయాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. చట్టాలు మాటల కూర్పులు. కాని ఈ తీర్మానం చట్టాలకంటే విలువైనది. మీరు న్యావాదులలాగ ఈ తీర్మానంలోని మాటలను మాత్రం పరిశీలిస్తే దానిలోని జీవాన్ని పట్టుకోలేరు.**

నేను మీ ముందు ఉంచుతున్న ఈ తీర్మానం ఒక వాగ్దాన స్వభావాన్ని కలిగి ఉంది. ఇది వివాదరహితంగా ఉండాలని పరిపక్వ చర్చలు, ప్రయత్నాలు చేశాకనే దీని ముసాయిదాను తయారు చేశాము. ఏ గొప్ప దేశంలోనైనా ఎన్నో వివాదాస్పదమైన విషయాలు ఉండకతప్పదు. అయినా మేము వీలయినంత వరకు వివాద రహితంగా ఈ తీర్మానాన్ని రూపొందించే యత్నం చేశాం. ఈ తీర్మానం సామాన్యంగా ప్రజలందరూ కలిగి ఉండే మరియు వారు అంగీకరించే మౌలిక విషయాలనే ప్రస్తావిస్తుంది.

ఈ దేశపౌరుడు అతడు ఏ పార్టీకి – వర్గానికి చెందిన వాడైనప్పటికీ, అతనికి అంగీకారం కానిదేదైనా కానీ, అలాగే బ్రిటీష్ ప్రభుత్వం నిర్దేశించిన పరిమితులను అతిక్రమించేదేదైనాగాని ఈ తీర్మానంలో ఉందని నేననుకోవడం లేదు. దురదృష్టవశాత్తూ మనదేశం విభేదాలతో నిండిపోయి ఉంది. అయినప్పటికీ కొద్దిమంది తప్ప ఈ తీర్మానం ప్రతిపాదిస్తున్న మౌలికాంశాలతో ఎవరూ విభేదించరు. ఈ తీర్మానము సార్వభౌమాధికారం గల భారత గణతంత్రవ్యవస్థ కావాలనే మనదృఢ సంకల్పాన్ని తెలుపుతుంది. "రిపబ్లిక్" అన్న మాటను ఇప్పటి వరకు మనం వాడలేదు. అయినా స్వతంత్ర భారతదేశం గణతంత్ర రాజ్యంగానే తప్ప మరో విధంగా ఉండబోదన్న విషయం మీరంతా బాగా అర్థం చేసుకోవాలి.

ఇండియన్ స్టేట్స్ యొక్క ప్రతినిధులు లేని ఈ తరుణంలో, ఈ తీర్మానం ఇండియన్ స్టేట్స్‌ని ఎలా ప్రభావితం చేయబోతున్నదీ స్పష్టం చేయదలిచాను. కొన్ని సామాజిక వర్గాల ప్రతినిధులు సభలో లేనందువలన ఈ సభ ఈ తీర్మానాన్ని ఆమోదించడాన్ని వాయిదా వేయవచ్చునని సూచింపబడింది. ఆ సూచన ఒక 'సవరణ' రూపాన్ని సంతరించుకునే అవకాశం ఉంది. ఇటువంటి సవరణ ఈ సందర్భానికి తగినది కాదని

నా అభిప్రాయం. కానీ మనముందు, దేశం ముందు, విశాల ప్రపంచం ముందు, మనం ప్రవేశపెట్టే మొట్టమొదటి లక్ష్యాన్నే మనం అంగీకరించక పోయినట్లయితే, మన ఈ చర్చలన్నీ అర్థరహితమవుతాయి. నిర్జీవమవుతాయి. మన కార్యకలాపాల పట్ల ప్రజలు ఆసక్తి చూపరు. కనుక స్టేట్స్ పట్ల మన వైఖరి తేటతెల్లంకావాలి. మనం అన్నివర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ఇండియన్ యూనియన్‌లో భాగస్వాములు అవ్వాలని ధృఢంగా కెరుకుంటున్నాం. అయితే ఏ విధంగా పాల్గొంటారు? ఎటువంటి ప్రభుత్వం ద్వారా పాల్గొంటారు? అన్నవి వాళ్ళ అభీష్టానికి చెందిన విషయాలు. ఈ తీర్మానం ఆ వివరాల జోలికి పోదు. ఇందులో మౌలికమైన విషయాలు మాత్రమే ఉన్నాయి. రాజ్యాల అభీష్టానికి వ్యతిరేకంగా వాళ్ళపై దేనినీ బలవంతంగా రుద్దదు. వాళ్ళు మనతో ఎలా కలుస్తారు? ఎలాంటి పరిపాలనా విధానాన్ని కలిగి ఉండబోతున్నారు? అన్నవే అక్కడ పరిగణించాల్సిన విషయాలు. దీనిపై నా వ్యక్తిగత అభిప్రాయాన్ని నేను వ్యక్తపరచదలుచుకోలేదు. అయినప్పటికీ ఏ ఒక్క రాష్ట్రమూ ప్రాథమిక సూత్రాలకు వ్యతిరేకంగా ఉండేరీతిలో పరిపాలన కలిగి ఉండలేదు. మరియు ఏ ఇతర ప్రాంతాల కంటే స్వేచ్ఛ తగ్గేటట్లుగా ఉండదని నేను చెప్పక తప్పదు. ఎటువంటి పాలనా వ్యవస్థను ఆ స్టేట్స్ రూపొందించుకోవాలో లేక ఇప్పుడు ఉన్నట్టుగానే రాజులు, నవాబులే కొనసాగాలో అన్నవాటితో ఈ తీర్మానానికి సంబంధంలేదు. అవి స్టేట్స్‌లోని ప్రజలకు సంబంధించిన విషయాలు. ఆ ప్రజలు రాజులను కొనసాగించుకో దలచుకుంటే కొనసాగించుకోవచ్చు. నిర్ణయం వారిదే. భారతదేశమంతా మన గణతంత్ర వ్యవస్థలో అంతర్భాగం. అందులోని ఒకభాగం తనకు ఒక తరహా పాలనావ్యవస్థ కావాలని కోరుకుంటే, దానికా స్వేచ్ఛ ఉంటుంది.

ఈ తీర్మానానికి ఏమైనా కలపాలనిగాని, తీసివేయాలని గాని నేను కోరుకోవడం లేదు. ఈ సభను, అనర్థమైందేదీ పేపర్లకెక్కే పని చేయవద్దని నేను కోరుతాను, ఈ రాజ్యాంగ నిర్మాణంలో పాలుపంచుకోవాల్సి ఉండీ, హాజరుకాలేకపోయిన సభ్యులు ''ఈ సభ నియమరహితంగా ప్రవర్తించింది (మాట్లాడింది)'' అని చెప్పుకునే అవకాశం మనం కల్పించకూడదు.

ఈ తీర్మానం వివరాల్లోకి వెళ్ళదని స్పష్టం చేయదలచుకున్నాను. ఇందులో పొందుపరచబడిన లక్ష్యాలను సాధించడానికి, మనం భారతదేశాన్ని ఎలా ముందుకు నడిపించగలమో మాత్రమే ఈ తీర్మానం తెలపాలనుకుంటుంది. **మీరు ఈ తీర్మానంలోని మాటలను మాత్రమే పరిగణలోకి తీసుకొని, దాన్ని ఆమోదిస్తారు. కాని మాటలకంటే, తీర్మానం వెనక ఉన్న హృదయాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. చట్టాలు మాటల కూర్పులు. కాని ఈ తీర్మానం చట్టాలకంటే విలువైనది. మీరు న్యాయవాదులలాగ ఈ తీర్మానంలోని మాటలను మాత్రం పరిశీలిస్తే దానిలోని జీవాన్ని పట్టుకోలేరు.** మనం ఈనాడు రెండు యుగాల మధ్య నిలిచి ఉన్నాము. కొత్తదానికి తావిస్తూ పాతది త్వరగా మార్పుచెందుతూ ఉంది. ఈ సంధికాలంలో మనం మన దేశానికేకాక ప్రపంచానికీ ఒక సజీవమైన సందేశాన్ని అందించాల్సి ఉంది. ఆ తర్వాత మనకు ఇష్టమైన మాటలతో మన రాజ్యాంగాన్ని రచించుకోవచ్చు. ఇక ఇప్పుడు మనం ఏమి చెయ్యడానికి గట్టిగా సంకల్పించుకున్నామో దానిని సందేశరూపంగా బయటికి తెలయ పరచాల్సి ఉంటుంది. ఈ తీర్మానం లేక ఈ ప్రకటన అంతిమంగా ఏ ఆకారాన్ని లేక ఏ స్వరూపాన్ని సంతరించుకుంటుందో తర్వాత చూద్దాం. అయినప్పటికీ ఒక్క విషయం స్పష్టం. ఇది చట్టం మాత్రమే కాదు, ఇది మానవ మస్తిష్కాలకు ఊపిరి నింపేదికూడా.

ప్రత్యేక స్వభావం కలిగిన ఈ తీర్మానాన్ని ఈ సభ ఆమోదిస్తుందని నా నమ్మకం. ఈ గొప్ప దేశంలో నివసించే కోట్లాదిమంది సోదర సోదరీమణులమైన మనం పరస్పరం చేసుకున్న ఒప్పందమిది. దీన్ని మనం అంగీకరిస్తే, అది మనం నిర్వర్తించ వలసిన ఒకరకమైన ప్రతిజ్ఞ అవుతుంది. ఆ ఆపేక్షతోనే దీన్ని ఈ రూపంలో మీముందు ఉంచుతున్నాను. ఈ తీర్మానం హిందుస్థానీ ప్రతులు మీ దగ్గర ఉన్నాయి. కనుక దీనిని ఈ సభకు చదివి వినిపించడానికి కాలాన్ని వృధా చెయ్యను. ఇంగ్లీషులో మాత్రం చదువుతాను. తరువాత ఇంగ్లీషులో మాట్లాడతాను.

**జి. జయపాల రెడ్డి**
**సలహాదారుడు, టి.ఎస్.ఐ.ఆర్.డి**

మిగతా వివరాలు తరువాయి సంచికలో....




# స్వేచ్ఛకు మార్గాలు - మానవ హక్కులు

మానవుల మానప్రాణాలకు భరోసా కల్పించి మానవ ప్రగతికి దోహదం చేసి ప్రతి మనిషి మనిషిగా జీవించడానికి భరోసా కల్పించేవే మానవ హక్కులు. ఇవి పుట్టుకతో ప్రతి వ్యక్తికి లభించే హక్కులు. జాతి, కుల, మత, లింగ, ప్రాంతీయ తేడాలతో సంబంధం లేకుండా మానవులందరికీ ఈ హక్కులు వర్తిస్తాయి. వ్యక్తి గౌరవాన్ని (ఔనత్యాన్ని) పెంపొందించడానికి హక్కులు అవసరం. ఇవి మానవ నాగరికతకు నూతన ప్రమాణాలు. ప్రతి మనిషికి తనకు నచ్చినట్లు జీవించే హక్కు ఉంది. తనకు నచ్చిన డ్రెస్ వేసుకోవచ్చు. స్వేచ్ఛగా మాట్లాడొచ్చు. తనకు నచ్చిన జాబ్ చేయవచ్చు. తనకు నచ్చిన ప్రాంతంలో ఉండొచ్చు. తనకు నచ్చిన వారితో మాట్లాడొచ్చు. తనకు దక్కవలసిన ఏహక్కునైనా దక్కించుకునే హక్కు మానవుడికి ఉంది. కానీ ఇవన్నీ ఇప్పుడు సమాజంలో దక్కుతున్నాయా? హక్కుల పరిరక్షణలో అందరూ తమ బాధ్యతల్ని సక్రమంగా నిర్వహిస్తున్నారా? లేదనే చెప్పాలి. కోట్లాదిమంది అశాంతితో, అభద్రతాభావంతో తల్లడిల్లిపోతున్నారు. ఇలా సమాజంలో శాంతి భద్రతలు కరువయ్యాయి. వివక్షత లేని మానవ సమాజ నిర్మాణమే లక్ష్యంగా డిసెంబర్ 10, 1948 నుంచి విశ్వమానవ హక్కుల ప్రకటన ద్వారా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. అప్పటి నుండి అన్ని దేశాలు ఈ దినాన్ని అంతర్జాతీయ మానవ హక్కులు దినంగా డిసెంబర్ 10ను పాటిస్తున్నాయి. వివక్షత లేనటువంటి మానవ సమాజ నిర్మాణమే ఈ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం లక్ష్యంగా మానవ హక్కుల ఉల్లంఘనల ఫిర్యాదులను నిత్వర విచారించడానికి కోర్టులతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో మానవ హక్కుల కమీషన్‌ను ఏర్పాటయ్యాయి.

మానవ హక్కులు వ్యక్తులకు, సమాజానికి, రాజ్యానికి మధ్య సరిహద్దులా ఉంటాయి. తోటి వ్యక్తులు, సమాజం, ముఖ్యంగా ప్రభుత్వ వ్యవస్థల నుంచి (రాజ్యం) సగటు మనిషిని మానవ హక్కులు కాపాడుతాయి. ప్రజాస్వామ్యం ప్రాచుర్యంలోకి రావడంతో మానవులంతా సమానమనే భావనకు ప్రాధాన్యం పెరిగింది. ప్రతి సమాజంలో కొన్ని వర్గాలకు చెందిన వారు చారిత్రక, సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక కారణాల వల్ల వెనుకబడి ఉంటారు. వీరు మిగిలిన వారితో సమానంగా రాజ్యం, సమాజం అందించే సదుపాయాలను (హక్కులను) అనుభవించలేరు. దీనికి తోడు ఆధునిక కాలంలో శక్తివంతమైన వ్యవస్థగా రూపొందించిన ఉద్యోగస్వామ్యం సమాజానికి సేవ చేయడానికి బదులు, ఆ నెపంతో సగటు పౌరుని హక్కులను తన అధికార దుర్వినియోగం ద్వారా కాలరాస్తోంది. ఈ నేపథ్యంలో సాధారణ పౌరుని కనీస హక్కులను కాపాడటానికి స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించే యంత్రాంగం అవసరమైంది. అదే మానవ హక్కుల కమీషన్.

**జాతీయ మానవ హక్కుల కమీషన్:**

దేశంలో జాతీయ మానవ హక్కుల కమీషన్ 1993లో పని చేయడం ప్రారంభించింది. ఇది మానవ హక్కుల రక్షణ చట్టం 1993 నిబంధనలు మేరకు పనిచేస్తుంది. దీన్ని 2006లో సవరించడం జరిగింది. కమీషన్ అధ్యక్షులుగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యవహరిస్తారు. మరియు నలుగురు సభ్యులు ఉంటారు. ఈ కమీషన్ నిష్పాక్షంగా విధులు నిర్వహిస్తుంది.

**కమీషన్ విధులు:**

మానవ హక్కుల ఉల్లంఘన లేక ఉల్లంఘనను నివారించడంలో ప్రభుత్వ ఉద్యోగి విఫలమైనప్పుడు కమీషన్ తనంతటా తానుగా లేదా ఫిర్యాదు ఆధారంగా విచారిస్తుంది. మానవ హక్కుల పరిరక్షణకు రాజ్యాంగంలో పొందుపర్చిన అంశాలను, చట్టపరమైన నిబంధనలను నిరంతరం సమీక్షిస్తూ వాటి సమర్థ అమలుకు తగు సూచనలు ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో జైళ్ళను, ఇతర నిర్బంధ గృహాలను సందర్శించి తనిఖీ చేయడం, అక్కడ ఉన్న వారికి కనీస వసతులు కల్పనపై విచారిస్తుంది. మానవ హక్కుల రక్షణ చట్ట నిబంధనలు ప్రకారం

స్వీకరించిన అభియోగాలను విచారించడానికి కమీషన్‌కు సివిల్ న్యాయస్థాన అధికారాలు ఉంటాయి. అదే విధంగా సాక్షులుగా హాజరవ్వమని ఆదేశించవచ్చు. అవసరమైన అధికార పత్రాలను సేకరించే అధికారం ఉంటుంది. కమీషన్ తాను స్వీకరించిన ఫిర్యాదులను విచారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అవసరమైన సమాచారాన్ని కోరుతుంది. కమీషన్ విచారణ అనంతరం మానవ హక్కుల ఉల్లంఘన ప్రభుత్వ ఉద్యోగి నిర్లక్ష వైఖరి వల్ల సంభవించిందని కమీషన్ అభిప్రాయపడితే సంబంధిత ఉద్యోగిపై చర్య తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. బాధితులకు తగిన నష్టపరిహారం అందించవలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది.

**రాష్ట్ర మానవ హక్కుల కమీషన్ :**

రాష్ట్రాల్లో కూడా మానవ హక్కుల కమీషన్లు ఏర్పడ్డాయి. మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993 నిబంధనల మేరకు పదవి విరమణ చేసిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, కమీషన్ అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. రాజ్యాంగంలో ఏడో షెడ్యూల్‌లో పొందుపర్చిన రాష్ట్ర, ఉమ్మడి జాబితాలోని అంశాలకు సంబంధించి మానవ హక్కుల ఉల్లంఘన ఘటనలన్ని దీన్ని పరిధిలోకి వస్తాయి. రాష్ట్ర కమీషన్ విధివిధానాలు అన్ని జాతీయ కమీషన్ విధివిధానాలను పోలి వుంటాయి.

**మానవ హక్కులు**

1. **జాతి, వర్ణ, లింగ, కుల, మత, రాజకీయ లేదా ఇతర కారణాలతో ఏ విధమైన వివక్షకు గురికాకుండా ఉండే హక్కు.**
2. **చిత్రహింసలు, క్రూరత్వం నుండి రక్షణ పొందే హక్కు.**
3. **వెట్టిచాకిరీ, బానిసత్వం వంటి దురాచాల నుండి రక్షణ పొందే హక్కు.**
4. **సరైన కారణం లేకుండా నిర్భందించబడకుండా ఉండే హక్కు. నేరస్తులుగా అనుమానిస్తున్నా, నిందితులని తేలే వరకు నిరపరాధులే.**
5. **ఒక అభియోగం ఆపాదించబడినప్పుడు, పక్షపాత రహితంగా విచారణ పొందే హక్కు.**
6. **స్వేచ్ఛగా స్వదేశంలో, విదేశాల్లో పర్యటించే హక్కు.**
7. **సురక్షిత ప్రాంతంలో ఏకాంతంగా జీవించే హక్కు.**

**ఇవికాక జీవించే హక్కు, సామాజిక భద్రతా హక్కు, భావ స్వాతంత్ర్య హక్కు, విద్యాహక్కు, పిల్లలు ఆడుకొనే హక్కు, ప్రజాస్వామ్య హక్కు, కాపీరైటు హక్కు, జాతీయత హక్కు, ఏమతాన్నయినా స్వీకరించే హక్కు వంటి మానవ హక్కులు ఎన్నో ఉన్నాయి.**

**మానవ హక్కుల కమీషన్‌కు ఫిర్యాదు చేసే అంశాలు:**

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారిపై అత్యాచారాలు, వెట్టిచాకిరి, బాలకార్మిక వ్యవస్థ, మతపరమైన అంశాలు, బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, మహిళపై అత్యాచారాలు, పోలీసులు తప్పుడు కేసులు బనాయించడం, పోలీసు నిర్భందంలో ఉన్నప్పుడు పోలీసులు వేధించడం, పోలీసులు బాధితులు ఫిర్యాదుల మీద చర్యలు తీసుకోవడానికి నిరాకరించడం.

**ఫిర్యాదు చేసే విధానం...**

ఎవరైనా సరే తమ హక్కులకు భంగం వాటిల్లుతోందని భావిస్తే నేరుగా మానవహక్కుల కమిషన్లను ఆశ్రయించవచ్చు. బాధితుడు లేదా బాధితుల తరపున ఎవరైనా హక్కుల కమిషన్ లో పిటిషన్ దాఖలు చేయవచ్చు. హిందీ, ఇంగ్లిష్ లేదా రాజ్యాంగం గుర్తించిన ఏదేనీ ప్రాంతీయ భాషల్లో ఈ ఫిర్యాదు ఉండాలి. నేరుగా వెళ్లి ఫిర్యాదు ఇవ్వవచ్చు. లేదా పోస్ట్ లేదా ఫ్యాక్స్, మెయిల్ ద్వారానూ పంపవచ్చు. మొబైల్ ఎస్ఎంఎస్ ను కూడా కమిషన్ పరిగణనలోకి తీసుకుంటుంది. ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన పని లేదు.

**ఫిర్యాదు చేయకపోయినా విచారణ**

బాధితుల పిటిషన్ పైనే కాదు మీడియాలో వచ్చిన కథనాలు లేదా ఇతర మార్గాల్లో హక్కుల ఉల్లంఘన సమాచారం తెలిసినా కూడా కమిషన్ స్పందించి సుమోటోగా హక్కుల ఉలంఘనపై విచారణకు ఆదేశిస్తుంది. అలాగే కోర్టుల ఆదేశాలతోనూ కమిషన్ జోక్యం చేసుకోవచ్చు. ఉల్లంఘన జరగకుండా చూడడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైనా కమిషన్ స్పందిస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘనల ఆరోపణలకు సంబంధించి కోర్టు దగ్గర పెండింగ్ లో ఉన్న ఏ కేసు విషయంలో నైనా కోర్టు అనుమతి మేరకు కమిషన్ జోక్యం చేసుకోవచ్చు.

అస్పష్టంగా ఉన్నా, ఫిర్యాదు దారుడు వివరాలు లేకపోయినా, అప్రధానమైన ఫిర్యాదులను కమిషన్లు స్వీకరించవు. అలాగే రాష్ట్ర హక్కుల కమిషన్ వద్ద ఫిర్యాదు పెండింగ్ లో ఉంటే అదే అంశంపై జాతీయ కమిషన్ ఫిర్యాదును విచారించదు. అలాగే కోర్టు విచారణలో ఉన్న అంశాలపై

హక్కుల కమిషన్లను ఆశ్రయించడానికి లేదు. హక్కుల ఉల్లంఘన అంటే సరిపోదు. అందుకు సంబంధించి నిర్దిష్ట వివరాలు ఇవ్వాలి. ఒకవేళ సివిల్, క్రిమినల్ కేసు అయి ఉండి కోర్టు అప్పటికే ఆ కేసు విచారణను చేపట్టి ఉంటే వాటిపై కమిషన్లు సమాంతరంగా విచారణ చేపట్టడానికి వీల్లేదు. హక్కుల ఉల్లంఘన జరిగి ఏడాది దాటిపోతే దానిపై కమిషన్లు విచారణకు ఆదేశించలేవు. చివరిగా కమిషన్ల తీర్పులు, ఆదేశాలు న్యాయవ్యవస్థ పరిధికి లోబడి ఉంటాయి. ఒకసారి పిటిషన్ దాఖలయ్యాక దానిపై తుది ఆదేశాలు వెలువడే వరకు పలు దశలు ఉంటాయి.

### విచారణ క్రమం

బాధితులు లేదా వారి తరఫున తమకు ఏ మార్గంలో పిటిషన్ అందినా దాన్ని కమిషన్ లోని ఇన్ వార్డులో సిబ్బంది నమోదు చేస్తారు. ఒకసారి పిటిషన్ ను నమోదు చేసుకున్న తర్వాత దాన్ని పరిశీలన విభాగానికి పంపుతారు. ఇక్కడ హక్కుల గురించి, చట్టాల గురించి తెలిసిన సిబ్బంది పిటిషన్ లోని అంశాలను పరిశీలిస్తారు. హక్కుల ఉల్లంఘన ఉంటే విచారణకు స్వీకరిస్తారు. లేదనుకుంటే తిరస్కరిస్తారు. స్వీకరించే పిటిషన్ ను కంప్యూటర్ లో నమోదు చేసి ఓ రాండమ్ కోడ్ కేటాయిస్తారు. అదే పిటిషన్ కోడ్ అవుతుంది. ఆమోదించిన పిటిషన్లకు సంబంధించి కాజ్ లిస్ట్ రూపొందిస్తారు. విచారణ ఏ తేదీన జరుగుతుందో ఈ విభాగం సిబ్బంది తెలియజేస్తారు. ఆ తేదీన పిటిషన్ పై విచారణ చేపడతారు.

### కమిషన్ అధికారాలు

కేసుల విచారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ఏ దర్యాప్తు సంస్థ సేవలను అయినా కమిషన్ వినియోగించుకోవచ్చు. కమిషన్ కు స్వతంత్ర ప్రతిపత్తి ఉంది. కేసు విచారణలో భాగంగా ప్రాథమిక సమాచారం లేదా నివేదిక సమర్పించాలని సంబంధిత ప్రభుత్వ విభాగాలను కమిషన్ ఆదేశిస్తుంది. నిర్ణీత గడువులోపు ఆయా విభాగం నివేదిక ఇవ్వకుంటే కమిషన్ సిబ్బందే నేరుగా సమాచారాన్ని సేకరిస్తారు. ఒకవేళ నివేదిక అందితే దాన్ని పరిశీలిస్తారు. హక్కుల ఉల్లంఘన జరిగినట్టు తేలితే చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం... బాధితులకు పరిహారం చెల్లించాలంటూ ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. హక్కుల ఉల్లంఘన జరగలేదని నివేదిక వస్తే విచారణ నిలిపివేస్తుంది. హక్కుల ఉల్లంఘన జరిగినా, లేదా హక్కుల ఉల్లంఘనను నివారించడంలో ప్రభుత్వ ఉద్యోగి నిర్లక్ష్యం బయటపడినా సంబంధిత వ్యక్తులపై చర్యలకు కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేయవచ్చు.

కమిషన్ లో విచారణ ప్రక్రియ కోర్టుల్లో కేసు విచారణ తీరులోనే ఉంటుంది. వేరే అంశాలు కూడా అందులో ఉన్నాయని భావిస్తే కోర్టుకు నివేదించవచ్చు. పిటిషన్ పై విచారణలో భాగంగా సాధారణ కోర్టు వలే కమిషన్ కూడా సాక్ష్యాధారాలను, సాక్షులను ప్రవేశపెట్టాలని కోరవచ్చు. హక్కుల కమిషన్లు న్యాయ వ్యవస్థ పరిధిలోకి రావు. కేవలం విచారణ ప్రక్రియలో భాగంగా సాక్షులు, సాక్ష్యాధారాల ప్రవేశానికి వీలుగా సెక్షన్ 13 కింది కోర్టుల వలే కొన్ని అధికారాలను వీటికి కట్టబెట్టారు.

### కమిషన్ పరిధిలో ఈ అధికారాలు కూడా...

ప్రభుత్వ జైళ్లు, హాస్టళ్లు, సంరక్షణ కేంద్రాలు, ఆస్పత్రులు లేదా పోలీస్ స్టేషన్లు, లేదా ఏదేని ప్రభుత్వ కార్యాలయాన్ని సందర్శించవచ్చు. జైళ్లలో ఉన్న ఖైదీలకు హక్కుల ప్రకారం అన్నీ అందుతున్నాయా లేదా పరిశీలించగలదు. కమిషన్ చైర్మన్, ఇతర సిబ్బంది నేరుగా తనిఖీ చేయవచ్చు. అక్కడి పరిస్థితులు మెరుగ్గా లేకుంటే ఆ దిశగా ప్రభుత్వానికి తగిన . సిఫారసులు చేయగలదు. హక్కుల సంరక్షణకు సంబంధించి చట్టాలను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా సమర్థవంతంగా అమలు చేసే దిశగా తగిన సిఫారసులు చేయవచ్చు. ఎన్ కౌంటర్లు జరిగిన సందర్భాల్లో హక్కుల ఉల్లంఘనల ఆరోపణలు వస్తే సంఘటనా స్థలాలను కూడా కమిషన్ ప్రతినిధి బ ృందం సందర్శించవచ్చు.

బాధ్యతారహితంగా వ్యవహరించే పాలనా యంత్రాంగాన్ని కొన్ని వ్యవస్థలను జవాబుదారీతనం చేయడంలో జాతీయ, రాష్ట్ర మానవ హక్కులు కమీషన్లు కొంతమేరకు విజయవంతమైనప్పటికీ ఇంకా మానవ హక్కుల పరిరక్షణ చట్టాన్ని సవరించి కమీషన్లకు మరిన్ని అధికారాలు కల్పించ వలసిన అవసరం ప్రభుత్వాలపై ఉంది. అయితే ఈ కమీషన్ల యొక్క పనితీరు, ఇవి చేసే మేలు గురించి దేశంలో 90 శాతం ప్రజలకు అవగాహన లేదు అని చెప్పవచ్చు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించవలసిన అవసరం ప్రభుత్వాలపై ఉంది. చురుకైన పౌర సమాజం, మానవ హక్కుల స్పృహ కలిగిన ఉద్యోగి, రాజకీయ నాయకుల్లో చిత్తశుద్ధి ఈ మూడు అంశాలు మానవ హక్కుల కమీషన్లకు బలోపేతం చేస్తాయి.

వివక్షత లేనటువంటి మానవ సమాజం నిర్మాణం కావాలంటే ప్రభుత్వాలు శాంతి భద్రతలు విలసిల్లేందుకు కృషి చేయాలి. అందరికీ అన్నింటా సమాన హక్కులు పొందేలా సాయమందించాలి. ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. అప్పుడే సమాజం శాంతి భద్రతలతో సౌభాగ్యాలతో విరసిల్లుతుంది.

**– ఎం . ప్రదీప్‌కుమార్**

**రీసెర్చ్ అసోసియేట్, టి.ఎస్.ఐ.ఆర్.డి.**

Published by: Pausumi Basu, IAS Chief Executive Officer, on behalf of TSIRD,Govt. of Telangana, Hyderabad.



టిఎస్ఐఆర్డిలో జరిగిన 4వ కామన్ రివ్యూ మిషన్ సమావేశంలో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తున్న
కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు



టిఎస్ఐఆర్డిలో జరుగుతున్న 5వ బ్యాచ్ బేర్‌ఫుట్ టెక్నిషియన్స్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా
ఇంగ్లీష్‌బాండ్ మరియు ఫ్లేమింగ్ బాండ్ నిర్మాణం పరిశీలిస్తున్న టిఎస్ఐఆర్డి ముఖ్యకార్యనిర్వహణాధికారి శ్రీమతి పౌసమి బసు ఐఏఎస్



టిఎస్ఐఆర్డిలో ఆవరణలో రాక్‌గార్డెన్ అభివృద్ధిలో భాగంగా వృధాగా పడివున్న గ్రానెట్‌రాయి పై చిత్రీకరించిన గుడిసె చిత్రం

Published on 15-12-2018 Sthanika Paalana RNI No.APTEL/27888/2009.




## మనిషికి మానవ హక్కుల కల్పనే సాధికారతకు మార్గం

తాజా సమాచారం కోసం www.tsird.gov.in
మరియు YouTube facebook /tsird